UNIVERSAL
LIBRARY
OU_204751
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 82.6 N21A        Accession No. T 4457

Author

Title

This book should be returned on or before the date last marked below.

# ఆశీస్సు

పదాడంబరంగాని, గ్రంథవిస్తరణగాని లేకుండా చెప్పదలుచుకున్నది క్లుప్తంగా చెప్పడంలో శ్రీ నరసింహారావుగారు సమర్థులు. ఆ చాకచక్యం ప్రచార సాహిత్యంలో కనబర్చడం కొంత కష్టం. వీరి రచనలో ఆ కష్టం కూడా కనుపించదు. తెలంగాణంలో దౌర్జన్యవాదులు ప్రబలిపోయినప్పుడు ప్రజలలో శాంతి ప్రియత్వం కలిగించడానికి నరసింహారావుగారి రచనలు చాలా సహాయపడినవి. తెలుగు పల్లె హృదయం వారికి తెలుసును. అందుకే [illegible] ప్రభుత్వంవారు ఏర్పరచిన నాటక రచనా పోటీలలో వారి రచనకు అగ్రస్థానం లభించింది. నవభారత నిర్మాణానికి మార్గమేమిటో ప్రణాళికా పరమార్థం ప్రజలకు తెలియజెయ్యడంలో సాహిత్యం ఎంతగానో తోడుపడగలదు. అసలు సద్భావప్రచారమే సాహిత్యప్రయోజనం. ఈ ప్రచారం సాహిత్య స్థాయికి వచ్చినప్పుడే సంతోషహేతువై ప్రజానీకానికి నచ్చుతుంది. అందుకనే గురజాడ వారిట్లా చెప్పినట్లు :

ఆకులందున అణగిమణగీ
కవితకోకిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమందభిమానములు
మొలకలెత్తవలెనోయ్ !

ఈ మార్గం అనుసరించినవారు శ్రీ నరసింహారావుగారు. వారు ఇంకా రచనలు చెయ్యవలసివుంది. "అడుగుజాడలు" సాధించిన ప్రోత్సాహం వారికి ఉత్సాహకారణం కాగలదు.

కపిల కాశీపతి

# నమస్కారం

ఒకనాడు 'గెలుపు నీదే' నాటకం వ్రాయడం జరిగింది. వ్రాయనైతే వ్రాశాగాని దాన్ని ఇతరులకు చదివి వినిపించాలంటే చాలా భయం వేసింది. ఏదో తెలియని ప్రేరణతో, ఉత్సాహంగా వ్రాశానే గాని-ఇతరులకు చూపితే నవ్వుతారనిపించింది. అయితే - శ్రీ కోదాటి నారాయణరావుగారు అది చదవక తప్పదని—ఓపికగా, సానుభూతితో విన్నారు. 'పర్వాలేదు. మనసులో వుంది వ్రాయడానికి ఎప్పుడూ వెను దీయకు. ఈ రంగంలో కృషిచేయవలసింది'గా వీపుతట్టి దీవించారు. వారిచ్చిన ధైర్యాన్ని ఎప్పుడూ మరువలేను. వందలాదిగా సాగిన ఆ నాటక ప్రదర్శనలు, దానిపై వచ్చిన విమర్శలు చూశాక ఈ రంగంలో ధైర్యంగా కృషిచేయవచ్చుననే విశ్వాసం బలపడింది.

ఆ నాటకాన్ని ఒకసారు శ్రీ కపిల కాశీపతిగారు చదివారు. తర్వాతెప్పుడో నేను వారిని కలిశాను. "చక్కగా వుంది. ఇంతటితో ఆగకూడదు. ఇంకా కృషి చేయాలి. దేశభవిష్యత్ మీబోటి యువకుల చేతుల్లోవుంది"అన్నారు.

"దేశభవిష్యత్ యువతీ యువకుల చేతుల్లోవుంది"అనే మాట పదేపదే వింటున్నదే. అయితే - ప్రత్యక్షంగా వారాసమయంలో ఆమాట అనడం నాపై ఎంతోపనిచేసింది. అవును. రచయితగా దేశాభి వృద్ధికి తోడ్పడే పనేదైనా చేయాలనే ఆలోచన తొలవడం ప్రారంభించింది.

దేశపరిస్థితులను గూర్చి తీవ్రంగా ఆలోచించాను. అనేక అవకతవకలు భూతాల్లా గుడ్లెర్రజేసి కొట్టొచ్చినట్లు కనిపించాయి. నిజమే. కాని - ప్రశాంతంగా, నిశ్చలంగా చూసినప్పుడు మనోనేత్రానికి ఈ భూతాల వెనకాల మహత్తరమైన మంచి, అభివృద్ధి - అప్పుడే ఉద

యిస్తున్న సూర్యునిలా మబ్బుమబ్బుగా గోచరించింది. తప్పకుండా ఆ సూర్యుడు పైకి ఎక్కివచ్చే సూచనలున్నాయనీ,అవకతవక భూతాలన్నీ ఆయన కాంతిని చూడలేక కళ్ళు మూసేసి, నీరసించి పోతాయనీ ఊహించాను. ఆ ఊహే ఈనాటక రూపం దాల్చింది.

ఈ నాటకాన్ని వినగానే మిత్రులు శ్రీ డి. రాజేశ్వరరావుగారు మరికొందరు మిత్రులతో ప్రదర్శింతామని సన్నాహాలు చేశారు. ఇంతలో ప్రభుత్వం - దేశాభివృద్ధి కృషికి తోడ్పడే నాటక పోటీలను పెడుతున్నట్టు ప్రకటించింది. ఆ ప్రకటనలోని నియమాల్లో ముందు ప్రదర్శన జరుగకూడదని ఉంది. దాంతో ప్రదర్శనను విరమించుకొని పోటీకి పంపవలసిందిగా శ్రీ రాజేశ్వరరావుగారన్నారు. అవసరమైన పాటలను మిత్రులు 'అజ్ఞాతుడు' వ్రాసిచ్చారు. పోటీలకు పంపాను. ప్రథమ బహుమతి లభించింది.

అయితే - అవసరమైన ప్రదర్శనలుసాగడానికి పుస్తకాలు అవసరంకనుక దీన్ని ప్రచురించడానికి ఆంధ్ర బుక్ హౌస్ అధిపతులు శ్రీయల్లాప్రగడ నారాయణరావుగారు పూనుకున్నారు.

ఇక ఈరోజు అఖిల భారత సహకార సప్తాహ సందర్భంలో మొదటిసారిగా హైదరాబాదులో ఈనాటక ప్రదర్శన జరుగుతున్నది.

ఈ విధంగా ఈ నాటక రచననుంచి ప్రదర్శనవరకు ప్రత్యక్షంగా పరోక్షంగా తోడ్పడ్డ పెద్దలు, మిత్రులందరికీ నా నిండు కృతజ్ఞతలు తెలుపకుండా ఉండలేను.

ఇక సహృదయ పాఠకులు, ప్రేక్షకులు ఇచ్చే అభిప్రాయాల కోసం ఎదురు చూస్తున్నాను.

ఈ నాటకాన్ని బహిరంగస్థలాల్లో వేదిక నిర్మించి ప్రదర్శిస్తే ఎక్కువ మంది చూసే వీలుంటుంది. నాటకాని కవసరమైన పరి

కరాలు ఎక్కడైనా - ముఖ్యంగా పల్లెల్లో తప్పకుండా లభిస్తాయి. ఆయా రసాలను సూచించేందుకు తగిన రంగు గుడ్డలను వాడినా పర్వాలేదు.

నాటక ప్రదర్శనకు ప్రత్యేక అనుమతి అక్కర్లేదు. అయితే ప్రదర్శన జరుగుతున్న సంగతీ, ఎలా ప్రదర్శన సాగిందీ తెలుపగలిగితే సంతోషం.

9 నవంబర్ 1956
హైద్రాబాదు

నరసింహారావు

1956 నవంబర్ నెల 9వ తేదీన అఖిలభారత సహకారసప్తాహ సందర్భంలో ప్రప్రథమంగా ఈ నాటకం ఇండియన్ నేషనల్ థియేటరువారిచే ప్రదర్శించబడింది. అందులో పాల్గొన్న నటీనటులు :

| | |
|---|---|
| గోపయ్య | : శ్రీ ఎ. ఆర్. కృష్ణ |
| నరసయ్యన్న | : శ్రీ తురగా కృష్ణమోహనరావు |
| చంద్రం | : శ్రీ పన్నూరి రామారావు |
| పాపన్న | : శ్రీ శ్రీనివాసరావు మంత్రి |
| వెంకటపతి | : శ్రీ కర్రా సుబ్బారావు |
| దాసు | : శ్రీ ఎస్. గోపాలమూర్తి |
| కొమరన్న | : శ్రీ వై. నర్సిరెడ్డి |
| సీత | : కుమారి కృష్ణవేణి |

## ఇందులో—

| | | | |
|---|---|---|---|
| ౧. | గోపయ్య | ... | మోతుబరి రైతు |
| ౨. | నరసయ్యన్న | ... | గ్రామంలోని పెద్దమనిషి |
| ౩. | వెంకటపతి | ... | సహాకారసంఘ కార్యదర్శి |
| ౪. | చంద్రం | ... | గోపయ్య మేనల్లుడు |
| ౫. | దాసు | ... | డాక్టరు, చంద్రం సహాచరుడు |
| ౬. | కొమరన్న | ... | తపాల బంట్రోతు |
| ౭. | పాపన్న | ... | వెంకటపతి బంటు |
| ౮. | సీత | ... | గోపయ్య కూతురు |

# అడుగుజాడలు

## ఒకటవ రంగం

### గోపయ్యా ఇల్లు

[రైతుఇంట్లో ఉండదగ్గ సామాన్లు. గోపయ్యా భార్య శేషమ్మ ఫోటో మాత్రం ప్రేక్షకులకు కనిపించేట్టు వుండాలి. గోపయ్యా ఒక బల్లమీద కూర్చొని భారతంలో పద్యం చదవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని—బయట పాట ధ్వని ఎక్కువై అతని చదువుకు అంతరాయం కలిగిస్తున్నది.]

అయ్యల్లారా అమ్మల్లారా అన్నల్లారా అక్కల్లారా
అడుగులు వేద్దాం అందరమొకటై మహాత్ములందరి అడుగుజాడలలో
పోయాయ్ ఎప్పుడో ఇతరుల శ్రమతో తమతమ కడుపులు నింపేరోజులు
వచ్చాయిప్పుడు మనపని మనమే వళ్ళువంచుకొని చేసెడిరోజులు॥అడు॥
గునపాల్ తట్టలు చేతబట్టుకొని రోడ్లు వేయుదము పదరండోయ్
ఒంపులు దింపులు బురదగుంటలు పూడ్చివేయుదము రారండోయ్॥
మనకనువయ్యే సౌకర్యాలు మనంత మనమే సాధిద్దాం
కష్టపడినచో కరువేలేదని లోకమంతకూ చాటిచెప్పుదాం ॥అడు॥

[ఈ పాట ఆగుతుందేమోనని లేచిబయటికి చూశాడు. తగ్గలేదు. మళ్ళీ చదువుదామని చూశాడు. సాగలేదు. విసుగు ఎక్కువైంది. చప్పున బయటేదో కనబడ్డట్టు లేచి]

గోపయ్యా : సీతా! సీతా! (గట్టిగా) సీతా!

సీత : (తట్టమోస్తున్న వేషంతో గబగబావచ్చి) ఏమిటి నాన్నా?
(బయట పాట తగ్గిపోతున్నది)

గోప : పిలుస్తుంటే వినబడడంలేదా? చెవుడా?

సీత : లేదునాన్నా! అవతల పాటపాడుతుంటే వినబడ్లేదు.

గోప : ఆటలూ, పాటలూ! ఏంచేస్తున్నావు?

సీత : ఇదిగో-భవనం కట్టుకుంటే మందులవీ ఇచ్చి ఆస్పత్రి నెలకొల్పు తామన్నారుగదునాన్నా! భవనం పూర్తయిపోయింది. చక్కగా వుందినాన్నా. చుట్టూ కాస్త సదనంగావుంటే బాగుంటుందని కంకరా, మన్నూ వేసేస్తున్నాం.

గోప : దాన్నెవరూ వర్ణించమన్లే, నిన్నీ పనికి ఎవరు పూనుకో మన్నారు?

సీత : ఒకరు పూనుకోమనేదేముందినాన్నా. ఊరికి ఆసుపత్రీ, బడీ, పోస్టాఫీసూ ఇలాంటివన్నీ అందరికీ అవసరమేగా?

గోప : మాకులేని అవసరాలు మీకే వచ్చాయా?

సీత : మీరు పెద్దవారనీ, ఈపని చేయలేరనీ మేము వెళ్ళాము.

గోప : నాతరఫున వెళ్ళారన్నమాట. ఏమిటీ వేషం? అవతారమెలా వుందో కాస్త అద్దంలో చూసుకో!

సీత : మనమెలాఉంటే అద్దమలా చెబుతుంది. వేరేచూడడ మెందుకూ?

గోప : ఊఁ. మాటకు మాట ఎదురుచెప్పేదాకా వచ్చిందన్నమాట.

సీత : ఎదురుచెప్పడం కాదునాన్నా. నేనేం తప్పుచేశానని కోప్పడు తున్నావు?

గోప : ఏం తప్పుచేశానని ఎంత నెమ్మదిగా అడుగుతున్నావేమే! ఆమాటనడానికి సిగ్గుండక్కర్లే?

సీత : అంత అపరాధం ఏంచేశానని?

గోప : తగుదునమ్మా అంటూ నీవు బయలుదేరావుగాని—మరెవరైనా బయలుదేరారా నీతోపాటు?

సీత : అదేమిటినాన్నా—అలా అంటావు, ఊరు పూరంతా కదిలింది.

గోప : ఆడవాళ్ళ సంగతి నేను చెప్పేది.

సీత : వాళ్ళూ వచ్చారు.

గోప : మన సాటివాళ్ళెవరైనా ఉన్నారా?

సీత : అంటే?

గోప : అంటే — కొంటే. వెంకటపతిగారి అమ్మాయిలెవరైనా వచ్చారా?

సీత : ఎవరో కొందరు రాలేదని—వెళ్ళేవాళ్ళు ఎందుకాగాలి?

గోప : రానివాళ్ళు ఎందుకు రావడంలేదో ఆలోచించక్కర్లే? ఒకపని చేసేప్పుడు—పరువు, మర్యాద ఆలోచించొద్దూ?

సీత : ఇందులో పరువు మర్యాదలు పొయ్యేదేమిటో నాకర్థం కావడంలే.

గోప : అవును. అది నీకెలా అర్థమవుతుంది? నా కర్థమవుతుంది. బయటికెడితే నా గతేమిటో ఆలోచించావా?

సీత : మీకంత కష్టంకలిగించేంత తప్పుపనా నాన్నా ఇదీ?

గోప : కాదా? ఒక పరువుగల ఆడది—పదిమందిలో తిరుగుతూ రాయీ రప్పా మోస్తున్నదంటే నా మోషీకాదూ? పెళ్ళికాని పిల్లను—అదుపూ ఆజ్ఞలులేకుండా అలా గాలికి వదిలేశానని పదిమంది చాటుగా, నేటుగా అంటుంటే తల వొంచుకో వలసినవాణ్ణి నేనుగాని నీవు కావుగా?

సీత : నీ పరువు మర్యాదలకు భంగం కలిగితే నాకు కలిగినట్టు కాదా నాన్నా?

గోప : అదితెలిసే ఇలా ప్రవర్తిస్తున్నావా?

సీత : ఇది తప్పని అనుకోవడంలేదునాన్నా. గ్రామంలో ఎవరూ చేయని సాహసం మీరుచేసి-ఆడవాళ్ళకు చదువు చెప్పించారని సంతోషించాను; నాకొక కొత్త ప్రపంచాన్ని చూపి —

ఈ ప్రపంచంలో నేను నిర్వహించాల్సిన బాధ్యతలను గుర్తింప జేశారని ఆనందించాను.

గోప : అదే ఇంతవరకూ వచ్చింది. అందరిలాగే చిన్నప్పుడేపఅయ్యకో ముడిబెట్టేస్తే నాబాధ్యత తీరిపొయ్యేది. ఈ చదువులనీ, తెలివి తేటలనీ, ఆదర్శాలనీ భ్రమసి పరువుమర్యాదలను పోగొట్టు కునే స్థితికొచ్చింది బ్రతుకు.

సీత : అదేమిటినాన్నా—అలా అంటారు? ఇన్నాళ్ళూ మీరు చెప్పిన విష యాలను వ్యతిరేకించానా?

గోప : అయిందేమో అయింది. ఇకనేను ఇలా పదిమందితో మాటలు పడలేను. ఏ అయ్యకోచూసి ముడిపెట్టదలుచుకున్నాను.

సీత : ఏ అయ్యకో ఏమిటి నాన్నా?

గోప : అవును. చంద్రంతో నీవివాహం జరగదు.

సీత : (గద్గదకంఠంతో) అదేటినాన్నా చిన్నప్పటినుంచిపెంచి, చదువు చెప్పించి, అత్తయ్యకు మాటఇచ్చి-చివరకిలా అంటావానాన్నా·

గోప : అనుకున్నాను. అందరిలాగే అతనూ ఏ ఉద్యోగమో చేసుకొని-ప్రయోజకుడవుతాడనుకున్నాను. కాని—లాభంలేదు సీతా! అతనికి చెప్పించిన చదువూ, అతనిపై పెట్టుకున్న ఆశలు—అన్నీ వృధాఅయ్యాయి. అతనికివ్వడంవల్ల నువ్వు సుఖపడ్తావనే నమ్మ కంనాకులేదు. గ్రామాలనీ, అభివృద్ధనీ వెర్రిభ్రమలు పెట్టుకొని బంగారంలాంటి ఉద్యోగాన్ని వదులుకొని రావడం నాకిష్టం లేదు. నీవూ అతనితోపాటు పూరేగడం అంతకన్నా ఇష్టంలేదు. ఇకపైన అతని బ్రతుకు అతనిది; మనబ్రతుకు మనది.

సీత : బావను వెళ్లగొడ్తావా నాన్నా?

గోప : మనసులు కలవనప్పుడు వేరుగా ఉండడమే మంచిది.

సీత : అన్యాయం చేయకు నాన్నా. బావ కన్యాయం చేయకు. చిన్నప్పటినుంచి నీ చేతుల్లో పెరిగాడు; నిన్ను నమ్ముకున్నాడు.

గోప : (పెడముఖంగా) నన్నింక వొత్తిడిచేయకు సీతా! నే నెప్పుడో ఆ నిశ్చయానికొచ్చాను. నీవిక అతని విషయం ఎంత తొందరలో మరిచిపోతే అంతమంచిది.

సీత : అది అసంభవంనాన్నా! బావకు నేను మాటఇచ్చాను. ఈకార్యక్రిమాల్లో నేనతనికి చేదోడువాదోడుగా వుంటానని వాగ్దానం చేశాను. నేను మాట తప్పలేను నాన్నా. నేనూ ఆయనతోటే వుంటాను. (బయటికి వెళ్ళబోతుంది. గోపయ్య చప్పున తిరిగి సీత రెట్టబట్టు కొని, తట్ట విసిరిపారేసి)

గోప : ఆఁ. అందాకా వచ్చిందీ...నీవెక్కడికీ కదలడానికి వీల్లేదు. మాట ఇచ్చావా—మాట! ఎవర్నడిగి ఇచ్చావు? నేనిక్కడ బ్రితికివున్నానని మరిచే పొయ్యావా? అప్పుడే ఇంత అహంకారమా? నడువు లోపలికి, గదిలో పడుండు. అదే నీకు తగింది.

(ప్రిక్క గదిలోకి నెట్టి బయట గొళ్లెం పెడుతుంటాడు. లోపల్నించి సీత)

సీత : నాన్నా! నాన్నా! నన్ను బందీని చెయ్యకు. గొళ్ళెంపెట్టకు. నాన్నా! గొళ్ళెం పెట్టకు, నన్ను వదిలెయ్యి.

గోప : అరవకు. అరిచావంటే ఏకంగా గోడే పెట్టించేస్తాను.(పూర్తిగా రంగంమీదికొస్తూ) బావకు మాటఇచ్చావా—మాట! అప్పుడే ఇంత అహంకారమా! ఇంత స్వేచ్ఛా! (బల్లమీద కూలబడి గబగబా పొరచుట్ట చుడుతుంటాడు. కొంతసేపు ఆపనిలో వున్నాక—కొమరన్న ప్రవేశం)

కొమ : గోపయ్యగారూ!

గోప : (తలెత్తి) ఎవరది?

కొమ : నేను కొమరన్ననుండి.

గోప : ఊఁ......ఎందుకొచ్చావు?

కొమ : దవాకానా తయారైందికాదుండీ...

గోప : దవాఖానాలు, టపాఖానాలు, పాగల్ ఖానాలు...... అందరికీ ఇదో పిచ్చి పట్టినట్టుందే! ఆఁ తయారైతే?

కొమ : ఓ సబసువంటిది జరిపిఅంగ్ల దవాకాన సురుచేద్దామని ఊరంత అనుకుంటున్రు. తవఁరుగూడఆడికి.......

గోప : ఇలాంటి దవాఖానాలు, రోడ్లు, బావులూ తయారుచేయించి; సభలూ, సమావేశాలు జరిపించటానికి ఉన్నాడుగా మీ చంద్రం గారు.

కొమ : ఆలే పంపిన్రుండి. తవఁరికీమాట మనివిజేసి రమ్మాన్రు.

గోప : ఊఁ ఊళ్లో ఆయన చెప్పే దొర; మీరంతా వినే బంట్రోతులు.

కొమ : అదేందుండి—అట్టంటరు. ఆరుగూడ మాతో బరాబర్ గ తిట్ట మొయ్యటం లేదుండి. అసలు—ఆరులేంది ఈ పనికి ఉసారిచ్చేదోరు? అమ్మో ఆరులేందే — మనూరుకు రోడ్డు పడునా? ఎరువులొచ్చునా? మందులొచ్చునా......

గోప : టపాఖానా వచ్చునా? నీకు టపా తెచ్చే పని దొరుకునా?

కొమ : అంతకుముంగల బతకలేదా ఎట్టనుండి? మీరన్నేఅంటడూ. అయినగని—కోళ్లు పెంచియ్యటం, పాలుగిట్ట జమజేపిచ్చటం, బడి పెట్టిచ్చటం—ఇసువంటియన్ని సురూజేపిచ్చినంక—ఎంతమందికి కొత్తంగ ఏరే పనులు దొరకలేదంటరు?

గోప : ఏమైనా—నువ్వయితే పాపన్నకు పోటీపడి సంపాదించిందేగా ఈ ఉద్యోగం.

కొము : మీరదే మాటన్నారు! టపాకానొస్తదనెటోర్కు ఇంగ పాపన్నకన్న జర్ర రొండు అచ్చరాలొచ్చుండె. నాకైతె ఆ కాస్త రాకపాయె. దానికి అచ్చరాలు రావాలెగద.

గోప : మరి—నీకెట్లా వచ్చిందీపని?

కొము : ముంగల పాపన్న సడిగితె—అసలు మనూరుకు టపాకానే వొద్దన్నడంట. మీకు తెలవందేవుండది—ఆని దదోమతంలేరి. ఇంగ—ఇంతల్నే శంద్రవ(య్యగారి నా కడుపుల రొండచ్చ రాలేసిన్రు. ఇంతల్నే టపాకాన రానేవొచ్చింది. పని జూపిన్రనుకోరి. పాపన్న ఇప్పడనుకుంటాండు—తనకీ పనిదొరక్క పాయెనే అని.

గోప : మొత్తంమీద వాడికి నువ్వు పోటీపడ్లేదంటావు?

కొము : సాంవి( తోడుండి. ఊకెనే ఆడు పడీపడక అంటుంటడు...... సరెగని—తవ(రు బయటెల్లరూ? పెద్దలంతుడాల్నని జనం అంటాన్రు. మీకోసం ఎదురు సూస్తాన్రాడ.

గోప : రానని చెప్పు. మీరో భవనాలు కట్టేవారు; మేను దానికి వచ్చేవారమా?

కొము : రావ(టారు?

గోప : మళ్ళీచెప్పాలా?

కొము : సల్లేరి—పంచేస్తం?

**(కొమరన్న బయటికెడుతుంటే—లోపలికొస్తున్న వెంకటపతి ఎదురుపడ్డాడు. ఒకరికొకరు ఎగాదిగా చూసుకొంటారు.)**

వెంకట : (గోపన్న ప్రక్కన బల్లమీద కూచుంటూ) ఏం, కొమరన్నొచ్చాడు? అల్లుడుగారేమన్నా డబ్బుకోసం కబురంపారా?

గోప : (మరో పొగాకుకాడ అందిస్తూ) ఆ(... మీకెప్పుడూ డబ్బు ముచ్చటే. డబ్బుకోసం ఏమిటండీ?

వెంక : అదికాదండీ. చూస్తూ చూస్తూ పాపం చక్కని నౌకరీ వదులు కొని వచ్చాడుగా. ఇక డబ్బుకు ఇబ్బందికాదూ మరి.

గోప : ఇబ్బందేముంది? టపాఒకటి లంకించుకొన్నాడు. దానితో వచ్చేదాంతో ఏడుస్తున్నాడేమో! పోనిద్దురూ...వాడేడుపు వాడేడ్చుకుంటున్నాడు.

వెంక : అల్లునిమీద ఒక్కసారే అంత మూతివిరుపు?

గోప : అల్లుడట—అల్లుడు. మీకుతెలియందేముంది వెంకటపతిగారూ! ఇదిగో, మీరే అన్నారుగా—బంగారంలాటిపని వదులుకొని ఇక్కడేదో పీక్కుతిందామని రావడం నాకేం నచ్చలేదు.

వెంక : ఆఁ-మీరన్నట్లు కుర్రతనంమరి. పెళ్ళిచేసేస్తే బాధ్యతలు నెత్తిన బడ్తాయి. అప్పుడు తెలుస్తుంది—ఉద్యోగం ఎందుకవసరమో.

గోప : వాడి పెళ్ళి నేచేసేదేమిటి?

వెంక : అదేమిటండోయ్! చిత్రంగా మాట్లాడేస్తున్నారు. (చుట్టలు వెలిగిస్తారు) కూతురుతోపాటు చిన్నప్పటినుంచి మీ పోషణలో వుంచుకున్నారు; బోలెడు డబ్బుఖర్చుచేసి చదువుచెప్పించారు; వాడి కాళ్ళు, వీడి కాళ్ళు పట్టుకొని ఉద్యోగంకూడా ఇప్పించారు; చివరకు పెళ్ళికూడా చేసేస్తే మీ బాధ్యత తీరి పోతుందిగా?

గోప : అట్లా అనుకునే ఇదంతా చేశాను వెంకటపతిగారూ! ఏదైనా ఒక పనిలో స్థిరపడితేగాని పెళ్ళిచేసుకోనంటే—సరేనని ఈడొచ్చిన అమ్మాయినిగూడా ఆపాను. కాని, చూస్తుండగానే ౫, ౬ నెల్లు చేశాడోలేదో మానుకొనివచ్చాడు. ఏదో గ్రామాలను బాగుచేయడమట, గ్రామాల్ని బాగుచేయడం.

వెంక : మంచిదేకానిండి, గోపయ్యగారూ! మీరన్నట్టు—ఊరికి చేసిన ఉపకారం, పీనుగుకు చేసిన శృంగారం ఒక్కటేనని ఊరికే

అన్నారా మరి. ఇదంతా ఎరిగుండేకదూ—నేనూ జాగ్రత్తగా వుండవలసివస్తున్నది. ఊళ్లోకి సహకార సంఘాన్ని తెచ్చినప్పుడు ఒక్కడైనా కళ్ళు తెరిచాడూ? ఇప్పుడు—మాకు అప్పియ్యమంటే మాకు అప్పియ్యమని పీక్కుతినేవారే. మహాఁ సమయానికి తీర్చేవారిలాగా అడుగుతున్నారు.

గోప : ఎవరికైనా తీసుకునేటప్పుడుండే ఆదుర్దా తీర్చేటప్పుడుండదుగా.

వెంక : బాగా చెప్పారు. ఇంతకూ—నేనొచ్చినమాట మర్చేపొయ్యా. ఆఁ...మీకు ౧౫౦ రూపాయలు చాలునన్నారుగా?

గోప : చాలండి. అదైనా ఇంటి మరమ్మతు పెట్టుకున్నా గనుక అవసరమైంది.

వెంక : దానికేం! మనచేతిలో సహకారసంఘం ఉన్నది దేనికండి? అవసరమయినప్పుడు తీసుకోడానికేగా. మీరన్నట్టు ఆమాత్రం తోడ్పడంది పరపతిసంఘ మెందుకూ—నా మొహం. ఏమంటారు?

గోప : కావచ్చుననుకోండి......మరి...ఆ మొత్తాన్ని ఇంకా-—

వెంక : ఇదిగో ౨, 3 రోజులలో పంపిస్తా. వెధవది దాని కెంతపని అనుకున్నారు. బోలెడు లెక్క. ...సరే—మీతో చెప్పి వుండడం మంచిది. మీకున్న పేరు ధనంక్రింద—మీ పేర ౪౫౦ దాకా వ్రాయొచ్చు. అంతా వ్రాశాను.

గోప : మిగతాది మీ అక్కరనిమిత్తమా?

వెంక : అంతేమరి.

గోప : దానికేం. వాడుకోండి. నాకు అవసరమైంది యివ్వండి; ఆపద రాకుండా చూడండి. మీ ఇష్టం. ఎంత వాడుకుంటేమాత్రం యేం? నేను కాదన్నానా? అంత నమ్మకంలేనివాణ్ణా?

వెంక : రామరామ. ఆ మాట వేరేచెప్పాలా? అయినా—-చెప్పి వుంచుదామని. నాకుమాత్రంఅంతడబ్బెందుకండీ...కడుక్కొ త్రాగుతామా? మీరన్నట్టు వెధవది వ్యాపార మొకటి చాలక వ్యవసాయంకూడా పెట్టుకుందామనుకున్నాగా పాడై. కర్రు దగ్గర్నుంచి కాడిదాకా కొనవలసిందేగా. ౨, ౩ వేలయితే గాని కుదరదుమరి. తంటాలుపడుతున్నాను.

గోప : అవునుమరి. క్రొత్తగా వ్యవసాయమంటే మాటలా?

వెంక : అదీ సంగతి. సరే...వస్తామరి. (వెళ్ళబోయినట్టు లేచి మళ్ళీ కూర్చొని) మీరన్నట్టు— ఆసుపత్రి భవనమంటూ కట్టించారుటగా వాళ్ళు?

గోప : అది చెప్పడానికే వచ్చాడు ఈ కొవ్వరన్న.

వెంక : ప్రారంభోత్సవములాంటిది జరపడానికేనా? నా దగ్గరికీ పంపారులెండి మనిషిని.

గోప : మరి వెళ్ళలేదేం?

వెంక : ఆఁ— నాకెక్కడ తీరుతుందండి. కుదరదన్నాను. ఇక అందులో దాసనిపున్నాడే—ఆ హరిజన కుఱ్ఱాడు. వాణ్ణి డాక్టరుగా చేసి...అంతా మమేకం అనిపిస్తారుకాబోలు.

గోప : కావచ్చుమరి. నాలుగు అక్షరాలు నేర్చినవాడని ఏవో శిక్షణలనీ, మన్ననీ, మసినాకులని ఏవో జరిగాయటగా. వాడి సహవాసంవల్లనేగా మావాడు ఇంతవరకొచ్చింది? ఇప్పటికే అతనొక మందుల పెట్టెను వాడుతున్నాడు.

వెంక : అటమరి. అది పట్టుకొని తిరుగుతుంటే చూశాను. అంతేగాని...ఆ మందులెవరు తీసుకోబొయ్యారుగనుక? మీ రెప్పుడైనా వాడి చూశారేమో!

గోప : హమ్మో! నాకసలు ఆసూదిమందులంటేనే భయం. మాకెవరికి పడవు. ఏదో దేవుడు చల్లగా చూడాలిగాని ఇవేం చేస్తాయి గనుక. ఏమంటారు?

వెంక : అంతేమరి. మీరన్నట్టు—ఏదో వాళ్ళపని వాళ్ళుచేసుకుంటారు. అయినా-ఏవెట్లా పోతే మనకెందుకు? వస్తామరి. (నిజంగా వెళ్ళటానికి లేచాడు)

గోప : మంచిది. (బయటికి సాగనంపుతూ) డబ్బుకు ౨, ౩ రోజులలో రానా?

వెంక : ఎబ్బే మీరెందుకూ రావడం. అవసరమైన గుర్తులపి పెట్టి నేనే మీ ఇంటికి కాయితాలు, డబ్బూ పంపుతాగా. పూర్తి చేసి పంపండి.

గోప : అలాగే.

వెంక : సరే...వస్తా.

(వెళ్ళాడు. గోపయ్య మళ్ళీవచ్చి బల్లమీద కూర్చొని చుట్ట ఆర్పిపారేసి, మొదట చదువదలచుకొన్న పద్యాన్ని చదవ ప్రయత్నించబోతుంటే చంద్రం వస్తాడు)

చంద్రం : ఆస్పత్రి భవనం దగ్గరికి రానన్నారటేం మావయ్యా?

గోప : (తలవంచుకొనే) ఏం—రామంటే తప్పా?

చంద్రం : తప్పున్నానా మావయ్యా, కొత్తగా ఒక భవనాన్ని స్వయంగా గ్రామస్తులం కట్టుకున్నాం గనుక—పదిమందిమీ కలిసి ఒక సభ జరిపి—సంబరంగా అందులో ప్రవేశింతా మనిగా.

గోప : ఆ సంబరమేమిటో మీకున్నదేమోగాని మాకులేదు.

చంద్రం : అదేమిటి మావయ్యా! మీకంటే?

గోప : మేవంటే—నేనూ, మరికొందరమన్నమాట.

చంద్రం : మన ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకొస్తుంటే సంతోషపడం దెవరుంటారుమావయ్యా—మీరూ చిత్రంగా అంటారు.

గోప : ఉన్నారోయ్ నాబోటివారుకొందరు. సరేనా? మీ మందులూ, వైద్యాలయాలూ ఎవరికీ అక్కర్లేదు. రోగాలు లేకుండా ఎవడూ ఏంచేయ్యలేడు.

చంద్రం : లేకుండా చెయ్యలేక పోవచ్చుగాని మావయ్యా రాకుండా చెయ్యొచ్చు. వచ్చిన వాటిని నయం చెయ్యొచ్చు. ఇప్పటికీ విషయంలో ఎంతో రుజువైంది.

గోప : కావచ్చే మోగాని—ఈ పిచ్చిపనులన్నీ చేయడానికి ఒక చక్కని ఉద్యోగం వదులుకొని రానక్కర్లేదు.

చంద్రం : ఉద్యోగం అంటే ఏమిటి మావయ్యా?

గోప : నన్ను పరీక్షిస్తున్నావా? ఉద్యోగమంటే నాలుగు రాళ్ళు సంపాదించుకుంటూ హాయిగా సంసారాన్ని వెళ్ళతీసుకోవడం.

చంద్రం : ఆ పని పల్లెల్లో ఉండైనా చెయ్యొచ్చు.

గోప : నీవలా వచ్చావుగనకనా—అంటున్నావు?

చంద్రం : కాదుమావయ్యా, ఈ విషయం నిజం. అందులోనూ — ఈనాడు యువతీ యువకులు—పల్లెల్లో చేయడానికెంతైనా పనీ, బ్రతకడానికెన్నో అవకాశాలూ ఉన్నాయి.

గోప : ఇంతచదువూ చదివి—ఇలా తట్టలూ,పారలూ మోయడమేగా?

చంద్రం : అది తప్పంటారా? మన వూళ్ళకు రోడ్లు వేసుకోవడం, మన పిల్లలకు బళ్ళుకట్టుకోవడం, మన పంటలకు భూములు దున్నుకోవడం, మన ఆరోగ్యానికి ఆస్పత్రులు కట్టుకోవడం ఇలాంటివన్నీ దోషమంటారా?

గోప : దోషమనేదెలా వుంటుందోయ్? ఎవడు చేయాల్సినపని వాడు చేయాలి. కాస్త—పరువు మర్యాదలు కలవాళ్ళు బజార్లలో తట్ట నెత్తినబెట్టుకొని తిరిగితే—లోకం ఎలా నవ్వుతుందో ఆలోచించాలి.

చంద్రం : అలా ఎవరూ అనుకోరుమావయ్యా. మనం అభిమాన పడుతూ లోకాన్నడం పొరపాటు.

గోప : చంద్రం! నీధోరణి నాకర్థమైంది. నీవిక నాకేమీ నీతులు బోధించక్కరేదు. మీకు పరువు మర్యాదలూ, సిగ్గూ బిడియం అంటూ లేకపోయినా—మాకవి కావాలి.

చంద్రం : మీరేమిటి, నేనేమిటి మావయ్యా?

గోప : నీవు నీవే, మేము మేమే. నా పరువు మర్యాదలుగాని, నా అభిప్రాయాలుగానీనీకక్కరలేనప్పుడు—నీఇష్టమొచ్చినట్లుండడమే మంచిది.

చంద్రం : అదేమిటి మావయ్యా—చాలా చిత్రంగా అంటున్నారు. మీ పరువు మర్యాదలకు భంగం కలిగేట్లు ప్రవరిస్తున్నానా?

గోప : కాక మరేమిటిదంతా?...నా ఆశలన్నీ అడియాసలుచేశావు. నానా అవస్థాపడి ఇప్పించిన ఉద్యోగాన్ని కాలదన్నావు. దాని ద్వారా నీవేదో ఇంకా పెద్దఉద్యోగానికెళ్ళి మీ అమ్మకలలూ, నాకలలూ ఈడేర్చగలవని ఆశించాను. నా కూతురెంతో సుఖపడుతుందని వూహించాను. అవ్వన్నీ నిరాశచేశావు. ఇదంతా తప్పుకాదా?

చంద్రం : కాదు మావయ్యా! మీ రొక్కవిషయం ఆలోచించలేదు. ఈనాడు మనదేశం వివిధ రంగాల్లో ఎంతో అభివృద్ధి కావాల్సివుంది. దానికి ముఖ్యంగా గ్రామాల్లోనే పని జరగాలి. అందుకే—నా చేతనైనవరకూ సేవచేయాలను

కున్నాను. అలాగని—బ్రతుకుతెరువును చూసుకోకుండా—ఒట్టి ఉద్రేకంతో, ఆవేశంతో, అయోమయంగా ఈపనిలోనికి దిగలేదు. పోస్టాఫీసుకు ప్రయత్నించాను; లభించింది. అదేకాక—ఈనాడు పల్లెల్లో చెయ్యడానికి ఎన్నైనా ఉద్యోగాలున్నాయి. అవసరమైతే వాటిలోనైనా చేరదామనుకున్నాను. బస్తీఉద్యోగంవల్ల ఇంతకన్నా సుఖంవుంటుందని నేననుకోను. అందుకే—చివరకీ నిర్ణయానికొచ్చాను.

గోప : నీభ్రమలకు ఎంతపెద్ద ఉపన్యాసమిచ్చావోయ్. సరే—నీకీపనే ఆనందంగా వుందనుకుంటే ఇక్కడేపడిపడువు. మాకేం సంబంధంలేదు.

చంద్రం : అదేమిటి మావయ్యా—అంతటి నిర్ణయానికొచ్చారా! అభిప్రాయాలు కలవసంత మాత్రాన అంతా కలసివుండడం తప్పంటారా?

గోప : ఒక ఇంట్లో ఇందరి అభిప్రాయాలు పనికిరావు.

చంద్రం : సరే మావయ్యా! వెడతాను. మీరింతగా అన్నప్పుడు నేను ఉండదలుచుకోలేదు. అమ్మా నాన్నలకు కరువైనా, మీరా లోటును తీర్చారు; విద్యాబుద్ధులు చెప్పించారు; మీ ఉపకారాన్ని ఎప్పుడూ మరువలేను మావయ్యా. వెడతాను....మీకీ విషయంలో ఇంత పట్టింపు ఉంటుందనుకోలేదు.

గోప : ఆ విషయం ఇప్పుడు తెలుసుకొని మార్చుకొన్నా తిరిగి ఆ ఉద్యోగం ఇప్పిస్తాను.

చంద్రం : లేదు మావయ్యా! నేనీ నిర్ణయానికి పరిహాసంగా రాలేదు. అవన్నీ ఆలోచించుకునే వచ్చాను. మీ ఆశీర్వాదం, భగ

వంతుని ఆశీర్వాదం వుంటుందనే నమ్ముతున్నాను. సరే మావయ్యా—వస్తాను. (గదిలోకి పోబోతూ) సీత ఏదీ?

గోప : నీవిక సీతనేమీ కలుసుకో నక్కర్లేదు. ఇప్పటికే నీబుద్ధి సగం దానికబ్బింది.

చంద్రం : మంచిది మావయ్యా......ఇంత హఠాత్తుగా పరిస్థితులు మార్తాయనుకోలేదు. (సీతవున్న గది గొళ్ళెం తీయడానికి వెడతాడు)

గోప : ఆ తలుపు గొళ్ళెం తీయకు.

చంద్రం : లోపల ట్రింకువుంది మావయ్యా ! (అంటూ గొళ్ళెం తీసి లోపలికి వెళ్ళనే వెళ్లాడు. గోపయ్య ఇంకా గొళ్ళెం తీయకని అంటూవున్నాడు. ఇంతలో చంద్రిం ట్రంకుతో బయటికొస్తాడు. సీత వెంబడిస్తుంది.)

చంద్రం:- (నమస్కరిస్తూ) వస్తా మావయ్యా ! వస్తా సీతా ! (వెడు తుంటాడు)

సీత:— (ఏడుస్తూ) బావా !...బావా ! ...ఉండమను నాన్నా — బావనుండమను. బావ కన్యాయం చేయకు...(తండ్రి మాట్లాడడు)ఆగు బావా! నేనూ నీతోనే వస్తాను. బావా! ఆగు. నేనీ బందిఖానాలో వుండలేను. నేనూ వస్తున్నా. (బయటికి వెళ్ళబోతుంటే గోపయ్య సీతను పట్టుకొని లాగుతాడు.)

గోప:— ఇప్పటివరకూ తిరిగిన తిరుగుడు చాలు. ఇంకేమీ వూరేగ కర్లేదు. నడువు లోపలికి.

సీత:— (మరీ ఏడుస్తూ) నాన్నా! ఈ మాత్రానికి నా గొంతు పురి ట్లోనే ఎందుకు పిసికెయ్యలేే? ఎందుకు బ్రతకనిచ్చావు? ఎందుకు పెంచావు? ఎందుకు చదివించావు?

గోప:— (అదిరేట్టుగా) సీతా! (క్షణం నిశ్శబ్దం) ఏమిటా వాళ్ళు తెలియని వాగుడు?

సీత:— (ఏడుపు దిగమింగుతూ) అవును నాన్నా! ఇది వాగుడే. అసలు మీకీ గ్రామాలు బాగుపడటం ఇంష్టలేదు. గ్రామస్తులు చదువు ల్లేక అజ్ఞానంతో, అనారోగ్యంతో, దరిద్రంతో బ్రతకాలని మీ ఉద్దేశ్యం. వాళ్ళు చదివితే మీ మాటలు వినరనీ, మీ పెద్దరికం సాగదనీ, మీ కుట్రలు కుదరవనీ భయం.

గోప : ఏమిటా మాటలు——నోరుముయ్ (ఫెళ్ళున చెంపమీద వేసి) ఊరుకున్నకొద్దీ మితిమీరిపోతున్నది. కుట్రలేమిటి? నేను చేసే కుట్రలేమిటి? (లోపలికి నెడుతూ) ఫో లోపలికి! గదిలో పడుండు. అందులోనే ఏడువు. బయటి కడుగుపెట్టావంటే చీల్చేస్తాను. (బయటికి గొళ్ళెంపెడుతున్నట్టు తెలుస్తుంది. లోపల్నుంచి సీత)

సీత : గొళ్ళెం పెట్టకు నాన్నా! కావలిస్తే చంపెయ్యి నాన్నా! చంపెయ్యి. నీ కసితీరిపోతుంది. గదిలో వుంచకు.

(గోపయ్య రంగమ్మీదికొస్తాడు)

గోప : భగవంతుడా! నన్నింకా ఎందుకు బ్రతికించావురా తండ్రీ! (తన చెయ్యి మూసుకొని—భార్య ఫోటోదగ్గరికి వెళ్ళి భోరున ఏడుస్తాడు) శేషమ్మా! నీ బిడ్డను కొట్టానని ఏడుస్తున్నావా? ఏంచేయను శేషమ్మా? పువ్వుల్లో పెట్టి సాదాను. ఇలా మోటుగా బావులూ, చెరువులూ త్రవ్వడం నేను సహించలేను శేషమ్మా! సహించలేను.

దాని మేలుకోరకే కొట్టాను శేషమ్మా! నాతల్లికి చెడు జేయాలని కొట్టలేదు. నా సీతకు చెడుచేస్తానా శేషమ్మా? చెడుచేస్తానా—చెప్పు?

అవును. దాని మనస్సు బాధపడివుంటుంది. దాని బుగ్గలు కందివుంటాయి శేషమ్మా! నాకు తెలుసు.

ఏంచేయను? అయిపోయింది. నా చిట్టితల్లిని ఈ పాపిష్ఠి చేతితోనే కొట్టాను. ఏంచేయను దీనిని? ఏంచేయను? (ఏమీ తోచదు. చప్పునమంచం కనిపిస్తుంది) దీనికిదే శిక్ష. (గబగబా చేతిని మంచానికేసి బాదుతూ తటపటాయిస్తుంటాడు. నరస య్యన్న వస్తాడు)

నర : ఏమిట్రా గోపయ్యా ! అలా చేతిని మంచానికేసి కొడుతున్నావు?

గోప : శిక్ష విధించుకుంటున్నానన్నా. నా సీతను కొట్టినందుకు శిక్ష విధించుకుంటున్నాను.

నర : అదేమిట్రా ! నీ ఇంటావంటా లేదు. పసిపిల్లమీద చేయిచేసు కున్నావు?

గోప : (బల్లదగ్గరికొచ్చి కూర్చుంటూ) ఏం చేయను నరసయ్యన్నా ! ఊరంతా ఏదో రాయి రప్పా మోసిందని అదీ మోయడం తప్పుకాదూ?

నర : ఏం తప్పురా? దాని మొగుడే మోశాడు. అది మోస్తే తప్పా?

గోప : (కొరకొరలాడుతూ) మొగుడా? ఎవడా మొగుడు? పెళ్ళి కాందే మొగుడెవడు?

నర : ఏమిట్రా—నీ కోపమంతా నామీద చూపుతున్నావు? పెళ్ళి కాకుంటేమాత్రం చంద్రం దాని మొగుడుకాడా?

గోప : కాడు. వాడికి నా సీత నివ్వను. మొదట ఇద్దామనే అనుకు న్నాను. కాని—ఇప్పుడా నిర్ణయాన్ని మార్చుకున్నాను.

నర : నాకేం తెలుసు నీ నిర్ణయం? ఇంత చపలచిత్తుడవైతే ఎలారా?

గోప : లేకుంటే — ఇలా గ్రామాలనీ, అభివృద్ధనీ భ్రమసి ఉన్న ఉద్యో గాన్ని వదులుకొని వచ్చినవాడికి సీతనిస్తే ఏం సుఖపడుతుంది?

**నర** : ఆఁ...మన పిచ్చికాకుంటే—ఎవరికెందులో సుఖంపుందను కుంటే అందులో కెడతారు. మధ్య మన బలవంతమెందుకూ? మున్ముందు ఇప్పు డొదులుకున్న పనికన్నా పెద్ద పనిలో కెడతాడేమో!

గోప : ఆ మాట ఇక నీవు నమ్మాలి.

నర : నమ్మే వీలుంది గనుకనే అంటున్నా. ఇదివరకులాగా బల్లదగ్గర కూర్చొని పనిచేయడమే గొప్పనుకున్నావా గోపయ్యా? ఇప్పుడు—దేశానికి ఎవడు కొత్త రూపురేఖలు దిద్దితే వాడు గొప్ప. నిజానికి ఇదే ఎప్పటికైనా సత్యం. నీనిర్ణయం నాకేం నచ్చలేదురా.

గోప : ఏం గొప్ప అన్నా? వీళ్ళిద్దరూ ఇలా పట్టలూ, పారలూ మోస్తుంటే—అంతా నవ్వడంలే?

నర : అని నువ్వనుకుంటున్నావు. ఎవరూ నవ్వడంలే. అదంతా నీ భ్రమ. వీళ్ల కృషివల్ల ఈనాడు గ్రామాలకు కొత్తరక్తం, కొత్త కళాకాంతులు వస్తుంటే అంతా కళ్లకద్దుకుంటున్నారు.

గోప : నీ చోద్యంకాకుంటే...ఏమిటూ కొత్తదనం?

నర : మరీ అంత చీకట్లోవుండి— ఏమీ పట్టనట్టు అడిగితే ఎలారా గోపయ్యా? స్వయంగా మనిషిని పంపితేనేగాని ఉత్తరం చేర దనుకునే రోజులు పోయి, అణా లోపుతో దేశమంతటికీ ఉత్త రాలు చేరే పోస్టాఫీసులొస్తున్నాయి; ఒకటో తరగతికూడా పదిమైళ్ల దూరం నడవాల్సిన గతి తప్పి, పై ఫారాలదాకా చదివేబళ్ళు అన్నివూళ్లకు పడుతున్నాయి. ప్రాణాలుపోతున్నా చేయిచూసే నాధుడుండని వూళ్లకు వైద్యాలొస్తున్నారు. గొడ్లన్నింటికీ వాతలువేసి చంపుకునే పరిస్థితులు పోయి—అవి చల్లగా బతికేందుకు ముందే మందులిచ్చుకునే అవకాశాలొస్తు

న్నాయి. నిలుపు లోతు బురదలో దిగబడే వూళ్ళు—చక్కని రోడ్లతో నిండుతున్నాయి. చిమ్మచీకట్లతో నిండిన వీధులకు—చక్కగా బాటలుచూపే దీపాలొస్తున్నాయి......ఇవ్వన్నీ కొత్తవికావురా? వీటివల్ల లాభాలు లేవంటావా? ఇంతకన్నా మనం కోరే సుఖాలేమిట్రా గోపయ్యా?

గోప : వీటికోసం—ఉన్న ఉద్యోగం వదులుకోవాలా?

నర : చూడు గోపయ్యా! ఈ పనులన్నీ కావాలంటే-కొంత రెవరో పూనుకోవలసేవస్తుందిగా. ఉత్సాహం వున్నవారు ఏదైనా వదులుకొని ముందుకొచ్చి కృషిచేస్తారు. తగిన ఫలితాన్నీ, కీర్తినీ సంపాదిస్తారు.

గోప : ఏమో అన్నా! నువ్వెన్నయినా చెప్పు. పిచ్చిలా తిరగడం నాకేమాత్రం నచ్చలేదు. పైగా—అంటూ సొంటూ లేకుండా తిరగడం.

నర : అన్నీ గుర్తిస్తావు గోపయ్యా. మరికొన్నాళ్లలో గుర్తిస్తావు. నేనూ మొదట తెలియక ఏమో అనుకున్నాను. కాని—ఈనాడు అక్షరాలా వాళ్ల పంథా సరియైందని నమ్మాను.

గోప : ఎట్లా?

నర : వాళ్ళుచెప్పేవి మరీపెడచెవిని పెట్టకుండా—ఆచరించి చూద్దామని ఈ ఏడు వాళ్ల సలహా ప్రకారం కొత్తపద్ధతిలో వ్యవసాయం సాగించాంకదూ! దేవుడిదయవల్లో, వాళ్ల కృషివల్లో—మొత్తంమీద కాస్తనాలుగుగింజలుఎక్కువే రాలాయిచెప్పొద్దూ. దానిబాపతే—నీదగ్గర బదులుతీసుకొన్న గడ్డి తీసుకోపొమ్మని చెబుదామని వచ్చాను. నా దగ్గర బండి లేదుగా గోపయ్యా. నీ వీలున్నప్పుడు కాస్త బండి పంపి తెప్పించుకో.

గోప : దానికిప్పుడేం తొందరొచ్చిందన్నా?

నర : అలా అనకు. ఎలాగైనా అప్పు అప్పేరా. అది తీరిందాకా నిద్రపట్టదు. ఇదివరకు—ఈ అప్పులు తీరవనీ, మనగతి యింతేననీ నిరాశపడ్డానుగాని—ఇప్పుడు మళ్ళీ ఆశగా వుంది. త్వరలో నే—మనం ఇన్నాళ్ళనుంచీ పూడ్చని చెరువు గండ్లను వాళ్ళు పూడ్పిస్తారట. దాంతో మన చుట్టుప్రక్కవూళ్ల భూములు బంగారం పండించవూ? ఇక——వాళ్లంటే నాకు ఎందుకు నమ్మకం కలుగదు? నాకేమిటి—అందరికీ అదే నమ్మకం.

నీవు ఎంతసేపూ నీ అల్లుడు చంద్రం ఉద్యోగం మానేసి వచ్చాడనే చూస్తున్నావుగాని——అతని సత్సంకల్పాన్ని గురించి ఆలోచించడంలేదు. సరే ఆలోచించు గోపయ్యా. మళ్ళీ ఆలోచించు. దేనికీ తొందరపడకు. వస్తామరి. వీలున్నప్పుడు బండి పంపుమరి. (వెడతాడు)

గోప : (కలతచెందినట్టుగా) సీతా! సీతా! ఏం చేస్తున్నావు తల్లీ?

(గది వున్నవైపు వెడుతుండగా తెర)

# అడుగుజాడలు

## రెండవ రంగం

ఊరిమధ్య రచ్చబండ

[ఎత్తైన వేదిక. వేదికకు ఇవతలివైపు పాపన్న తలకింద తువ్వాలు పెట్టుకొని]

''బంతిపూల ఓ సిన్నదాన
బంగారు మురుగులదాన
బాయికాడ కావలి బంట
బారెడు పొద్దొంగరాయే గుంట''

[అంటూ జానపద గీతం గొణుక్కుంటున్నాడు. ఎదురుగా ఒక బోర్డు మీద ఏవో అక్షరాలు వ్రాసినవి కనిపిస్తున్నాయి. వేదికకు ఒక పక్కనున్న కొయ్యకు పోస్టుడబ్బా తగిలించివుంది. మరోపక్కన వయోజన పాఠశాల వున్నట్టు-''బోర్డు'' చెబుతున్నది. పాపన్న అటిటుచూస్తూ పాట చదువుకోవడంలో అతని దృష్టి ఏదో వ్రాసివున్న బోర్డుమీద పడుతుంది. చప్పున లేస్తాడు]

పాప : మల్లేందో బల్లమీదికెక్కిందే! (అది చదవడానికి ప్రయత్నిస్తాడు. ఏవో తప్పులు చదువుతాడు. మధ్య నెక్కడో తన పేరులాంటిది తగులుతుంది. అది 'పాపన్న పచ్చి రాక్షసు, డని వ్రాసి వున్నట్టు వూహించుకుంటాడు. తురున కోపంవొస్తుంది.) ఆఁ పాపన్న పచ్చి రాచ్చసుడా? ఈరంత మంచోరా? ఇట్టున్నాది—ఈల్ల ఎవారం? ఈల్లబొక్క నవఁలకుంటె సూడు మల్ల...(వెళ్లి మళ్ళీ వేదికమీద గొణుక్కుంటూ కూర్చుంటాడు. ఇంతలో టపాతీసుకొని పరుగెత్తుతూ ఏదో పాటపాడుకుంటూ వస్తున్న కొమఁరన్న కనిపిస్తాడు)

పాప : ఏంరో కొవఁరన్నా—పదా లెక్కువై నయే! రావూ!

కొమ : (ఆగిపోయి) ఏవఁదీ—ఇయ్యాల్నేవో ఈడ గూకున్నావూ? మిద్దెంటి రావఁసావి పెంటదిబ్బెటుబాయె? తోల్ల అచ్చయ్య పిట్టగోడెటుబాయె?

పాప : ఆటినిగూడ మీవోల్లుంచరంటగద?

కొమ : మంచిదిగానప్పుడు వుంచుడెందుకుమల్ల? సరెగని ఏంపది ఆపితివీ?

పాప : జల్ది బోవాల్నా ఎట్ల?

కొమ : ఇదేవఁన్న టప్పనుకున్నావా? మల్లేవఁన్నసుకున్నవా?

పాప : అంత మాట్లాడే వల్లగాపుంఫున్నాది?

కొమ : ఏందది సెప్పెహె! పనిలేనోనిబుద్ది పరిపరి ఇదాలంట. ఏంపది సెప్పరాదె?

పాప : పనుండబట్టే పిల్సిన.

కొమ : నువ్వాడలే. పనికిరాని పనులన్ని పైసేసుకుంటవు. సెప్పుమల్ల.

పాప : ఏదో ఏశేసినవ్ గని బల్లమీని కేవోఁ కొత్త కొత్త పేర్లెక్కినయే?

కొమ : పనులు కొత్తయయితాంటె—పేర్లు కొత్తయెక్కవా ఎట్ల?

పాప . ఓడిపేరెట్టబోతె నాకేంగని—నా పేరెందుకెక్కాలె బల్లమీన?

కొమ : నీదో పిచ్చిగాకుంటె—నీ పేరేందే?

పాప : ఇంగోదుర—పాపన్న వచ్చి రాచ్చసుడని రాసిస్రుగద.

కొమ : సూడు పాపన్న! నన్నాకె ఎందు కొదిరిస్తవుగని—ఒక్క మాటిను. దానిమీన అబద్దం ఎక్కెదిలేదు; నిజం వూకునేది లేదనుకో.

పాపన్న : అట్టంటె—ఇంగనేను సెడ్డోన్నేగద—నువ్వనేది?

కొమ : ఈ పాడునోటితోని పచ్చని సెట్టకింద పాపపుమాట లెందు కనిపిస్తవు? దానిమీన వుండేయి వుండేదేననుకో.

పాప : ఎట్టనైన—సెంద్రం, దాసు, పీసు, నువ్వు—అంత ఓటే ప్యార్టాయె. ఇంగ కాపంటావు?

కోము : ప్యార్టి, ప్యార్టిని పూరంత ఈడికే పాడుపాడు జేస్తిరి. ఇంగ సాలదె?

పాప : ఓరాఁ సేసింది? మీ సెంద్రింగిట్ల రాకుంటె అందరి దోటే మాటగద. రొండు ప్యార్టీ లెందుకుంటై? అంత ఎంకటపతి సెప్పినట్టే నడ్సెటోల్లం.

కోము : ఏవంటకే—గురిగింజంట...ఎందుకులే—ఇంగజూడూ! అందని పొందని మాటలని అందర్నెందుకు బద్నాం జేస్తవు? ఆకేవోఁ బంగారవఁసువంటి బస్తీ నౌకరొదులుకోనిగూడ మసూర్న బాగుజేద్దాయనొస్తె—ఇదేనా సువ్వనేది?

పాప : దెబ్బగాల! ఇంగ ఇయ్యాల ఆరు బాగుజేస్తె అయితది. లేకుంటె సెడిపోద్దేవోఁ. ఇన్నాలదనక మనం పూల్లేవఁన్న బతుకుతుండవాఁ, ఏవఁన్ననా?

కోము : ఇప్పటిదన్క బతికినబతుగ్గూడ ఓ బతుకేనా? రాతికిందికప్ప, రాశికిరాని పంట ఓటేనన్నరు. అసుంటి బతుకు బతికినం.

పాప : ఇంగిప్పుడు మూరాజులోతె బత్తరేవోఁ?

కోము : మూరాజులమూట మర్సి ఎన్నాల్లాయె. మద్సులోతుగబత్తె ఆడికదేసాలు.

పాప : ఇన్నాల్లదన్క మనం మద్సులోతుగ బతకలేదంటవ్. గంతే నార?

కోము : వొప్పనోనికి ఎంతిప్పిసెప్పినా తెల్వదుగనీ—ఇంతైతె అసలెవారవేందో సెప్పరాదె? ఎందుకాపినవ్?

పాప : ఏదే ఏవుండది? ఈ బల్లమీన పాపన్న మంచోడుగాడని రాస్తె తలకాయలు, తలకాయలు పగలాల్నని సెప్పు మీవోల్లకు.

కొమ : నువ్వు పగలగొట్టినోల్లంత ఆ గుట్టకుబడి ఏడుస్తున్రులే. జర అండ్ల ఏంరాసుండదో సక్కంగ సదువుకోని మాట్లాడు.

పాప : సదివే అంటుండం.

కొమ : నీ ఏసంగి సదువుతోని సదివితె అట్నే వుంటదిలే.

పాప : ఇంగ ఆమాత్రం సదవలేనంటవా?

కొమ : ఆఎత్తున సదువురాబట్టేకాదె—కోవటి బుచ్చెయ్యొంటిగాడి పాలీలన్ని పటపట ఇరిగినై.

పాప : మడ్సినిజూసి పాలియ్యాలెగని—నీ అసుంటోనికిచ్చే పాలీ నాకిస్తె ఆగుతాదిర?

కొమ : నువ్వాడలే. నీకింద మడ్సులే ఆగరైరి. ఇంగపాలీలాగుతాయి?

పాప : ఏందిరో—మడ్సులు గిడ్సులంటుంటవ్—నేను ఏమడ్సి నేవన్నరా?

కొమ : మాటమార్సుడు బాగ నేర్సినౌగని—ఇప్పుడుగాదె తలకా యలు, తలకాయలు పగలాల్నన్నది?

పాప : నామీని కొచ్చినోల్ల తలకాయ పగలగొడ్తనా? మల్ల బొక్క లిరగ్గొట్టనా. బొక్కనవుల్తమల్ల బొక్క — ఏమనుకున్నవో. జర—మీవోల్లను బద్రంగుండమని సెప్పు.

కొమ : తాటాకు సప్పుల్లకే కుందేల్లు బెదురుతాయె. సరె—నువ్వు జేసేదేందో సెయ్యరాదె? వద్దంటాగుతా గనకనా? గిదా నువ్వు జెప్పేది. ధసెఫో—నేను బోవాలె(గబగబా వెడతాడు)

పాప : హమ్మా! నీకెంత నీలుగుడెక్కిందేవిరో? ఇందన కొచ్చినాది? సూద్దాయి మీ ఆటలెన్నాల్లు సాగుతయో? బొక్క సవలన్ర మల్లబొక్క.

(మళ్ళీ వేదికమీద కూర్చొని—ఇంకాస్త సేపు ఇందాకటిపాట గొణుక్కుంటుంటాడు. ఇంతలో నరసయ్యన్న డబ్బాలో ఉత్తరం వేసి పాపన్న వైపుచూస్తాడు)

నర : ఏం పాపన్నా! రేలపదాలేవోఁ మహా జోరుగాపాడేస్తున్నావే?

పాప : ఓరదీ? నరసయ్యన్నా! సూడ్నేలేదు. రావూ? కూకో.

నర : ఏం—ఇవేళ ఇక్కడకూర్చున్నావు? నీ ఆసనం ఇదికాదే?

పాప : ఆ కందిరివయ్యా, దాసయ్యాలు ఒక్కపని జేస్తున్నారె?

నర : ఎందుకురా నువ్వెపొద్దస్తమానం వాళ్లమీద పడేడుస్తావు?

పాప : నీకేం తెలవనట్టు మాట్టాడుతుండవేం అన్నా? ఎన్నడులేంది మసూరుకో టపాకానా తెచ్చిపెట్టిరా.

నర : మంచిదేగా. ముకాని మనదికాదనుకుంటే ఉత్తరం ఎక్కడికైనా పోతుంది.

పాప : ఏం పోవుడో ఏంకతో? ఆ లాబం మీకేవన్న వుండదేమోఁగని-మా అనుంటోళ్లం పడిసస్తున్నం.

నర : బాగుందే. అదుంటే—మాకు లాభముండి మీకు వుండకపోవడమేమిటి?

పాప : ఏందో నీకేం దెలుస్తది. నా పానమ్మెనికొచ్చి పడుస్తుంది.

నర : టపా తెచ్చేపని నీకు దొరకలేదనేనా ఏడుపు?

పాప : ఆ మాయదారిపని నాకెందుకు అన్నా—నువ్వేట్నే అంటవూ? గాపొద్దు ఈడబ్బాలంగ వోరో ఉత్తరాలు కాజేసిరంట. మరి—రోజు ఇంకా సేపటికి ఆరే తీసుకుంటుండిరి. నేను కాజేసిన్నని—ఆల్లు ఆడాడ జెప్పుడెందుకు?

నర : నిజానికి ఇతరులెవరైనా ఆపనిచేస్తే అది నేరమేమరి. అయినా నువ్వు తీశావని వాళ్ళెవరైనా అన్నారా?

పాప : నాతోని మొకంబట్టుకోనంటె బొక్క నవలకపోయినాను అన్నా. ఆడాడ అంటున్నంట సాటుగ.

నర : ఎవరితో అన్నారో చెప్పరాదూ?

పాప : ఎంకటపతిగారితోని వోరో అన్నరంట.

నర : ఎవరో, ఎక్కడో, ఎప్పుడో అన్నారని నీకెందుకూ అంత భయం?

పాప : ఇండ్ల బయపేఁ వుండది. ఇట్లఅడ్డగోలుగంటె వూకునేది లేదని సెప్పుతున్న. ఎట్లనైన ముంగల్నే మీ అసుంటి పెద్దలకు తెలిసుంటె బాగ్గద?

నర : ఏంరోయ్—వాళ్లసేవఁన్నా అంటూవా ఏం?

పాప : నాకు ఆరితోటేం పంచాతే. ఆరునాజోలికొస్తె బొక్కసప్పుఁల్త ననుకో.

నర : చాలెడ్డూ—నీ బీరాలు నాకు తెలియునివాగాని—అనవసరంగా వాళ్లజోలికిబోకు. వాళ్ళు చదువుకున్నవాళ్ళు. చట్టాలు, వ్యవహారాలు తెలిసినవాళ్ళు.

పాప : మరిట్ల వూర్నంత పాడుచేస్తుంటె వూరుకుంటవాఁ?

నర : టపాఖానాతెస్తే పాడుచేయడమా? దవాఖానావస్తే పాడుచేయడమా? బడికట్టిస్తే పాడుచేయడమా?

పాప : ఇంగ ఆ బాగు జేసుడేందో, ఆ సుచ్చేటేందో నీకు దెలవాలింగ. సరె—ఆల్లు ఎట్లజస్తైనాకేం? నాజోలికొస్తెవూకోను. ఇంకళ్నె దొంగతనం బెడ్తరనే ఇయ్యాలీడ కావలిగూకున్న.

నర : టపాడబ్బాకా?

పాప : ఔమల్ల.

నర : నువ్వేమీ కూర్చో అక్కర్లేదు. ఎవడిపని వాడు చేసుకుంటే చాలు.

పాప : తీర మల్లపోతె నన్నేగద అనేది?

నర : ఊరికే ఎవరేవఁనరుగాని—అనవసరంగా తొందరపడకు. తర్వాత నీ ఇష్టం. (వెడతాడు.)

పాప : ఇయ్యాల కల్లుదెర్సినోరు సస్నేంజేస్తరుగనీ. (మళ్ళీ వేదికమీద కూర్చొని చుట్ట వెలిగించి పాట లంకించుకుంటాడు. ఇంతలో గబగబా వెంకటపతి వస్తాడు)

వెంక : హోరి—వీళ్ల నాటకం తగలబడా! హనుమంతుని దగ్గరా కుప్పిగంతులు. వీళ్ళ ఎత్తులూ, నక్కజిత్తులూ వెంకటపతిదగ్గరా!

పాప : (గబగబా వేదిక దిగుతాడు. వెంకటపతి వేదికమీద కూర్చుని ఎడమకాలుమీద కుడికాలు వేసికొని పైమీది కండువా కాళ్లకు చుట్టుకొంటుంటాడు) ఏవాఁయెనుండీ?

వెంక : ఏంకాఁవడమేఁవిఁటీ? మరీ పెచ్చుమీరి పోతున్నారనుకో. ఒకరికా? ఇద్దరికా? నెమ్మది నెమ్మదిగా ఊరికే విషం పోస్తున్నారు. హమ్మా! నాటకం! నాదగ్గరా?

పాప : అసలు మాటేందో చెప్పరూ?

వెంక : (గభాల్న చుట్ట నోట్లో పెట్టుకొని) అగ్గిపెట్టి పడెయ్! అసలేమిటి? నకలేమిటి? అటైతే, కొడ్డామనే వాళ్ళ ఎత్తేమో.

పాప : (అగ్గిపెట్టె వెలిగించి వెంకటపతి చుట్టవెలిగిస్తాడు) ఓరుండీ అది?

వెంక : ఇంకెవరు? ఆ చంద్రయ్య, ఆయనవెంట ఆ రావిఁగాడు.

పాప : ఎట్టెట్టా? కర్రలు దీసుకొనొచ్చినారా?

వెంక : చాటుగా కర్రలే తెచ్చారో, కత్తులేతెచ్చారో ఎవరుచూశారు?

పాప : జర నాకు తెలిస్తె వురికిరాకపొయినానుండి. బొక్క సవఁలక పొయినాను—బొక్క.

వెంక : సమయానికి లేకుండా పొయ్యావు. ఏం లాంభం?

పాప : అంత పూనుకొనేందుకొచ్చిన్రు?

వెంక : ఎందుకేమిటీ? పొయ్యేకాలం. ఈపనులన్నీ అలాంటివికావూ? పైగా— దానికితోడు— సహకారసంఘం కాస్త పచ్చగా

వుందిగా. దానిమీద పడింది కన్ను. దీన్నికూడా గుంజుకొని-వూరునుకాస్తా కుక్కలు చింపిన విస్తరి చేయాలని ఉద్దేశ్యం.

పాప : అంచనకొచ్చినాది ఎవారం?

వెంక : ఇట్లాగే వూరుకుంటే ఎందాకైనా వస్తుంది. అందుకేగా అనుకోడం.

పాప : ఆ వస్తరం వూడగుంజుకుందాయనే వచ్చినట్టా?

వెంక : హాంగైతే గుంజుకుందామనే. ఒకరికిద్దరొచ్చారంటే ఇంకేమిటిమరి? పైకిమాత్రం—మేంకూడా సభ్యులుగా చేర్తాం, అప్పిప్పించండి అని అన్నారనుకో.

పాప : ఆఁ—ఇంగ అట్ట అప్పులిస్తె ఇయ్యాళ్ళ దివాలు దియ్యం?

వెంక : తీస్తే వాళ్ళకేం? అయినవాడు, కానివాడు—అప్పులు తీసుకొని, ఎగ్గొట్టి—ఆఖరుకు నా పేరు పాడుచేద్దామనేగా? అయినా—అప్పులుకావల్సినవాళ్ళు—నాదగ్గరికొచ్చి ఎవరికివారు అడుక్కోలేరూ? మధ్య ఈ రాయబారగాళ్లెందుకూ? డబ్బులేక అలోలక్ష్మణా! అని నెత్తీనోరు కొట్టుకొనే రోజుల్లో ఈ సంఘాన్ని ఈడ్చి పట్టుకొచ్చిందెవరూ? నేనుకాదూ? ఎవరవసరాలేమిటో నాకుతెలియవ్వూ? నిన్నగాక మొన్నొచ్చి వీళ్ళు నాకు చెప్పొచ్చేవాళ్లా?

పాప : సూడబోతె—ఈల్లు అన్ని పనులు పదునుకొని సేస్తుండట్టుండది. అటేవోఁమీమీనికి పంచాతికొచ్చిన్రా? (రహస్యంగా) ఇటు నేను పెట్టెలంగ ఉత్తరాలు దీసింది ఎట్ట దెల్సిందో ఏం కతో?

వెంక : ఆఁ, తెలిసిందా?

పాప : తెలవందే—పాపిగాడు వచ్చి రాచ్చసుడని ఆబల్లమీన ఎందుకు రాస్తరు?

వెంక : ఆఁ అందాకా వచ్చిందీ? ఇంకెందుకూ? పిల్ల జుట్టు చేతిలో చిక్కినట్టే. ఏదీ ఏం రాశారు?

పాప : (చప్పున ప్రక్కకు చూసి) లేవకురి. అంగో–ఆ శంద్రవయ్య దంటోడు దాసంట—పీసు—వొస్తుండు. ఆన్నిపిల్సి ఒకాట ఆడిద్దాయాఁ?

వెంక : వాడేగా—అంటరానివాడు.

పాప : అదే—తొంటెల్లుగాని కొడుకు. అదింత, ఇదింత సదివిందేవోఁ ఆకరుకు డాక్సరు సదువు సదివి వొచ్చిండు.

వెంక : వాడికొచ్చిన చదువూ సరే. వాడి వైద్యమూ సరే. ఊళ్లో ఒక దవాఖానా, ఈనో వైద్యుడు. బాగా నేవుంది. వైద్యుడా నీ చేతిమాత్ర వైకుంఠయాత్రా అన్నట్టు.

పాప : ఆఁ—మనం ఆనికాడ మందులు తినబోయినవాఁగనీఁ. జర ఆట ఆడిస్త సూద్దాదురి; మీ కెందుకు?

వెంక : పోనిద్దూ—గాలికిపొయ్యే కంపను వొంటికి కొట్టుకోవడ మెందుకూ?

పాప : మీ కెందుకు—మీరట్ల జూస్తుండరాదురి. అంగో వస్తాండు... ఏవఁయ్యోయి దాసయ్యా! జర్రిట్రాంవూ! ఎంకటపతిగారు పిలుస్తున్రు.

దాసు : (ప్రవేశించి) నమస్కారమండీ వెంకటపతిగారూ! (వెంకటపతి తిరిగి నమస్కారము చేయడు, కూర్చోమనడు) ఏమో పిలిచారట?

వెంక : ఆఁ......పూరికెనే. ఎటో వెళ్ళొస్తున్నావూ?

దాసు : మా వాడలో కలరా పొడసూపిందిగదూ. ఆ విషయంలో తంటాలు పడుతున్నాం.

**పాప :** మీ మందుల ఆసన జూస్తెనే కక్కొచ్చి—సగం గత్తర తగుల్తది.

దాసు : తెలియని విషయాలను గురించి ఎందుకు మాట్లాడ్తావు పాపన్నా?

వెంక : (ఎగతాళిగా) ఆఁ...వాడు నిన్నగాక మొన్న వూళ్లోకొచ్చిన వాడు. మీ అనుభవం వాడికెక్కడిదిగాని—ఇంతకూ మీ పనులెల్లా సాగుతున్నట్టు?

దాసు : వెంకటపతిగారు చిత్రంగాఅడుగుతారే. ఒక గట్టి సంకల్పంతో పనులు సాగిస్తుంటే—కాకుండా ఎందుకుంటాయి? కాకుంటే మనకేపనులు కాస్త కొత్త గనుక—మొదట్లో కొంత ఇబ్బంది తప్పదు.

వెంక : నేను చూస్తున్నా గదూ—నువ్వన్నట్టు చంద్రం చిన్నప్పటినుంచి ఇలాంటి ఇబ్బందులలో పడే తన జీవితాన్ని పాడుచేసుకున్నాడు. ఇప్పుడు ఇతరులనూ అందులోకి దించాడు.

పాప : ఏం లాబంలేందే—ఈ పనులన్ని ఎందుకు పెట్టుకుంటరుగనీ.

దాసు : అదేమ్మాట పాపన్నా! ఊళ్ళోకి బడి, పోస్టాఫీసు, ఆస్పత్రి, రోడ్లు, వస్త్రమరలు, ఆంబోతులు—ఇలాంటివన్నీ వస్తే ఒక్కరికేనా లాభం?

పాప : ఇంగో—నాకు ఎయ్యి జెప్పు, లచ్చ జెప్పు—పరే పైలాబం లేంది ఇసుంటి పనులు ఓరు పూరకె పెట్టుకోనే పెట్టుకోరు.

దాసు : సరె—ఆమాటకొస్తే—ఎరువుల ఫ్యాక్టరీవుంటే ఒక్కరికే ఎరువులు దొరుకుతున్నాయా? నాగార్జునసాగర్ వల్ల ఏ ఒక్కరి భూమో సాగవుతుందా? కోట్లమందికి లాభం కాదూ? ఏమండీ—పాపన్నకంటే తెలియదనుకోండి. మీకు తెలియదా?

వెంక : ఆఁ...అదంతా నిజమేననుకోవయ్యా. కాని అదంతా సర్కారుపని. సర్కారుపని సర్కారుచేసుకుంటుంది. అదేమిటో,

దాని ప్లానేమిటో సాగిపోతుంది. మధ్య పాపం మీకీ తిప్పలు ఎందుకూ అని— ఏదో కలో గంజో తాగుతూ హాయిగా ఏ బస్తీలోనో ఉద్యోగం చేసుకోక?

దాసు : తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదంగా విడదీశారే. అవన్నీ మనకోసం వేసుకున్న పథకాలు కావూ? మనం ఎంత తొందరగా అమలు జరిపించుకుంటే—అంత తొందరగా ఫలితాలొస్తాయి. ఇక మనం పూనుకోకుంటే ఎవరు పూనుకుంటారు?

పాప : ఆఁ...ఇప్పుడు పూనుకొని చేసిందేవుందిగనీ.

దాసు : అలా అంటే చాలా చెప్పవలసివస్తుందిమరి. (వెంకటపతి పక్కన కూర్చోబోతాడు. వెంకటపతి దాసును రమ్మనలేక తానే చప్పున లేస్తాడు)

పాప : (అర్థంచేసుకొని) పదుపునున్నరని పేరేగని—సిన్నా పెద్దా అనే బుద్దెట్టొసది? అది పుటకతోనే రావాలెగని.

దాసు : మీరింకా ఈ అంటరాని దోషాన్ని పాటిస్తున్నారనుకోలే. (దాసు లేస్తాడు. వెంకటపతి మళ్ళీ కూర్చుంటాడు.)

వెంక : మీరుకూడా పాటిస్తేనేగా—మేమూ పాటించడంవల్ల లాభం?

దాసు : చట్టమే ఈ దోషాన్ని నిర్మూలిస్తున్నదిగదూ?

పాప : సట్టాలకేంలే. ఊళ్లుండోల్లం మనం; సట్టాలుచేసేది ఇంకోరు.

దాసు : బాగుంది. వారెవరు? మనమెవరం? మనం ఎన్నుకొని పంపితేనే వారు చట్టాలు చేస్తున్నారు. వాటిని పాటించడం మన ధర్మం, విధికూడాను.

వెంక : ఎలాగైనా—నాలుగక్షరాలు చదివాంగదా అని ధర్మాలూ, చట్టాలూ మాదగ్గర మాట్లాడితే ఏంలాభం? మాఇష్టం. మేమిప్పుడే మీలో కలవదలుచుకోలేదు. సరెనా?

దాసు : ఇంట్లో అయితే—పర్వాలేదేమోగానీండి—బజారులో మీరిలా అనడం అంత బాగుండకపోవచ్చు.

పాప : ఇండ్ల ఇన్నొగలా మల్ల? ఇంటికాడ వో ఆశారం, బేట ఇంకో ఆశారం. బాగుండది. ఈ కాలపు బుద్దులుమల్ల.

దాసు : దానర్థం అదికాదుపాపన్నా. రాజ్యాంగం ఎవరినీ ఏవిషయం లోనూ బలవంతపెట్టదు. అయితే—సమాజ శ్రేయస్సుకోసం ప్రజలందరూఅనుసరించవలసిన కనీసధర్మాలు కొన్నున్నాయి.

పాప : ఆఁ. బొక్కుల్ల రాసున్నయన్ని ఇక్కడెందుకు సెపుతవ్? యాడి లెక్కాడిదే.

దాసు : అట్లావుండదు పాపన్నా. అందరికీ ఒక్కటే లెక్క. నీకు తెలియకపాయె. తెలిసినవి చెబితే వినిపించుకోకపోతివి.

పాప : నేను పుట్టినకాడ్నించి ఈ బోదలు ఇంటున్నలేవయ్యా్యయి. సెప్పుకొనెటోరు సెప్పుకపోతరు. తెలవనోల్లు ఇనుకుంటరు. లచ్చతొంబై సంగాల్ల పనిజేసి కొమ్ములిరిగిన పెద్దల్ల మెదిలి నోన్ని, ఎన్నో బస్తీలు సూసినోన్ని. నాకాడ చెప్పొచ్చినావు?

దాసు : అన్నీ తెలిసేనా ఇలా మాట్లాడుతున్నావు?

పాప : ఓరికి చెప్పినకాడికి ఆరికి తెలుస్తదిగని...మందులు వూల్లల్ల మా జోరుగిస్తుండవేవొఁ—నాకేవఁన్నిస్తవా?

దాసు : వీటి వాసనే నీకు గిట్టదుగా...మందంటే ఏంమందు?

పాప : ఏమ్మందో ఎరకైతె నువ్విచ్చేదేంది? నేనే అడుగుదుగద.

దాసు : మందు దేనికీ అని?

పాప : నీకాడ తీరుతీరు మందులేవుండై గస్క? గుటుక్కున పానా ల్దిసేయేగద.

దాసు : ఏం పాపన్నా పరిహాసమా?

పాప : నీతోని నాకేం పరాశికంగనీ—నీకాడ అన్నితీర్ల మందులుండ యంటవా?

దాసు : అన్నిమందుల సంగతినీకెందుకూ? నీజాడ్యమేమిటో చెప్పరాదూ?

పాప : ఏందంటావు? శనాపున్నై. ఓరోగవనుకున్నావు? ఒల్లు పొగరు, పుల్లెగండుతనం, తలదిరుగుడు ... ఈటికున్నయా మందులు?

(వెంకటపతి పకపకా నవ్వులాడు)

దాసు : వెంకటపతిగారూ! పెద్దవారు—మీరుగూడా చూస్తూ వూరుకుంటున్నారుగదూ?

వెంక : నేనేం చేయనూ? ఊళ్ళను మరమ్మత్ చేస్తున్నారేమోగా— ఇదిగో మీరిట్లా తయారు చేస్తున్నారన్నమాట.

దాసు : అదేమిటి? మేమేం దోషం చేశాం?

పాప : ఏంచేసినావ్రి? ఇంక నాలిముచ్చోతుగ మాట్లాడుతుండవే? మీ ఏడుపెందో ఏడ్సుకోక పరాయోరిపేర్లను బజారుబల్లమీని కెక్కచ్చుడెందుకు?

దాసు : తప్పేముందీ? ఎవళ్ళయినా ఫలానాపని చేశారని వ్రాస్తే తప్పా? పదిమంది తెలుసుకొని అందులో మంచివుంటే గ్రహిస్తారు.

వెంక : అయితే—పాపన్న పచ్చి రాక్షసుడని వ్రాయడంకూడా మంచేనన్నమాట?

దాసు : రామరామ. అదేమిటండీ? మేమెవరికీ కష్టంకలిగించాలని దానిమీద వ్రాయం. ఎవరైనా అలా దిద్దారేమోమరి.

పాప : రాసేటప్పుడు రాసేది. తీర అడిగెతోరుకు దిద్దిరని తప్పిచ్చుకునేది. ఇదా మీరాడే నాటకం? నవుపుమల్ల ఏం రాసిరో.

దాసు : (బల్లదగ్గరకు వెళ్ళి చదువుతాడు)

౧. శ్రీ గుర్రం నరసయ్య కొత్తపద్ధతుల్లో వరిని సాగుచేసి ఈపడు ఎకరాకు సగటున ౩ బస్తాల ధాన్యం ఎక్కువ పండించారు.

౨. వయోజన పాఠశాలకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకు అభివృద్ధి అవుతున్నది. ఇప్పుడు మొత్తం చదువుతున్నవారు ౩౪గురు.

౩. గ్రంథాలయాన్ని నిర్మించడానికి శ్రీ కాంస్ల సోమసుందరం తమకున్న భూమిలో నాల్గవ వంతు దానంచేశారు.

౪. శ్రీ మామిడాల పాపయ్య పచ్చి ఎరువులు వేసి దున్నడం వల్ల నిరుటికన్నా ఎకరాకు బస్తాన్నర ధాన్యం ఎక్కువ తేలింది.

ఏదీ? ఇందులో పాపన్న పచ్చి రాకుసుడని ఎక్కడుందండీ? (వెంకటపతి పాపన్నవైపు కొరకొరా మూస్తాడు. పాపన్న దిగులు మొహంవేసి—మళ్ళీ బెట్టుసరిగా)

పాప . ఇప్పుడుగాదయ నేను సూసింది. ఓరో సెరిపేసిన్రు.

దాసు : ఇంతలోనే ఎవరు చెరిపేశారు?

వెంక : నువ్వన్నట్టు చెరిపెయ్యందే ఎలా పోతుందిమరి?

దాసు : నేననడమేమిటండీ. అసలలా వ్రాయడమే జరగనప్పుడు చెరపడమనే సమస్యేలేదు.

పాప : మరైతె నేనబద్ధం ఆడిన్నంటవా?

దాసు : ఎవరబద్ధమాడేదీ కనపడుతూనే వుందిగా? వ్రాయని వాటిని కూడా మీరిలా కల్పించి ప్రచారంచేస్తే అన్యాయం కాదండీ?

వెంక : ఇవేళ వ్రాయకపోతే—రేపు వ్రాస్తారు.

దాసు : అనవసరంగా ఎందుకు వ్రాస్తాం?

పాప : ఇదిరాసినోరు అది రాయకుండుంటారు?

దాసు : అలా అంటే ఏం చెప్పను? దీనిమీద పదిమందిని మంచిపనికి ప్రోత్సహించే విషయాన్నే వ్రాస్తాం కాని—ఒకరిని అపకీర్తి పాలు చెయ్యాలని వ్రాయం. మా కలాంటి ఉద్దేశ్యాలు లేవు. (అని దాసు వెళ్ళిపోతాడు)

వెంక : హోరి వెధవా! మాకు అలాంటి ఉద్దేశ్యాలు లేవనిఅంటే—

పాప : మన కుంటాయనేగదండి అనేది?

వెంక : చాల్లే—నీవసలు చదివే చెప్పావా?...మాట్లాడవేం? నిన్ను సమర్థించలేక నా తలప్రాణం తోకకొచ్చింది.

పాప : అడుగున రాసిన పేరు నాదేననుకున్ననండీ.

వెంక : ఏడిసినట్టుంది. మామిడాల పాపయ్య పచ్చి ఎరుపు కేశాద నుంటే — మధ్య నీకొచ్చిన రెండక్షరాలు పట్టుకొని చదివావూ? వెధవ వేసంగి చదువూ, నువ్వూ. ఇంక నాలుగక్షరాలేడిస్తే తప్పొచ్చిందేం?

పాప : మీరెన్నడన్న సెప్తేగదండీ. అయ్యాయినా ఎన్నడో సిన్నప్పుడు కోదండం బట్టిచ్చి పంతులు జదివిచ్చిండు.

వెంక : అయితేమాత్రం— పచ్చిపులుసు పాపన్నకూ, మామిడాల పాపయ్యకూ ఏం సంబంధంరా నీ ఉలికిపాటు కాకుంటే.

పాప : ఆ 'పచ్చి'—పాపన్న అని రాసినంక రాయబట్టి అనుకున్న నుండీ.

వెంక : చాల్లే—ఎప్పుడూ ఇలా తెలిసీ తెలియని పడుపు లేపవకు. చేసేదాంట్లోనైనా చలాకీ వుండొద్దుటరా?

పాప : ఊఁ—పోనీరండీ. ఇప్పుడిట్లంటె—ఈళ్లేంజేస్తరంట?

వెంక : మనమే తప్పుడు ప్రచారం చేస్తున్నామనుకోరూ?

పాప : అందనకొస్తె—మెల్ల డప్పు కట్టుకోనితిరగనుండి. అయు నాది ఈడికారిపని? బొక్క నవఁల్నుండి మల్లబొక్క.

వెంక : నీ మొహం. మహా నవిలేఁట్టే అంటావు?

పాప : దానికి మోకా రావాల్నుండి. బాగ కోపం రాంది నాకు వొల్లు పెరగదు.

వెంక : పెరిగితే ఆపేవాడుండడు......సరే—అదంతా ఎందుకు గాని—గోపయ్యగారిదగ్గర డబ్బు వసూలుచేసుకురా. వడ్డీకి సహా ఇందాకే లెక్కచూసి చెప్పాగా. త్వరగా వెళ్ళిరా. ఇంకా చాలాపనుంది. (ఒక వైపు వెంకటపతి వెళ్లిపోతాడు. మరోవైపుకు పాపన్న వెళ్ళబోయ్యేటప్పటికి కొవఁరన్నొచ్చి డబ్బాలో ఉత్తరాలు తీస్తుంటాడు)

కొమ : ఏఁరో పాపన్నా! ఇంకీడ్నె వుండట్టుండదీ?

పాప : మీరింతపని బెట్టినంక వుండక తప్పుతాది?

కొమ : ఒసోస్! నేమేం బెట్టిన పేఁ?

పాప : అండ్ల ఉత్తరాలు మీరే తీసుకుంట ఇంకోల్లమీన బెట్టుడేంది మల్ల?

కొమ : బాగుండదే దరువు? ఇండ్ల జాబులు ఇండ్లనే వుండాల్నా ఎట్ట?

పాప : లేకుంటె—మీరు తీసిర్రని—ఆసడిగని—ఇంకోరన్న తీసిర్రేవోఁ?

కొమ : ఓరు తియ్యాల్నోనె ఆరే తియ్యాలెగని—ఆరీరు అడ్డగోలుగ దీస్తె పానంమీనికి రాదె? అయినగని—ఇప్పుడా నై నవంతెం దుకుగని—బల్లమీ నేం రాసిర్రో బాగ సూసుకున్నవా?

పాప : సూసుకున్నంలే. బడె నువ్వు నాతో పరాసికం ఆడొచ్చినావ్?

(వెడుతుంటాడు)

కొమ : ఉండ్రో పాపన్నా ! నేనటే వస్తుండ.

(ఇద్దరూ వెడుతుండగా తెర)

# అడుగుజాడలు

## మూడవ రంగం

### వయోజన పాఠశాల

[రాత్రిపాఠశాలను సూచించే పరికరాలు : లాంతర్లు, చాప చుట్టలు, పదాలను నేర్పే బొమ్మలపటం, నాయకుల ఫోటోలు, అట్టలపైనా మెతలు, నల్లబల్ల, గంట మొదలైనవన్నీ అమర్చబడి వుంటాయి. ఒక అట్టమీద కూర్చొని చంద్రం ఉత్తరం చదువుకొని ఆలోచనలో పడ్డాడు. దాసు వచ్చిందికూడా గమనించడు. దాసు—స్నానంచేసి తల తుడుచుకుంటూ వుండవచ్చు. అంతే బయటకు వెళ్లే ప్రయత్నంలో వుంటాడు. కాసేపాగి దాసే అందుకుంటాడు].

దాసు : ఏమిటీ ఉత్తరం చంద్రం? ప్రైవేటేం కాదుగదా?

చంద్రం : అయినా—నీదగ్గర దాపరికమేముంది దాసూ! (ఉత్తరం ఇస్తూ) కలెక్టరుగారు ఏం నిర్ణయించుకుందీ వ్రాయమని వ్రాశారు.

దాసు : అవునుమరి. సమస్యల్ని వదులుకున్నవాడు తొందరపడడూ మరి?

చంద్రం : నాకేం తోచకుండావుంది దాసూ.

దాసు : అది సమాధాన మవుతుందామరి?

చంద్రం : కాకపోవచ్చు కాని—నేనిప్పట్లో ఏ నిర్ణయానికీ రాలేకుండా వున్నాను.

దాసు : నీ నిర్ణయమయ్యేదాకా ఆగమన్నావా?

చంద్రం : నిజంగా పరిస్థితులు ఇలా వక్రిస్తాయనుకోలేదు దాసూ.

నేనీ కార్యరంగంలోకి దిగడానికి సీత ఎంతో ప్రోత్సాహ మిచ్చింది. గ్రంథాలయ రంగంలోపనిచేయాలని వుందంది.

దాసు : కావచ్చు. కాని—ఆలోచన జరిగినంత వేగంగా ఆచరణ వుంటుందంటావా?

చంద్రం : కాదని తెలిసికూడా ఎలా అంటాను?

దాసు : ఇంకేమ్మరి. చూడబోతే—నీకింకా పాత ఆశలు పోలేదని పిస్తున్నది. అలాగైతే ఇప్పుడు పెళ్ళి చేసుకోదలుచుకోలేదని వ్రాయి. సరిపోతుంది.

చంద్రం : అదే వ్రాస్తాను దాసూ, అలాగే వ్రాస్తాను.

కోమ : (తిక్కడి వడుక్కుంటూ వస్తాడు) ఏవొఁరాతకోతలంటున్రు. కట్టకాడికి బయలెల్లరా ఎట్ల?

దాసు : చాల్లెద్దూ— మహా నీవు ఆపనిమీదనే వున్నట్టు మాట్లాడు తున్నావే?

కోమ : అన్నారు ఆమాట? ౩, ౪ వూల్ల జనాన్ని జమఁజేసుకొస్తుం టెనేవొఁ. అందర్నిజర పొద్దట్ల ఆటు ఆలంగనె సన్నాయిలు డపుకులు దీసుకొని గగగ్గ అనుకుంటు రమ్మనని.

చంద్రం : నువ్వుమటుకు పొద్దుననగా వెళ్ళి ఇప్పుడొచ్చావు.

కోమ : జర గటకన్న తాగాల్నంటరా? ఒద్దంటరా? కట్టబోసుపంటె మాటలా? పేగుల్ల బలం వుండొద్దుండి?

దాసు : చాల్లెద్దూ—ప్రతిదానికి ఏదో సమాధానం చెబుతావు. ఆల స్యమైందేలని మేమడిగితే నువ్వుచెప్పేదిదా?

కోమ : ఎట్టజావమల్ల. మీరు వూల్లె బడేవఁని సురూ జేసినోరిగని— అప్పుడే మావోనికి, నాకు యుద్ధంజరిగేకాడి కొచ్చిందిగద.

చంద్రం : అదేమిటికథ? మొత్తమీఁద ఏదో ఒకటి తెచ్చిపెడ్తావు.

కోమ : ఏరే ఏంలేదులేరి. బల్లె మీరేవఁన్న మిఠాయిగిట్ల పంచి పెడ్తునా్ౖనఎట్ల పిల్లలకు?

దాసు : ఏం? అట్లాపెడితే—ఇక గా్ౖరతిబడి మానేసి నువ్వుకూడా పిల్లలతోపాటు పగటిబళ్ళో చేర్దామనా?

కోమ : కాదుండీ. బడికిపోకతల్లి ఆడెప్పుడు సేనుకాడ్నే పుండెటోడు గద. ఇప్పుడు నేనేం గీపనిమీసబోతి, తల్లేవోఁ పొలంకావలి బాయె. జర తల్లికి బువ్వ ఇచ్చిరారా అంటె నా సమువు బోద్ది అనంటడు ఎట్ల పాడైద్దుండీ? ఆనితోని బువ్వపంపె టోరుకు తాపలు దిగొచ్చిౖనసుకోరి. మల్ల అది జర ఆలస్య మైఁపాయె. అంత ఇడసకుండ సదివే మజా బల్లె ఏం బెట్టిౖనూ అని?

దాసు : అది సరిగా చదివేవాడికి తెలుస్తుందిమరి. నీలాగా అడపా తడపా సేర్చేవాడికేం తెలుస్తుంది?

కోమ : దస్కతు జేస్తుంటి, బాలసిచ్చ ఎల్లబాడ్తాంటి. ఇంకెంత జద వాల్నంటరుండీ?

చంౖద్రం : నీకు ఓపిక ఉన్నవరకు చదువుగాని మరి అంతమంది వస్తారుగదా— అన్నంబెట్టలేక పోయినా నీళ్ళు తాగుదా మంటే ఏంపోద్దామనుకున్నావు?

కోమ : అన్నంబెట్టుడూ! కట్టపసుడు మన పెల్లికాఎట్ల? ఇంగ నీల్లంటె తెచ్చిపెడ్తలేరి. (తిక్కడ అక్కడబెట్టి ఖాళీకుండ తీసుకెడతాడు.)

చంౖద్రం : ఆఁ, దాసూ! మీ వాడలో కలరా వ్యవహారం మెలావుంది?

దాసు : చాలావరకు తగ్గినట్టేననుకో. ఇందాక అంతాలేరు. చేలకు వెళ్ళారు. ఇప్పుడు అన్నాలకొస్తారు. మళ్ళీవెళ్ళి కొందరికి ఇనాక్యులేషన్లివ్వాలి... వెంకటపతిగారు అక్కడి పెంట తీసేయించాడుగా?

చంద్రం : పొయ్యాలని పోసినవాడు ఎందుకు తీసేస్తాడు? పైగా అడిగితే తన భూమి అంటాడు.

దాసు : పంతానికొక్కకుంటే గుడిసెల పక్కనే పోయాలా? అంతకు ముందెప్పుడైనా అక్కడపోశాడా? ఏదోరకంగా వాళ్లకు ముప్పు తేవాలనేగా. ఇందాక కల్సినప్పుడు అడగాలనే అనుకున్నాను—మీరక్కడ పెంటపొయ్యడంవల్లనే ఆవాడకు కలరావచ్చిందీ అని. కాని—అక్కడి పరిస్థితంతా అదో రకంగా వుండిందిలే...మరి—సహకార సంఘంలో అప్పు వ్యవహార మేమన్నాడు?

కోమ : (కుండ దెచ్చి బెట్టి) నన్నడుగురి దానిసుచ్చట. అంత అప్పు మనకెందుకిస్తడుండీ? అది తీసునెకోరు ఏరే వుంచరు.

దాసు : పోనిస్తూ—నువ్వేదో అందనిది, పొందనిది చెబుతావు. ఏం చంద్రం—ఏమన్నారు?

చంద్రం : ఎందుకో ఆమాట అడిగితే ఆయనకు ఎక్కడలేని కోపం, విసుగు పుట్టాయిమరి.

కోమ : (మళ్ళీ వడుకుతూ) నేసేపని పక్కంగుంటె బయమెందుకు? అందరిపేర వందల పద్దులు రాసేది, పదులు ఇచ్చేది.

దాసు : తీసుకునేవాడు వొప్పుకుంటే మనమేం చేస్తాంగాని—మన విషయం ఏమన్నారు?

చంద్రం : కుదరదట. ఇప్పటికే ఏవో బకాయీలు చాలా వున్నాయట.

దాసు : ఈ విషయం పైకిరాస్తే?

చంద్రం : మరికాస్త విరోధం కొనితెచ్చుకోవడమవుతుంది.

కోమ : ఇసోర్కు మనతోటి మంచిగుండాఎట్ల? కాయిశం ఏసైతె సూడ్రాదురి.

చంద్రం : వేయగానే వూరుకుంటుందా? దాని పనది చేస్తుంది. సరె—మరి కొన్నాళ్ళు చూద్దాం మరి.

దాసు : నీ ఇష్టం. నేను మళ్ళీ వస్తా. (మందులపెట్టెతో వెడతాడు)

కోమ : కొత్తంగ దవకాన కట్టుకున్నాగని—మందులపెట్టె ఇంక సేషుత్నే వుంటదీ?

చంద్రం : దవఖానా అంటే—అక్కడికొచ్చేవారికి చికిత్సచెయ్యొచ్చు. మరి ఈపెట్టె ఎప్పుడూ చేతిలో వుండాల్సిందేగా?

కోమ : ఏం మందోగని—మొన్న పొడిసినా సంత సెయ్యే లేవక పాయె నే.

చంద్రం : కలరా టీకాలు తీసుకున్నావా ఏం?

కోమ : అంత తీసుకోవాలంటిరిగన.

చంద్రం : అవుననుకో. నీ కసలు టీకాలు వద్దన్నావుగా?

కోమ : బయట్నుండి పాడై. ఇదో ర్కొన్నడన్న తీసుకున్ననాం, ఏవన్ననా? ఎనకటిసంది లేంది ఒక్కపాలే వొచ్చెటోరును ఎట్టన్నైన జర తిప్పలు కావంటారు?

చంద్రం : అది సరే చెప్పేదేముంది? ఆనుధ్య దేవాలయంలో హరి జనులంతా ప్రవేశిస్తుంటే నీవరకు నీవు రాలేదు. కారణ మదేగా?

కోమ : మీరు ఎయ్యి జెప్పురి, లచ్చ జెప్పురి. ఆల్లు, మనం కల్సి తిర గాల్నంటె—మనుసంత బుగులు బుగులనిపిస్తదుండీ.

చంద్రం : ఎన్నిసార్లు చెప్పాను—మనకూ, వాళ్ళకూ భేదంలేదనీ, అసలా ఉద్దేశ్యమే మనసులోకి రానీయకనీ. అయినా— ఒకరి బలవంతాన ఎందుకొప్పుకోవాలి? నీ అంతట నీవా లోచించు—వాళ్లకూ, మనకూ ఏం తేడావుంది?

కోమ : అదేంలేదు. ఒప్పినగని—మరి మన తాత, ముత్తాతల కాడ్నించి అదో తప్పున పసిరిగద?

చంద్రం : చూడు కొవ్వరన్నా! వెనకటికి పిల్ల పెద్దదయ్యాక పెళ్ళి చేయడం తప్పన్నారు. అందాకా ఎందుకు? మొగుడు చచ్చాక—భార్యకూడా ఆ చితిలోపడి చావాలన్నారు. ఇప్పుడవన్నీ జరుగుతున్నాయా? అవ్వన్నీ మంచివంటావా?

కొమ : ఒకల్లకోసం ఇంకోల్లు జచ్చుడం బాగుండీ — మీరళ్ళె అంటరు?

చంద్రం : నేనేమంటున్నాను? అవ్వన్నీ ఇనేళ పనికిరావనే అంటు న్నాను. అలాగని వెనుకటివాళ్ళు చెప్పినవన్నీ తప్పని ఎవరూ అనరు. దేనైనా మన బుద్ధితోకూడా ఆలోచించాలి. చూడు, మన వూళ్ళో గుడి కట్టేదాకా వాళ్ళు శ్రమపడిరి గదా! తీరా—విగ్రహాన్ని అందులో పెట్టేసరికి వాళ్ళు అందులోకొచ్చే వీలులేదా? అది తప్పా? ఎట్లా అవుతుంది చెప్పు? నీవాలోచించుమరి.

కొమ : ఏమోయ్యయ్యా—నేనంత పెద్దోటికి జబాబియ్యలేస్తాను?... అంగో నర్సయ్యన్న ఒచ్చిండు ఏలకు. అన్ని ఎరకైనాయిన గద. ఆయిన్నడుగుదాయిం...ఏమంటరు?

(నరసయ్య ప్రవేశం)

చంద్రం : అట్లాగే. నమస్కారమన్నా! కూరోచ్చి.

నర : కొవ్వరన్నా! చంద్రంతో వాదం పెనుకుంటున్నావు— ఏమిటీ కథ?

కొమ : అమ్మో! నాకన్ని పెడ సవాళ్ళేస్తుండే.

చంద్రం : ముందే అన్నకు నామాట తప్పని చెబుతున్నట్లుందే?

నర : ఏమిట్రా ఆ సవాళ్ళు?

కొమ : శంద్రవయ్య అంటడూ— అంటరానోల్లను ముట్టుకో టంల తప్పేలేదంటడు. నిజంగనే నంటావె?

నర : అరేయ్ ఇన్ని మాటలెందుకురా కోవఁరన్నా? చంద్రంఅంటే నీకు తెలిసినవాడనే గౌరవముందిగా?

కోమ : ఇంగ స్వరెపా. శంద్రవఁయ్యా దేవుడుకాడె?

చంద్రం : అంత పెద్దమాటొద్దు. తప్పు. నన్ను మనిషిగా చూస్తే చాలు.

నర : ఆఁ గౌరవంకొద్దీ అన్నాడుగాని—మరేమీ అనుకోకు చంద్రం. అయితే—చంద్రానికి లేని తప్పు నీకూ, నాకూ ఎట్లా వస్తుంది?

కోమ : హమ్మొ అన్నా. దెబ్బకే నా నోరు గట్టేస్తివే!

నర : ఇందులో నోరు కట్టేదేముందిరా? మనకు స్వయంగా ఆలోచించుకునే శక్తన్నా వుండాలి; లేకుంటే—మనం మంచివాళ్లనకునేవారు వెళ్ళే మార్గంలోనన్నా వెళ్లాలి. ఈ రెండూ లేకపోడే వాడొట్టి—

కోమ : పనికిరానోడండూ?

చంద్రం : ఆఁ—అంతమాటెందుకుగాని నరసయ్యన్నా! మొత్త మ్మీద నేనిన్నాళ్లనుంచి చెప్పిందానికన్నా నీ వొక్క ముక్క బాగా పనిచేసిందే.

నర : ఆఁ నీకు చెప్పదగ్గవాణ్ణాం చంద్రం. అనుభవమనేదికూడా కొంత మనకు ఉపయోగపడుతుందనుకో. అందులోనూ- ఏ యోగ్యతలో ఉన్నవాడికి ముందు ఆ యోగ్యతకు తగ్గట్టు చెబితే బాగేమో.

కోమ : ఎట్టనైన నరసయ్యన్న తెక్కే పరుగనీ. అన్నా! నీవొక్క మాటతోని నా మబ్బిచ్చుకపాయెనేవేఁ. నిజంగనే మల్ల— శంద్రవఁయ్యకులేని తప్పు నాకుంటాది? మరింత దెబ్బే మొన్నటిదక్క నువ్వుగూడ—

నర : అవును. దానికి సంజాయిషీ చెప్పుకోవాలి. తప్పదు. మంచిపనులను చేయడానికి కొన్ని కష్టాలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది. వాటిని ఎదుర్కునే తాహతులేక ఇన్నాళ్ళు నేనూ అందరితో పాటు తలూపాల్సొచ్చింది. నిజానికది తప్పే. ఇప్పుడు మనవాళ్ళు ఈ పనికి పూనుకున్నాక ఎంతో ధైర్యం వచ్చింది...సరేగాని— ఇవేళ కట్ట గండ్లు పూడుస్తున్నారేమోగా చెప్పరేం.

కోమ : చుట్టుపక్కాల్లనించి జనం కదిలొస్తాంటె నేవోం. ఇప్పుడో, ఇంకాసేపటికో దిగుతారు.

నర : ఆకట్టను గండిపడి—పాడుబడిపోయి ౧౫, ౨౦ ఏండ్లుకాలే?

చంద్రం : ఆ అయింది అన్నా. నా బుద్ధి ఎరిగినప్పటి నుంచీ దాదాపు అలాగేవుంది.

నర : నిజంగా మళ్ళీ గండి పూడిస్తే ఎంత భూమి తరీఅవుతుందను కున్నావు చంద్రం. అసలు—మీ మావ బంగారం పండించి, మీకు చదువులు చెప్పించింది దానివల్లనేగా? గండి పడడంతో ఆ భూమి కాస్తా మెట్ట అయి కూచుంది.

కోమ : మరిప్పుడన్న సాయపడకూడదానె అన్నా! కట్ట సరిగ్గుంటె ఆరి బావి పూటకు పండుతదిగాదె? కాల్లతోని తోసుకోడె రూపాయలు కాల్లతోని.

నర : అయినా—పట్టువలరాసురి. దానికి మంచి చెడ్డల ఆలోచనేముంది?

కోమ : ఈరికిదంట ఆ ఎంకటపతిగారు. ఆరికె బంటు ఆ పాపన్న.

నర : పాపం గోపయ్యకూ, వెంకటపతికి పోలిక పెట్టడంతప్పురా.

చంద్రం : వెంకటపతిగారంటే—పోనీ ఏదో పెత్తందారనుకుందాం.

తనకేదో ఇబ్బందనుకోవచ్చు. పాపన్నకుకూడా ఈ పనులు నచ్చకపోవడం ఆశ్చర్యంగా వుంది.

నర : వాడు—ఇలా రకరకాల సంస్థలలో పనిచేసి కాయకష్టం మానేసి— కుర్రపెత్తనాని కలవాటుపడ్డాడు. అలాంటి పనులు కల్పించడానికి వెంకటపతిని నమ్ముకోవాలి. ఇంకేం చేస్తాడు మరి?

కోమ : అన్నోయ్! ఆనికి బాటలెంబటి రేత్రిల్లు దీపాలుపెట్టుడు బాగలేదంట.

చంద్రం : అదీ తప్పేనా?

కోమ : మరేమనుకున్రు. దీపాలు లేనప్పుడంట—పావ బాగ కనబడేదంట; ఇప్పుడు—సెయ్యి అడ్డంపెట్టుకుంటేగాని బాటలు కంప్లబడటంలేదంట. ఇప్పుడీ దీపాలు వొచ్చినంక నే బాటలన్ని సీకటైనయంట.

నర : గుడ్లగూబకు చీకటంటే ఇష్టం. పాపం మనమేం చేస్తాం?

చంద్రం : అన్నా! ఇదంతా చూస్తుంటే అజ్ఞానమనిపించటంలే. మరేదో కూడా వుందనిపిస్తుంది.

నర : ఇది ముప్పావుభాగం పొగరు చంద్రం — నువ్వేమన్నా అను.

దాసు : (తలకు గాయం తగిలి గబగబావస్తాడు) అక్షరాలా పొగరు అన్నా! ఇది పూర్తిగా పొగరే.

(అంతా ఆదుర్దాపడతారు. అతను బల్లమీద కూర్చుంటాడు. చంద్రం మందులపెట్టె విప్పి కట్టుకట్ట ప్రయత్నిస్తాడు.)

చంద్రం : ఏమిటి దాసూ?

దాసు : ఇంకేమిటి మన పాపన్నగారి ప్రతాపం.

నర : కారణం?

కోమ : జల్ది చెప్పురి. ఆని పానాలు దీపిస్త.

దాసు : మనమేమీ తొందరపడనక్కరలేదు. అలా తొందరపడితే ఇందాకనే వాడి ప్రాణాలు తీసేవాళ్ళు పూళ్ళోవాళ్ళు.

చంద్రం : ఇందాకా ఎందుకొచ్చిందసలు?

దాసు : ఆఁ మిద్దింటి రామస్వామి ఇంటిముందున్న పెంటదిబ్బ రోజూ ఆయన ఆసనమట. ఇప్పుడు రామస్వామి పెంటను పూరిబైట పోస్తున్నాడట. దిబ్బ అక్కడ్నుంచి కదిలించనీ, మనం కదిలించామనీ వాడి కడుపుడుకు.

చంద్రం : అదీ వాడికి కష్టమేనా?

నర : ఏంచేస్తాం బాబా! అది వాడి ఆసనం కావడం మన గ్రహచారం. ఇక పూళ్ళోకి రోగాలొస్తాయంటే రావూ?

చంద్రం : ఆ పెంటదిబ్బ వాడు కూర్చోడానికికావాలనడం ఆశ్చర్యంగా వుంది.

కోమ . పోరుండీ వూకె. అన్ని మీకు ఇప్పెసెప్పాలె. దానిమీన గూకుంటె గిలకలబాయికాడి పడుసులంత కండ్లబడ్తరు.

చంద్రం : పడ్సినట్టుంది. వీడి శృంగారంకోసం పెంటదిబ్బలూ, పెట్ట గోడలూ వుండాలన్నమాట. మరి—నీమీది కెలావచ్చాడు వాడు?

దాసు : ఆఁ...తోవన వస్తుంటే వాడు రామస్వామిని దిబ్బ తీసే శాడని దబాయిస్తున్నాడు. నేను ఏమిటా దబాయింప న్నాను. దాంతో కఱ్ఱ ఎత్తి నీకెందుకు పోరా అని ఇలా తోశాడు.

కోమ : ఎట్లనైన ఆని పొగరు శాన ఎక్కువవుతుండదిలేరి. ఒకాక్క డ్నించేవొఁ గొడ్లకు మందులు బెట్టి సంపుతడు; ఇంకో కాడ్నించి మీరు గొడ్ల కిచ్చే మందుల్ల ఇసం వుందంటడు.

ఇట్టుండదది ఆడి ఎవారం. ఎన్నడో దుడ్డుగోల్ల తిరిగేస్త మల్ల.

దాసు : అలా వద్దు. వెంకటపతిగారికి చివరిసారి చెప్పిచూతాం.

కొమ : మీరట్టంటె ఇంగ నేనేం జెప్త.

చంద్రం : ఎలావుంది దాసూ? కొంచెం విశ్రాంతి తీసుకో లోపల.

దాసు : జనవంతా వస్తుంటే నాకు విశ్రాంతేమిటి? ఫర్వాలేదు. భయపడాల్సినంత పెద్దదేం కాదు.

నర : అసలు వాడివ్యవహారమంతా వెడసెగావుంది చంద్రం. పెద్ద వాళ్ళలాగా అరుగులమీద కూర్చునే యోగ్యతలేదు; అది వాడికెక పట్టదుకూడాను. పోనీ—అందరిలాగ కిందకూచుం టాడా అంటే—వాడి హోదాకది భంగం. అందుకని ఇలాంటి వెధవ దిబ్బలూ, చెట్లు, గోడలు ఎక్కి కూచుం టాడు. వెంకటపతేవో( పిణ్ణి సెత్తి నెక్కించుకుంటాడు.

కొమ : ఎట్టనైన పావు(కు పాలుపోస్తుండుగనీ.

నర : ఆయన సరియైనవాడైతే అనుకోవడమెందుకూ? అయినా ఇదంతా ఏవో( అంటారే ఆరే దీపం మహా మండుతుందని. ఎన్నాళ్ళులెద్దూ — ఈ ఆటలు? అంతా కళ్ళుదెరిస్తే ఈయన ఆటలెలా సాగుతాయి?

(ఇంతలో దూరంనుంచి ఊరేగింపు వస్తున్న చప్పుడు. డప్పులు, సన్నాయిల చప్పుడేకాక పాటకూడ పెట్టవచ్చు)

చంద్రం : పోనీ అన్నా! ఇతరుల సంగతెందుకూ? మనం చెడుచేయ కుండా చూద్దాం. అదిగో మనవాళ్ళు వస్తున్నారు. వాళ్లకు ఎదురువెళ్ళి తీసుకొద్దామా? (దాసు, కొమ(రన్నలు పద, పదండి అంటారు. నరసన్న మాత్రం)

నర : ఎక్కడికి? కట్టదగ్గరికా?

దాసు : అవును. ఇటునుంచేగా తోవ. ఎదురువెళ్ళి తీసుకొస్తే బాగు గాదూ?

(ఊరేగింపు నెమ్మది నెమ్మదిగా దగ్గరవుతుంటుంది)

నర : నిజమేగాని చంద్రం! అసలు నేనో విషయం చెబుదామని వచ్చాను.

చంద్రం : ఏమిటది అన్నా?

నర : ౬, ౫ రోజులనుంచి సీతకు జ్వరం వస్తున్నది. గోపయ్య ఏహో మంత్రాలు, తంత్రాలు చేయిస్తున్నాడుగాని—తగ్గడంలేదు.

చంద్రం : ఏమిటన్నా! సీతకు జ్వరమా! మావయ్య ఈ విషయంలో నన్నా కబురంపలేదే?

నర : సరే—అంత సరసమైతే బాగానే వుండును.

చంద్రం : ఎలా అన్నా! మరి. మనం వెళ్ళొద్దూ? అదిగో ఊరేగింపు రానే వచ్చింది.

దాసు : దానికింత ఆదుర్దా ఎందుకూ? నేనూ నరసన్నా అటు వెళ్ళి—మందిచ్చి అటునుంచటే కట్టదగ్గరకు వస్తాం. నీవూ, కొమరన్నా వాళ్ళతో వెళ్ళండి.

కోమ : ఉపాయం బాగుందండీ.

చంద్రం : మంచిది దాసూ. అలాగే కానివ్వండి. నేను వచ్చిమాత్రం ఏం చేస్తాను?

దాసు : అయితే—పదన్నా తొందరగా వెడదాం. (దాసు, నరసయ్యలు వెడతారు)

కోమ : మనమటు పోదామంటూరా?

చంద్రం : ఆఁ—పద.

(ఊరేగింపుపాట)

ముందడుగు వెయ్యరా
కట్ట బాగుచెయ్యరా
వానవల్ల వరద దెచ్చు
గండిపూడ్చి వెయ్యరా॥ గండి॥ ముంద॥

పదరా నడుమూ......కట్టిపదరా
కడుపునిండ తిండీ—మరి కంటినిండ నిద్రా
ఉంటాయి మనకూ మన పంట నిలిచియుంటే
ఆ పంటను నిలబెట్టునట్టి గట్టికట్ట వేయుటకును
ముంద॥

సదువులు సదవాలంటే
కూడుగుడ్డ ఉండాలి
మనల మనం నడుపుకోనేం
దుకు సదువులు గావాలి
వీటి కన్నిటికి మూలం
గండి బాగు పడడమురా॥ ముంద॥

(వారిద్దరూ వెడుతుండగా తెర. మళ్ళీ కొత్తరంగం ప్రారంభమయ్యేదాకా ఊరేగింపు చప్పుడు ఎక్కువ అవుతుంది. ఆ రంగం ప్రారంభమైన కొంతసేపటివరకు చప్పుడుంటుంది.)

# అడుగుజాడలు

## నాలుగవ రంగం

### గోపయ్య ఇల్లు

[అంతా మొదటిరంగంపలెనే అలంకరణ. అయితే ఇప్పుడు సీత మంచమ్మీద పడుకొని జ్వరంతో వణుకుతున్నది. చప్పుళ్ళతో వయోజన పాఠశాలనుంచి బయలుదేరిన ప్రజలు ఊరిబయటవున్న కట్టదగ్గరికె వెడుతున్నట్టు సూచించేట్టుగా చప్పుడు తగ్గిపోతున్నది. ధ్వని తీవ్రంగా ఉన్నంతసేపూ దాసు—సీత జ్వరం చూడడం, నాలుక పరీక్షించడం జరుగుతుంది. ఇంజక్షనిస్తాడు. బయటి చప్పుళ్ళు తగ్గిపోగానే సీత చలితో వణుకుతున్న ధ్వని ఎక్కువవుతుంది. దాసు—కొన్ని ట్యాబ్లెట్లు నరసయ్య కిస్తాడు.]

దాసు : మరేం భయంలేదని చెప్పు నరసయ్యన్నా. ఇది చలిజ్వరమే. ఈ ఇంజక్షనుతో తగ్గిపోతుంది. ఇదిగో ట్యాబ్లెట్లు. గోపయ్యగారికిచ్చి మరేం ఆదుర్దాపడనక్కరలేదని చెప్పు. అదిగో ! అంతా కట్టదగ్గరికి చేరినట్టున్నారు. నేను త్వరగా వెళ్ళి కలుసుకుంటాను.

నర : నేనుమాత్రం రాను దాసూ?

దాసు : గోపయ్యగారు రాగానే వచ్చెయ్యి.

సీత : (వణుకుతూనే) ఎక్కడికి దాసుగారూ?

దాసు : కట్టగండ్లు పూడ్చడానికి చుట్టుప్రక్క పూళ్ళనుంచి ప్రజలొచ్చారు. నేనక్కడికి వెడుతున్నాను. మళ్ళీ రేపో, ఎల్లుండో వచ్చి చూస్తాను, ట్యాబ్లెట్లిచ్చాను. సాయంత్రం

రెండు తీసుకోవాలి. నాన్నగారొచ్చేదాకా నరసయ్యన్న వుంటాడు. వస్తా అన్నా మరి. వస్తానమ్మా. (బయటికి వెళ్ళబోతూ మళ్ళీ ఆగి) నీవీ చలిగాలిలో పడుకోవడం అంత మంచిదిగాదమ్మా. అన్నా! వీరిని లోపల పడుకోబెట్టించు.

నర : సరే. (దాసు వెడతాడు) దిగు సీతా! ఆ గదిలో పడుకుందువుగాని పదమ్మా....నాన్న ఎటు వెళ్ళాడు?

సీత : తెలియదన్నా. ఇందాకే వెళ్ళారుమరి.

(నరసయ్య—సీతను లోపలికి తీసుకెడతాడు. గోపయ్య వస్తాడు. చెప్పులు పక్కనవిడిచి మంచంవైపు చూస్తే సీతకనపడదు. చప్పున భయపడ్తాడు.)

గోప : సీతా! సీతా! (గదివైపు పోబోతాడు. నరసయ్య ఎదురవుతాడు).

నర : లోపల పడుకుందిరా.

గోప : లోపలా! ఎట్లావుందన్నా జ్వరం?

నర : ఇప్పుడేగా దాసు ఇంజక్షనిచ్చి వెళ్ళాడు.

గోప : (ఆవేశంతో నరసయ్యను వూపుతూ) ఆఁ—సూదిమందిచ్చి-నా సీతను ఏం చేశారన్నా? ఏంచేశారు?

నర : ఇదేం పిచ్చిరా? వెచ్చగా వుండాలని గదిలో పడుకోబెట్టాను. లోపలికెళ్ళి చూడరాదూ.

గోప : ఎంతపనిచేశారన్నా! నా సీతనేంచేశారు? (గబగబా గదివైపు వెడతాడు. కొద్దిసేపు నరసయ్య ఎటూ తోచక చిరాగ్గా తిరుగుతుంటాడు. ఇంతలో మళ్ళీ గోపయ్య తిరిగి వస్తాడు)

నర : ఏరా—ఎలావుంది?

గోప : ఉందన్నా. నా సీత వుంది.

నర : ఒరి—నీ పిచ్చి దొంగలుదోల. ఈ మాత్రానికి ఇంతఆదుర్దా, ఆవేశమేమిట్రా?

గోప : నీకు తెలియదన్నా. ౪, ౫ రోజులనుంచి జ్వరం వస్తూ పోతున్నదేగాని—పూర్తిగా నయం కావడంలేదు. ఎటూ తోచలేదు. పొద్దున పిడకల గుడిసెలో ఉప్పలి చూసినప్పటి నుంచి నా కడుపులో ఏదో భయం భయంగా వుంది. దానికి శాంతి జరిపించాలని చాకలికి చెప్పిరావడానికి వెళ్ళాను. ఇంతలో మీరొచ్చి ఇంజక్షనిచ్చారు.

నర : ఇంకేమ్మరి—తగ్గుతుంది. భయపడకు.

గోప : దానికి సూదిమందులు పడవన్నా.

నర : అదేమిట్రా—ఎందుకు పడవు?

గోప : పడవు అన్నా—పడవు. అది మరెప్పుడైనా చెబుతాను.

నర : ఇచ్చాంగదూ—చెప్పు మరి. ఏమిటీ నీ అనుమానం? అవసరమైతే విరుగుడు ఇప్పిద్దాం.

గోప : (కాస్త ఆశకనిపిస్తుంది) అయితే విరుగుడిప్పించన్నా—వెంటనే ఇప్పించు.

నర : ఏమిటా గాభరా? అసలు కారణమేమిటో చెప్పరాదూ?

గోప : అది మరెప్పుడైనా చెబుతానన్నా. ఇప్పుడు విరుగుడిప్పించు.

నర : అంత పిరికైతే ఎట్లారా? కారణమేమిటో చెప్పు. అంతవసరమైతే చూద్దాం మరి.

గోప : (శేషమ్మ ఫోటోదగ్గరికి వెళ్ళి) అన్నా! నీ మరదలు పురిట్లోనే ఎందుకు చనిపోయిందో తెలుసా?

నర : ఎందుకు చనిపోయిందంటావు?

గోప : సీత పుట్టిన వారంలోగానే బాలింత జబ్బొచ్చింది. మన వూళ్లో ఉన్న వైద్యులంతా చికిత్సచేశారు. శ్యామలమ్మ గారు మంత్రం వేసింది; జవాంలుసాహెబు పొగవేశాడు; పేరమ్మ సోది అడిగొచ్చింది. ఏవీ పనిచేయలేదన్నా. మన మంగలి సోవులు కొడుకు రాఘవులని వుండేవాడు—తెలుసుగదూ. అంతకుముందు వాడు గడ్డలు నయంచేసే వాడు. కొత్తగా సూదిమందులుకూడా ఇస్తున్నాడని పిలిపించాను. మీ మరదలు వద్దని మొత్తుకుంటున్నా వినక—గత్యంతరంలేక అతనిచేత సూదిమందిప్పించాను. చేయరాని అపరాధం చేశానన్నా. ఈ తప్పుకు మీ మరదలు నన్నెప్పుడూ క్షమించదు....సూదిమందిచ్చిన వెంటనే ఆ ప్రదేశమంతా వాచింది. రోగం ఎక్కువైపోయి—మీ మరదలు—పసికూనను ఈ దౌర్భాగ్యుడిచేతిలో పెట్టి వెళ్ళిపోయిందన్నా. ఈ తప్పుకు మీ మరదలు నన్నెప్పుడూ క్షమించదు.

నర : ఒరి పిచ్చోడా ! అదా సందేహం. విచారించకు గోపయ్యా విచారించకు. అది నీ దోషంకాదురా. ఆ రాఘవుల దోషం. తనకు తెలియని శాస్త్రాన్ని శేషమ్మమీద ప్రయోగించి—నీకు దానిమీద నమ్మకం లేకుండా చేశాడు. మనిషిలోవున్న దోషాన్ని మందుకెట్లా ఆపాదిస్తాంరా? ప్రపంచంలో కోట్ల మంది ఇంజక్షనులు తీసుకుంటుంటే అందరికీ ఇలాగే వాస్తున్నాయా? అవి ఇచ్చే విధానంలో ఏమాత్రం శిక్షణ పొందనప్పుడూ, తెలియకుండా ఇచ్చినప్పుడూ ఇలా జరగొచ్చు. దాసుగారు శిక్షణపొందినవారుగదూ గోపయ్యా... అయినా—నీకంత భయంగావుంటే ఇప్పటికే వాయవలసిందిగా.

గోప : ఏమో అన్నా ! నాకవంటే భయం.

నర : ఆ ఫికరేమీ అక్కర్లేదు గోపయ్యా. ఇది మామూలు చలి జ్వరమే. ఈ ఇంజక్షనుతోటే తగ్గిపోతుంది. ఇదిగో కొన్ని ట్యాబ్లెట్లుకూడా ఇచ్చాడు. సాయంత్రం రెండివ్వు. దాసు-మళ్ళీ రేపో, ఎల్లుండో వస్తాడు. నేనిప్పుడే కట్టదగ్గరికి వెళ్ళి ఆ పనైపోగానే వస్తాను. నీతో చాలా మాట్లాడాలి. మరేం భయపడకు గోపయ్యా. అన్నిటికీ పరమేశ్వరు డున్నాడు. తప్పకుండా తగ్గిపోతుంది.

(నరసయ్య బయటికెడితాడు)

గోప : సీతా ! సీతా ! వస్తున్నా తల్లీ ! (గదిలోకి వెళతాడు... ఇంతలో వెంకటపతి వస్తాడు)

వెంక : గోపయ్యగారూ ! గోపయ్యగారూ! (గోపయ్య వచ్చేలోగా అక్కడి మంచంమీద కూచుంటాడు. గోపయ్య వస్తాడు) అమ్మాయి కెలావుంది?

గోప : అలావుంది. ఇందాక దాసువచ్చి ఇంజక్షనిచ్చి వెళ్ళాడట.

వెంక : అట అంటే మీరు లేరా ఏం?

గోప : బయటికెళ్ళాను.

వెంక : బాగానేవుంది. అయినా-వాళ్ళకు అవసరమైనవారి సలహా లెందుకూ? చూశారుగా ఇందాక వూరేగింపు! ఊళ్ళో వాళ్ళం మనం ఇక్కడే పడున్నాం; చుట్టుపక్క వూళ్ళ వాళ్ళను పిలిచి కట్ట పోస్తున్నారు.

గోప : పోనిద్దురూ ఎవళ్ళో ఒకళ్ళు పోస్తున్నారు.

వెంక : మీరూ ఆమాటన్నారూ! పోస్తేపోశారు. మనకేంగాని— వాళ్ళ ప్రవర్తనకు చెబుతున్నానండీ. మీకుతెలియకుండానే

అమ్మాయికి ఇంజక్షనిచ్చి పోయారంటే మీరంటే ఎంత నిర్లక్ష్యమో ఆలోచించండి.

గోప : జరిగిపోయిందాని కేంచేస్తాం లెద్దురూ?

వెంక : మీరలా మెత్తగా ఉండబట్టే నెత్తి కెక్కి కూచుంటున్నారు మరి. సరె—మీ ఇష్టం. ఇంతకూ అసలు విషయం మర్చే పొయ్యాను.

గోప : ఏమిటది?

వెంక : పరపతిసంఘంలో మీ పేర ౪౫౦ రూపాయల అప్పుందిగా?

గోప : ౪౫౦ ఎక్కడివండీ? ౧౫౦ చాలన్నాను. అక్కడికే నూరేగా పంపించారు. అవికూడా తిరిగి కట్టాగా?

వెంక : అవునండి. అది కాదన్నానా? అందుకేగా మీ పేర ౪౫౦ వున్నాయన్నాను. బకాయీలకోసం ఆపానా—ఇప్పుడది పీక మీదకొచ్చింది.

గోప : బకాయేమిటి? నేను గడువులోపలే కట్టాగా.

వెంక : నిజమేనండీ. కాని-ఏం లాభం? మిగతావారు కట్టకపోవటంతో కట్టినవారిదికూడా లాభం లేకుండా పోయింది.

గోప : నాకా వ్యవహారాలేమీ తెలియవు. ఇంతకూ—ఇప్పుడేమయి నట్టు చెబుదురూ?

వెంక : వేరే ఏముంది? మనవాళ్ళ అవసరంకోసం మనం ఆగా మని-బ్యాంకు ఆగుతుందా? మొత్తం డబ్బు కడ్తున్నారా? తగు చర్య తీసుకోవాలా? అని నోటీసు పంపి వూరుకుంది.

గోప : అదేమిటండీ—అంచాకా ఎందుకు రానిచ్చారూ?

వెంక : నన్నేం చేయమన్నారు చెప్పండి? అబ్బబ్బ! వెధవది—నేనీ సహకార సంస్థతో వేగలేకుండావున్నాను. దీంతో బంగారం

వంటి వడ్డీవ్యాపారం దెబ్బతిన్నది. పైగా — అనుకున్న ప్రకారం వ్యవసాయమూ సాగలేదు. ఏమిటో—ఇప్పుడను కుంటే ఏంలాభం? ఎట్లా తగిలించుకున్నామో — అట్లా వదిలించుకోవాలి.

గోప : ఎంత బకాయి వుంది?

వెంక : ౨, ౩ వేలదాకా వుంది.

గోప : ౨, ౩ వేల బకాయీలా! ఆశ్చర్యంగా వుంది. అందర్నీ గడువులోపల కట్టమని వొత్తిడి చేయవద్దుటండీ. పైగా— ఇచ్చినవాళ్లవీ, ఇవ్వనివాళ్లవీ బకాయిలెట్లా అవుతాయండీ?

వెంక : అవుననుకోండి. మీరు నూరేగా ఇచ్చారు?

గోప : బాగుంది. నేను తీసుకున్నవరకు ఇచ్చాను. మిగతావి మీరేగా అవసరానికి కావాలన్నారు.

వెంక : నిజమేకాని మిగతా బకాయీలన్నీ వస్తాయిగదా. వాటితో సర్దలేక పోతానా, ౫, ౬ వందల బకాయీలకు పెద్ద ఇబ్బందేముంటుందకునున్నాను.

గోప : అని—అవికూడా జమకట్టలేదందురూ?

వెంక : అన్నీ రాంది ఏంలాభం?

గోప : సరె—అయిందేమో అయింది. ఇప్పుడేమిటీ చెయ్యడం?

వెంక : అంత తలాకాస్త కట్టేసి.ముందు బకాయీల్లేవనిపిస్తేగాని లాభంలేదు. ఆ తరువాత చూసుకుందాం.

గోప : అంతంటే—ఎవరేం కట్టాలంటారు?

వెంక : మీపేరనున్న ౪౫౦ రూపాయల వరకు కట్టండి. ఎలాగో మిగతావాటిని నేను సర్దేస్తాను.

గోప : ఏమిటోనండీ-ఈ వ్యవహారం నాకేం బాగాలేదు. అంతా చిక్కులో పెట్టారు. నేనెప్పుడూ ఇట్లా ఇరుకున పడ్లేదు. ఎప్పుడూ ఏ షాహుకారు దగ్గరో ఋణమో, పణమో తీసుకుంటే చల్లగా వెళ్ళిపోయ్యేది.

వెంక : అదంతా ఇప్పుడనుకుంటే ఎలాగండీ? ముందీ ప్రమాదం నుంచి గట్టెక్కేమార్గం చూడండి; తర్వాతఅన్నీ మాట్లాడుకుందాం. వస్తామరి.

(వెంకటపతి లేచి వెడుతూనే వున్నాడు)

గోప : ఇంత పీకమీదికితెస్తే ఎాాగండీ-వెంకటపతిగారూ! ఆ ఋణం కి ఎక్కడ తలతాకట్టు పెట్టేది?...అప్పుడే వెళ్ళిపొయ్యారే!

సీత : (వస్తుంది) ఏమిటినాన్నా—వెంకటపతిగారు చేప్పేది?

గోప : (చిరాగ్గా) ఏంలేదమ్మా. జ్వరంతో నీవెందుకు బయటికొచ్చావు. పడుకోతల్లీ.

సీత : జ్వరం జారింది నాన్నా.

గోప : అయినా ఈ చలిలో ఎందుకమ్మా. విశ్రాంతి తీసుకో.

సీత : ఎందుకునాన్నా—అంత కంగారు?

గోప : ఏంలేదమ్మా, నీవెళ్ళి పడుకో.

సీత : నాతో చెప్పకూడదా?

గోప : చెబుతానమ్మా. తర్వాత చెబుతాను. అన్నీ చెబుతాను. ఇప్పుడు కాస్త విశ్రాంతి తీసుకో.

సీత : సరేనాన్నా ! (లోపలికెడుతుంది)

గోప : హరి భగవంతుడా! ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టావురా. (తల పట్టుకొని కూచుంటాడు. నరసయ్య వస్తాడు)

నర : ఏవిట్రా—సీత కెలావుంది?

గోప : జ్వరం జారిందట కాని-అన్నా!

నర : ఆఁ—కాని?

గోప : సాయపడ్డందుకు వెంకటపతిగారు ఎంతపని చేశాడో తెలుసాం ?

నర : ఓరి నీఇల్లు బంగారంగాను. వెంకటపతి సంగతా! ఏంచేశాడు?

గోప : సహకార బ్యాంకులో నాపేర ౪౫౦ రూపాయల అప్పు వ్రాసి. నాకు ౧౫౦ అక్కరున్నాయంటే. వంద మాత్రమే ఇచ్చాడు. మిగతావి తన అక్కరకు కావాలన్నాడు. తెల్సినవాడుగదా అని సరేనన్నాను. మళ్ళీ గడువులోపలే వడ్డీతోసహా ఆ వందా చెల్లించాను. ఇప్పుడేమంటాడూ — ఊళ్ళో అందరూ గడువులోపల చెల్లించలేదట; ౨, ౩ వేలు బకాయిలు పడ్డాయట; దాంతో డబ్బుకట్టినవారికీ కట్టనివారికీ చిక్కొందట. నాపేరనేమో ౪౫౦ రూపాయలున్నాయి. నోటీసు వచ్చిందో, వస్తుందోనట. నాకేం అర్థం కాలేదన్నా.

నర : వ్యవహారమంటే ఇంత భయమయితే ఎట్లారా? అయినా ఇదంతా ఒక నాటకంలెద్దూ.

గోప : ఏమిటిది?

నర : కాకుంటే—౨, ౩ వేల బకాయిలెట్లా వుంటాయిరా? పైగా. డబ్బు కట్టినా బకాయి వుండడమేమిటి? అసలు-ఆయన బ్యాంకు డబ్బిచ్చేదెవరికని? నీబోటి అమాయకులు ౧౫, ౨౦ మందికి. కొంత మందిపేర ౪, ౫ వందలు వ్రాసేది, వారిచేతుల్లో ౧, ౨ వందలు పెట్టేది. మిగతాది స్వంతా

నికి వాడుకొని వుంటాడు. ఇప్పుడవన్నీ కట్టాలంటే చిక్కొచ్చి వుంటుంది.

గోప : తీసుకొన్నప్పుడు తీసుకొని—కట్టాల్సొచ్చినప్పుడు కట్టొద్దూ?

నర : ఆఁ—నీదో న్యాయం. ఇవేళ నాచేతిలో ఏంలేదని అతను కాళ్ళు బారజాపితే బ్యాంకు మాత్రం ఏంజేస్తుంది? బాండులో ఎవరిపేర ఎంత అప్పుందో వాళ్ళదగ్గర వసూలు చేస్తుంది. వాళ్ళకీ లోపాయికారీ వ్యవహారాలెందుకూ?

గోప : ఎత్తు అదేకాబోలు. అందుకే-ధైర్యంగా ముందు నా పేర నున్న ఋణం కట్టమంటాడు. మిగతా వ్యవహారం తరువాత చూసుకోవచ్చుట.

నర : కావచ్చు...వివిధ రంగాల్లో సహకారోద్యమం పెద్దెత్తున కొనసాగాలని తీవ్రప్రయత్నాలు జరుగుతుంటే - ఇక్కడ కాస్తా ఇలాంటివాళ్ళ చేతుల్లోపడి ఆ ఉద్యమానికి లేని అపవాదు వస్తున్నది.

గోప : ఆఁ. ఏం ఉద్యమమో. ఏ షావుకారునో అడిగితే అప్పివ్వడూ? ఈ సంఘాలెందుకూ?

నర : అదేమిటి గోపయ్యా-అలా అంటావు. షావుకారు అప్పూ ఇస్తాడు, ముప్పూ తెస్తాడు. భూమీ బుట్రా అమ్మించేదాకా అప్పిస్తాడు. నేనందులో చిక్కేకదూ ఇందాకా వచ్చాను. దానికీ దీనికీ ఏం సంబంధం?

సహకారసంఘమంటే మనమందరం కలిసి పెట్టుకునేది. ఒకరు చేయలేని పనిని సహకారసంఘం చేస్తుంది. అక్కడో చెక్కా, ఇక్కడో చెక్కా వుండే భూఖండాలవారంతా కలిసి ఏ ట్రాక్టరునో సహకారసంఘంద్వారా కొని సుఖంగా, సులభంగా సాగుచేయవచ్చు. సహకార స్టోర్సు

పెట్టుకొని సరుకులూ, గుడ్డలూ, ఎరువులూ-ఒకటేమిటి. అన్ని వస్తువులూ కొనుక్కోవచ్చు. వస్తువులు చౌకగానూ గిడతాయి; మంచివీ లభిస్తాయి. పైగా-దానిలాభాలను కూడా సంఘ సభ్యులే పొందొచ్చు. అసలు-సహకార సంఘం చేయలేని పనేముంది గోపయ్యా?

నీకు ౧౦ గల గేదెలు, ఆవులు వున్నాయిగా. నీలాంటి వాళ్ళంతా ఒక సహకార సంఘంగా ఏర్పడి తలా నాలుగు పైసలేసుకుంటే ఓ రిక్షాయో, టాంగాయో వస్తుంది. దాని మీద పాలు, వెన్న, నెయ్యి బస్తీకి పంపి వ్యాపారం చెయ్యొచ్చు. అది కొందరికి వృత్తిగాకూడా వుంటుంది. దానివల్ల ఇన్ని లాభాలుంచుకొని-వెంకటపతిచేసిన తప్పుడు పనికి సహకారోద్యమాన్నంటే ఏం బాగురా?

గోప : నిజమే కావచ్చుగాని-అన్నా! ఇప్పుడీ పరిస్థితినుంచి గట్టెక్కే దెట్లా? నాకీ అపసవ్యపు వ్యవహారాలంటే తలనొప్పి. వెంకటపతిదగ్గరికెళ్ళి—దీని సంగతేమిటో అమీ, తుమీ తేల్చుకొని వస్తాను. నన్ను చిక్కుల్లో పెట్టి పండాపుడిగా వెళ్ళిపోయాడు. పట్టుపట్టమంటే-నేనెక్కడ తెచ్చేది అంత గబ్బు? వస్తానన్నా. సీత లోపలేవుంది వెళ్ళు.

నర : మళ్ళీ ఇప్పుడే వస్తావుగా. నీతో అవసరంగా మాట్లాడ వలసివుందని ఇందాకే చెప్పాను.

గోప : ఏమిటది?

నర : తొందరేంలేదు. తీరిగ్గా చెప్పాలి. అంతక్కైతే నీవొచ్చేదాకా వుంటానులే.

గోప : సరె-వస్తాను. (గోపయ్య బయటికీ, నరసయ్య లోపలికీ వెళ్తారు. క్షణంసేపటికి పాపన్న వస్తాడు)

పాప : గోపయ్యగారూ! గోపయ్యగారూ! (ఎవరూ పలకరు. అక్కడున్న వడ్లబస్తామీద కూర్చుంటాడు. మళ్ళీ పిలుస్తాడు. ఎవ్వరూ జవాబివ్వరు. తన పాటను గొణుక్కుంటాడు)

పాప : (మళ్ళీ) గోపయ్యగారూ! గోపయ్యగారూ! (నరసయ్య బయటికొస్తాడు) నర్సయ్యన్నా! గోపయ్యగారు లేరా ఎట్ట?

నర : ఉంటే కనపడరూ? మీ వెంకటపతిగారిదగ్గరికే వెళ్ళారుగా.

పాప : నడవఁ కలవలేదులే.

నర : ఏవిఁట్రా—గోపయ్యకోసం వచ్చావు? బ్యాంకు డబ్బేవఁన్నా వసూలుచెయ్యాలా?

పాప : ఈరెప్పుడన్న బాకీపడ్తేకదుండీ.వొసూలు జేసెటందుకు? ఏరే పనుండొచ్చిన్లేరి.

నర : ఏమిటంత రహస్యం?

పాప : ఏరే సాటేవుండదిలేగని (సీత బయటికొస్తుంది) అమ్మాయి గోరికి జెరవొఁస్తుండదేవొఁ. ఎట్టుండది?

నర : తగ్గినట్టేలే. ఏమిటి సంగతులు?

పాప : ఇంగ మనకు వూళ్ల ఏరే ముచ్చటేవుండది? గొడ్లకు రోగాలొచ్చి జనం అల్లడం, తల్లడం అయితాంటె—ఈ శంద్ర వఁయ్య, దాసయ్యలంత జేరి—ఆటికి లగాయించి సూదులు పొడుస్తాండిరిగద—ఇంకేవఁన్నుండదా?

సీత : సూదు లెక్కించడం తప్పా?

పాప : గొడ్ల తిప్పలు మీకేం దెలుస్తది? అసలే—జెరంతోని వొను కుతాంటె.మన పానంకాదుగదా అని పయ్యంగ సూదు లెక్కిస్తె ఎట్లుంటది? పుండుమీన కారం జల్లినట్టుండదు?

నర : మరైతే ఏం చెయ్యాలంటావురా?

పాప : నేననేదేవుండది? ఊరందర్నరుగురి, ఏవంటాౘ్రో.

సీత : చెప్పరాదూ—ఏమంటున్నారో.

పాప : ఎట్లనన్న నల్లబడే ఉపాయం సూడాల్నంటరు. ఇంకేవం టరు?

నర : అంటే—నీచేత నయంచేయించాలంటారంటూ. అంతేనా?

పాప : అదేంఁనన్నో—అట్లంటవూ. నయం జెయ్యొచ్చినోడు నయం జేస్తడు. నామీన నమ్మకం లేకుంటె—పట్నుకారి కెల్లి బైస్నోన్ని బిలిపిస్తరు. గంతేగద. ఎటుబడి దానికి శాంతయితె జరపాల్నంటావా? వొద్దంటవా?

నర : అంటే—ఇంటికి మా నెడుబియ్యం, కూపాయి డబ్బులు రావాలండూ?

పాప : అంతకన్న తక్కువ జేసేటోడుంటె రమ్మన్రేయిఁ. ఓలో స్తరోసూస్త. కర్సంటె—ఉండదుమల్ల. నేనేవఁన్న తింటానా? ఏటపోతులు దేవాలె; అన్నాలొండాలె; దేవరకు బెట్టాలె. మరిదంత వూకెనే అయిద్దంటవా?

సీత : అయితే—పూరువాళ్ళంతా ఇదే చేయాలంటున్నారా?

పాప : లేందే నేనెందుకంట? తీర—సెయ్యిజారిపంక మల్ల గప్పు డొచ్చి పాపన్నా ఇంగ నువ్వే తిప్పలు బడాల్నంటె నాకు మటుకు సేతగావొద్దు. గందుకే—ముంగల్నే పెద్దల సెపు నేసి పోదాయనొచ్చిన.

నర : గొడ్లకు టీకా లొద్దని నాతో ఎవరూ అన్లేదే?

పాప : అట్లయితె—నేనబద్ధం ఆడుతున్ననంటవా ఎట్ల? అంతకైతె—సాకలి రాపుఁడు, కుమ్మరి సోవఁడు ఏఁవని మొత్తుకుంటున్రో జర ఇన్రాదు. వద్దన్నాను?

నర : అలాగా? అయినా—ఈ పటివరకు వాళ్ళ మందులు వాడి చూస్తే ఏం?

పాప : ఇంగ నువ్వు జెప్పే దెట్టుందంటె—ఎనకటికొరో సచ్చినోడి కన్నల్ల •ఏలు బెట్టి సూసిండంట. తీర ఇసవెక్కిచ్చినంక ఏకే సూసేదేవుండది?

సీత : ఏమిటీ ! వాళ్ళెక్కిచ్చేది విషమూ! ఎవరన్నారు?

పాప : ఓరసేదేంది ఏకే. మనూల్ల ఎంకటపతిగారికి తెలవని ఏము వ్వ టుంటదంటరా?

నర : ఆ మాత్రం చప్పం, దాను వాళ్ళకు తెలియదంటావా?

పాప : మనూల్లకేంగాంవాలో ెల్లకేం ఎరక అన్నా—నువ్వేళ్ళె అంటవూ. ఇంగ సూసినవుగద—ఊల్లెడున్న పిల్లగాల్లంత తప్పకుంట బల్లెకు రావాల్నంట. ఇదొకట బెట్టిను. ఇదే వన్న మనకు కుదిరేదేనంటావా?

సీత : పిల్లలు తప్పకుండా చదవాలనడం తప్పా?

పాప : ఈడు బొయ్యి బల్లె జదువుకుంటగూకుంటె — గొడ్డోరు గాస్తరు? ఇంటికాడ నంటోల్లను ఓరాడిస్తరు?

సీత : అలాగని—చదువుల్లేకుండా పిల్లల జీవితం నాశనంచేయడం అన్యాయంకాదూ?

పాప : సదివి ఇంతకన్న బాగుపడ్తవాంవెట్లు? నేనిప్పుడు దస్కతు దస్క నేర్సి నేస్తుండదేందంట? ఇంతకంటె బాగుపడేది లేదు; సెడిపొయ్యేదిలేదు.

నర : ఎందుకు బాగుపడకూడదూ? దాను మన కళ్ళముందుపుట్టి ఇంతవాడుకాలే? వాళ్ల వాడలోనే ఎర్రమైసన్న కొడుకు చదివి ఇప్పుడు తాసిల్దారుకాలే? వాళ్లంతా నీ కన్నా ఏ స్థాయిలో ఎక్కువ?

పాప : అఁ—మాకెందుకు లెద్దుగూ సదువులు? ఆడోల్లయితెనా—అత్తగారింటికి పొయెటోల్లేనాయె. ఇంగ-మొగోల్లయితె—ఏ గోసిగుడ్డ బెట్టుకున్నా బత్తరు. మా తాతలు బత్కలేదా? మా అయ్యలు బత్కలేదా?

సీత : ఆ బతుకే బాగుందంటావా?

పాప : అంతకంటె మాకింక మేడలు గావాల్నంటె వస్తయా? గుమ్మలు గావాల్నంటొస్తయా?

నర : అసలు-అనుకోని దేనికైనా ప్రయత్నమంటూ చేస్తేగా ఏవైనా వచ్చేవి?

పాప : అఁ అయ్యన్ని మాకెందుకులేరిగనీ.-ఇట్ల బతికినన్నాల్లు బుద్ధిగలిగి బతికెతె సాలు...సూడబోతె - గోపయ్యగారు ఇప్పట్ల రానట్టేవుండది. మల్లొచ్చి కలుస్తలేరి.

సీత : సరె అట్లాగే. (పాపన్న వెళ్ళిపోతాడు)

నర : చూశావా సీతా—గ్రామాల్లో మనుషుల మనస్తత్వాలెలా వుంటాయో?

సీత : ఇట్లా పెడగా వాదించేవాళ్ళు ఎక్కడైనా వుండొచ్చుగా?

నర : ఉండరని కాదు. తెలియని మూర్ఖత్వానికి చెబుతున్నా. ఇప్పుడు పిల్లలకు చదువొద్దన్నాడా. తీరా-వాడి తోటివాళ్ళు చదివి గొప్పవాళ్ళయ్యాక పశ్చాత్తాపపడ్తాడు.

సీత : అటాంటి పశ్చాత్తాపం కలిగే సూచనలుకూడా ఎక్కడా లేవే?

నర : అదిప్పుడు కనబడదులే. వాడికిప్పుడంతా వెంకటపతే. ఆయనే దేవుడు; ఆయన చెప్పేది వేదం. చూశావా—పశువుల కెక్కించేది విషమట.

సీత : ఆc—ఇదంతా తన స్వార్థానికి కల్పించివుంటాడు.

నర : నిజమేకాని—అదిమాత్రం వాడి ఆలోచనంటావా? వెంకటపతి అనమనివుంటాడు.

గోప : (గబగబా వస్తాడు) ఏం వెంకటపతా, ఏమిటో. నమ్మిన వాడినేనా మోసంచేయడం?

నర : ఏమైందిరా?

గోప : ఏం అయ్యేదేముంది? ఇంట్లో ఉండికూడా లేడనిపించాడు.

నర : అయితే ఇదేదో దురుద్దేశ్యంతో చేసినపనే.

గోప : ఇంత అన్యాయమా అన్నా.

నర : డబ్బురా గోపయ్యా డబ్బు. దాన్ని చూస్తే ఎవరికైనా దుర్బుద్ధిపుడుతుంది. నీతి తప్పినవాడేమో-చప్పున కాజేస్తాడు. కాస్త నీతిమంతుడేమో-గుటక లేస్తుంటాడు. అదీ తేడా.

గోప : దీనికేమిటిమార్గం అన్నా?...సీతా! జ్వరంతోవున్నదానవు. ఎందుకిట్లా చలిలోకొచ్చావమ్మా.

సీత : ఇప్పుడేమీ జ్వరంలేదునాన్నా.

గోప : అయినా నీకెందుకమ్మా ఈ గొడవలు? మేమే ందుమీదై చస్తున్నాం. నీవు కాస్త విశ్రాంతి తీసుకోరాదు తల్లీ.

సీత : ఏం పర్వాలేదునాన్నా.

గోప : వద్దుతల్లీ. లోపల పడుకో. అన్నీ తరువాత తెలుసుకుందువు గానిలే. నామాట విను సీతా.

సీత : సరె నాన్నా. (లోపలకెడుతుంది)

గోప : ఏం అన్నా! ఏమిటంటావు ఉపాయం?

నర : ఈ అప్పులెవరెవరికెంతెంత ఇచ్చారో రిజిష్టర్లు చూశావా?

గోప : ఆఁ. నేనా వివరాలన్నీ ఎందుకు చూడబోతాను — నా పనేమో, నేనేమోగాని.

నర : సరె—ఇప్పుడైనా ఆ వివరాలు వాకబుచేద్దాం. అయితే— ఈ విషయంలో నీవు చంద్రం, దాసుల సలహాలు తీసుకోవడం మంచిది.

గోప : వాళ్ళ దగ్గరకు వెళ్ళడానికి మనసొప్పదన్నా.

నర : అదేమిటొరి—వాళ్ళేమైనా నీకు పగవాళ్లటరా? నీ పూరుకు ఎంతో ఉపకారాలను చేశారు. ఊరంతా వాళ్ల కృషికి జోహారు లర్పిస్తుంటే—నీవింకా పిచ్చిపట్టుదలతో పెరటి తోవనే ఉన్నావు గోపయ్యా. అయినా—నీకో ముఖ్య విషయం చెబుదామనుకొన్నానని ఇందాకే అన్నాను.

గోప : ఏమిటది?

నర : నీకసలు చంద్రం ఒక పెద్ద అధికారి కావాలనేగా ఉద్దేశ్యం?

గోప : అనుకున్నాను-అలా కావాలని. కాని—ఏంలాభం?

నర : అతను అంత అధికారి కాలేకపోయినా ఒక గొప్ప అధికారికి అల్లుడు కాబోతున్నాడు.

గోప : ఆఁ. అదేటన్నా!

నర : అవును. చంద్రంయొక్క గొప్పతనాన్ని నీవు గుర్తించలేకపోయినా-నీవు ధ్యేయంగా పెట్టుకున్న పెద్ద అధికారి - మరెవరోకాదు-మన జిల్లా కలెక్టరు అతనికి తన పిల్లనిద్దామనుకుంటున్నాడు.

గోప : నిజవాఁ? చందర్రిం అంత గొప్పవాడా అన్నా?

నర : నీవిది నమ్మడం కష్టం గోపయ్యా. ఎప్పుడూ పెరటిచెట్టు మందుకు పనికిరాదంటారు. అలాగే నీచేతుల్లో పెరిగిన

చంద్రం గొప్పతనం నీకు తెలియడం కష్టం. నేనిలా అన్నందుకు ఏమనుకోకు. మనకున్న కొద్దిపాటి జ్ఞానంతో అతనికి విలువ కట్టడంలో అర్థంలేదు. అసలు గొప్పతనమంటే ఎలా వుంటుందని నీ వుద్దేశ్యం? తాను నమ్మిన ఒక మంచిపని కోసం ఉద్యోగాన్నీ, డబ్బునూ, సుఖాన్నీ, చివరకు ప్రాణాల్నికూడా త్యాగంచేయడమే గొప్పతనం. త్యాగ ధనమే అన్ని ధనాలకన్నా గొప్పదన్నారు. అయితే ఇతరుల గొప్పతనాన్ని గుర్తించే యోగ్యతకూడ మనకుండాలి గోపయ్యా. అన్నీ తెలిసినవాడు గనుక—ఆయోగ్యత కలెక్టరుకుందని వొప్పుకుంటావా?

గోప : ఇక చెప్పకన్నా—చెప్పకు. నాకివేళంతా అయోమయంగా వుంది. నే నెక్కడికో పాతాళానికి కుంగిపోతున్నట్టుగా వుంది. దొడ్లో ఉప్పలి, అమ్మాయికి జ్వరం, వద్దనుకుంటున్న సూదిమందు, నమ్మిన వెంకటపతి చేసిన అన్యాయం, నేను కాదని వెళ్ళగొట్టిన చంద్రాన్ని కలెక్టరు గొప్పవాడని గుర్తించడం—అన్నా! ఇవ్వన్నీ నన్నెక్కడికో చీకట్లోకి, అయోమయానికి తీసుకుపోతున్నాయి.

నర : అలా అనుకోకు గోపయ్యా! ఈ అయోమయానికి భయపడాల్సిందీ, ఆశ్చర్యపడాల్సిందీ ఏమీలేదు. మన ఆలోచనలే అయోమయంగా వున్నప్పుడు—ఫలితాలు అయోమయంగా వుండవూ?

గోప : నేనేం తప్పుడాలోచనలు చేశానన్నా?

నర : సమయం వచ్చింది గనుక చెబుతున్నాను గోపయ్యా. నువ్వు మొదటినుంచి పొరపాటే చేశావు. ఉద్యోగం వదిలి వచ్చాడని—అనవసరంగా చంద్రాన్ని వెళ్ళగొట్టావు.

గోప : అతని తప్పుకాదంటావా అన్నా?

నర : కాదు. ఆపని చేయగలిగాడు గనుకనే గొప్పవాడయ్యాడు. దానికి తార్కాణంగా కలెక్టరు నిర్ణయాన్నే తీసుకో గోపయ్యా. కలెక్టరు తలుచుకుంటే—ఏ పెద్ద ఉద్యోగికో అతని కూతురు నివ్వలేడనే అనుకున్నావా?

గోప : ఎందుకివ్వలేకుండా ఉంటాడు.

నర : మరి బల్లదగ్గర కూర్చొని పనిచేయడమే గొప్పనుకుంటావా? తన తోటి మానవజాతి శ్రేయస్సుకోసం—తన విజ్ఞానాన్ని ధారపోయడమే ఘనత. ఈనాడు—మన ఫిర్కా అంతా చంద్రం, అతని సహచరులు—లెమ్మంటే లేస్తుంది; కూర్చో మంటే కూర్చుంటుంది. ౧, ౨ ఏండ్లలో ఇంత పేరు వాళ్ళ కెందుకొచ్చింది? మనం ఇన్నేండ్లనుంచి ఇక్కడుంటున్నాం. మన నెవరూ తలిచేవారే లేరే. ఎందువల్ల? మనం ఎవరికి ఎలాంటి ఉపకారమూ చేయలేదు. పైగా—అపకారం కూడా చేసివుంటాం. మన బ్రదుకును మనం వెళ్ళదీసుకున్నాం. వాళ్ళు తమ గ్రామాల బ్రదుకునే తమ బ్రదుకుగా భావించి కృషిచేశారు. తమ కష్టంద్వారా, తమ సత్ప్రవర్తనద్వారా వారి కీర్తికి పునాదులు వేసుకున్నారు గోపయ్యా. గాంధీ గారు—గొప్పవారెలా అయ్యారు? రోగాలతో, దరిద్రంతో, అజ్ఞానంతో బాధపడే తన తోటి మానవజాతి అభివృద్ధికోసం కృషిచేశాడు; రాత్రింబవళ్ళు రోగులకు సేవచేశాడు; నీకొచ్చే నామోషీలు ఆయనకు లేవా? నీకున్న డబ్బు ఆయనకు లేదా? అయినా-ఆయన అర్థంలేని నామోషీలకు పోక—తాను మంచని నమ్మిన పనికోసం కృషిచేశాడు. ఎందుకు చేశా డిదంతా? చెప్పు గోపయ్యా—నువ్వే చెప్పు.

గోప : ఏమిటన్నా—ఇవేళ నువ్వు ముక్క ముక్కలుగా నరికేస్తున్నావు. ఎక్కడలేని ఆవేశం నీలో ప్రవేశించింది.

నర : అవును గోపయ్యా. ఇన్నాళ్ళనుంచీ మనం చేయని పనులన్నిటినీ చంద్రం, దాసులు మనంగా చేసి చూపుతుంటే— మనుషుల్లో ఇంత శక్తి వుంటుందా అనిపిస్తున్నది. ఇవేళ కట్టబోయే దానికి ఇంతమందిని ఎలా కూడగొట్టారో నాకు ఆశ్చర్యం వేసింది. జనం సంతోషంగా పనికి పూనుకుంటే— యుగ యుగాలుగా ఆగిపోయిన పనులన్నీ క్షణంలో అయి పోతాయనిపించింది. వాళ్ళంతా ఉత్సాహంతో పాటలు పాడుతూ రాళ్ళు మోస్తుంటే ఊరుకోలేక పోయాను గోపయ్యా. నిజంగా ఎలాంటి మంచిరోజులు. మన జన్మ సార్థకమయ్యే రోజులొస్తున్నాయనిపించింది.

ఇన్నాళ్ళనుంచి మనం సోమరులుగా కూర్చున్నాం గోపయ్యా. పిచ్చికబుర్లతో, పెళ్ళితగాదాలతో కాలాన్ని వృథాగా—నిజంగావృథాగా గడిపాం గోపయ్యా. లేకుంటే మనవూళ్ళు ఎప్పుడో నందనవనాలయ్యేవి. మన వూళ్ళన్నీ చదివేవి. మన వూర్లకు రైళ్ళొచ్చేవి; విమానాలొచ్చేవి.

గోప : అన్నా! ఎంతదూరం ఆలోచిస్తున్నావు!

నర : ఇవ్వన్నీ చూస్తుంటే ఇప్పుడే మేలుకుంటున్నాననిపిస్తున్నది గోపయ్యా. అసలు పరిస్థితులు మారినంత తొందరగా నేను ఆలోచించలేకపోతున్నాననిపిస్తున్నది. సరేగోపయ్యా. నేనీ ఆనందంలో ఎంతైనా చెప్పేట్టున్నాను. కాని— వూరికే మాటలవల్ల ఏం లాభం? చేసి చూపాలి.

గోప : ఇంతకూ ఆ సంబంధం నిశ్చయమైందా అన్నా?

నర : కాలేదు. చంద్రానికి ఇష్టంలేదట. జరిగితే తాను మొదటి నుంచి ఆశలుపెట్టుకున్న అమ్మాయితోటే వివాహం జరగాలనీ, లేకుంటే అసలు పెళ్ళిచేసుకోకుండా వుండాలనీ వుందట.

గోప : కలెక్టరుగారి అమ్మాయి నిస్తానన్నా వద్దన్నాడా?

నర : అందరికీ మనలాగా మాటతప్పడం ఇష్టంవుండకపోవచ్చు.

గోప : నేను మాటేం తప్పానన్నా?

నర : మనిషి-తనతప్పును తానుతెలుసుకోగలిగితే ఇంక లోకంలో తగాదా ఏముంది? సరె ఇప్పటిక్కూడా మించిపోయిందేమీ లేదు. తెలివివుంటే ఉపయోగించుకో; లేదా వదులుకో.

గోప : కలెక్టరు తన కూతురునిస్తానన్నా వద్దంటే-ఆయనకు కోపం రాదూ?

నర : అనవసరంగా కోపాలొచ్చేవాళ్ళు—మంచివాళ్లనిపించుకోరు గోపయ్యా. కోపమెందుకూ? తన ఉద్దేశ్యాన్ని తెలిపివుంటాడు. అది చంద్రానికి ఇష్టంలేకపోవచ్చు. అంతే. అంతటితో ఆ ప్రస్తావన పోతుంది. అంతేకాని-అంత మాత్రాన కలెక్టరు—అతనిపట్లనున్న సదభిప్రాయాన్ని ఎందుకు మార్చుకుంటాడు? అవి-మన సంకుచిత బుద్ధికి తోచే అభిప్రాయాలు.

గోప : అయితే—మళ్ళీ నేను చంద్రం దగ్గరికి ఏం మొహం పెట్టుకొని వెళ్ళేది అన్నా?

నర : ఇవ్వన్నీ నీవు మనసులో పెట్టుకుంటావేమోగాని—అతను పెట్టుకోడు. నీకు నామోషిగా వుందనుకుంటే మరెవరినైనా పంపు.

గోప : ఆ పనికి ఇంకెవరున్నారన్నా. నీవే తగినవాడివి.

నర : మధ్యలో నన్ను ఇరికించాలని చూస్తున్నావా?

గోప : ఆమాటనకన్నా. జరిగిందేమో జరిగిపోయింది. ఇదంతా ఎందుకిట్లా జరిగిందో నాకే తెలియదు. చూశావుకదూ— ఒక్కసారి ఎన్ని చిక్కులొచ్చిపడ్డాయో.

నర : ఇందులో ప్రమాదమైనదేం లేదు గోపయ్యా. మన ఆలోచనలు పరిశుద్ధంగానూ, సక్రమంగానూ వున్నన్నాళ్ళు ఏ చిక్కులూ వుండవురా. జాగ్రత్తగా ఆలోచిస్తే ఇప్పుడేమంత పెద్ద చిక్కులున్నాయి చెప్పు? ఆ ఉప్పలికి నీవేం భయపడక్కర్లేదు. అది-ఊరక, నీరు వున్నచోట్లలో మొలుస్తూనే వుంటుంది. అమ్మాయికి జ్వరం వచ్చిందంటే— ఇదిగో ఇక్కడే గొడ్డూ గోదా కట్టెయ్యడంవల్ల దోమలతో ఈ చలిజ్వరం వచ్చింది. అయినా ఇంజక్షనుతో అదీ తగ్గిపోతున్నది. ఆ బిళ్లలతో పూర్తిగా పోతుంది. ఇక— ఎటొచ్చీ వెంకటపతి నాటకం. చూదాం అదెలాజరగాలో అలా జరుగుతుంది. అంతకైతే ప్రస్తుతానికి కొంత మాత్రం పట్టవలసి రావచ్చు. దానికి సిద్ధంగా వుండు. అంతకన్నా పైళ్ళూ, జుల్మానాలైతే వుండవులే.

గోప : ఏమో అన్నా. ఈ వ్యవహారాలన్నీ నువ్వే చూడాలి. నాకిలాంటి వ్యవహారాలంటే భయం. అందులో సర్కారుతో పని.

నర : ఏమీ భయపడకు గోపయ్యా. నేనదంతా చూసుకుంటాను. అనవసరంగా దిగులు పెట్టుకోకు. అన్నీ చక్కబడ్తాయి. నేనీవిషయం చంద్రంవాళ్లతో ఆలోచిస్తాను.

గోప : అన్ని సంగతులూ ఆలోచించు అన్నా.

నర : అట్లాగే. (వెడతాడు).

గోప : సీతా! సీతా! (సీత వస్తుంది).

సీత : ఏమిటి నాన్నా?

గోప : జ్వరమెలా వుందమ్మా?

సీత : ఇందాకే చెప్పానుగదు నాన్నా. తగ్గింది.

గోప : మళ్ళీ రాకుండా వుండాలిమరి. సరేగాని—నరసయ్యన్న ఏం చెప్పాడో విన్నావా సీతా?

సీత : నన్నిక్కడ్నుంచి తరిమావుగా?

గోప : వేరే ఏముంది సీతా. విశ్రాంతి తీసుకోమన్నాను. నామీద కోపమా తల్లీ?

సీత : అదేమిటి నాన్నా—నాకెవరిమీదా కోపం ఎందుకుంటుంది?

గోప : నీ ఇష్టప్రకారం నడుచుకోనివ్వలేదని కోపంలేదా తల్లీ?

సీత : ఇందరి ఇష్టం కుదరనప్పుడు ఎవరోఒకరు చెప్పినట్టు నడుచుకోవాలిగా మరి.

గోప : నిన్నట్లా తిరగొద్దన్నానంటే-నీ మేలుకోరే అన్నానమ్మా. పువ్వుల్లో పెరిగినదానవు—అలా రాళ్ళు మోయడం కష్టం కాదు తల్లీ.

సీత : ఒక్కొక్కరికి ఒక్కో పనిలో అభిలాష వుంటుంది నాన్నా. నాకాపనిలోవున్న ఆనందం నీకుచెబితే అర్థంకాదునాన్నా. నాకది కష్టమనిపించదు. అది—నా విధి అనిపిస్తుంది.

గోప : అంత అవసర మేమొచ్చిందమ్మా?

సీత : మనమీ వూళ్ళలో పుట్టడమే. ఈ గ్రామాలు అన్నివిధాలా బాగుండాలనుకోవడమే. అలా అనుకోగానే ఏం లాభం?

చేసి చూపాలిగాని. అయినా—ఇప్పుడిక ఆ విషయం అనుకొని ఏం లాభం?

గోప : కాదు సీతా—ఇక ముందు నీ ఇష్టమొచ్చినట్టుగానే నడువు సీతా. చంద్రం అడుగుజాడల్లోనే నడువు.

సీత : ఏమిటి నాన్నా—నీలో ఇంత హఠాత్తుగా మార్పు?

గోప : చెప్పలేను సీతా. నరసయ్యన్న నాకిప్పుడొక కొత్త ప్రపంచాన్ని చూపాడు. నే నిన్నాళ్లనుంచీ చంద్రం చేస్తున్నపని మంచిది కాదనుకున్నాను.

సీత : ఇప్పు డెలా మంచిదైంది?

గోప : లేకుంటే—కలెక్టరంతటివాడు—చంద్రానికి తన కూతురు నివ్వాననడం సామాన్యమా సీతా?

సీత : ఏమిటది నాన్నా—ఎవరన్నారు?

గోప : నరసయ్యన్న చెప్పాడమ్మా.

సీత : నిర్ణయమైందా నాన్నా?

గోప : నువ్వేమనుకుంటున్నావమ్మా?

సీత : (దిగులుగా) నేనేమనుకుంటాను? నాకీమాటే చెప్పలేదు బావ. అయినా—మనకూ, ఆయనకూ ఏం సంబంధం? నాకు జ్వరంవస్తున్నదని నీవుకబురంపావుగనుకనా—ఆయనీ విషయం కబురంపడానికి? అవును. ఆయనకూ, నాకూ ఏమిట సంబంధం?

(లోపలికి పోబోతుంది).

గోప : (ఆపి) అదేమిటమ్మా—అప్పుడే లోపలికి పోతున్నావు?

సీత : (ఏడుపు వచ్చినంత పనవుతుంది) విశ్రాంతి తీసుకుంటాను నాన్నా. విశ్రాంతి తీసుకుంటాను. ఆగదిలోనే పడుంటాను.

నా కేపనులూ వద్దు; నేనేమీ చెయ్యానక్కరలేదు.... ఈ జ్వరం తగ్గకున్నా బాగుండేది.

గోప : సీతా! ఈ ముసలాడిమీద నీకింత కోపమైతే ఎలాగమ్మా? నీకంటే నాకెవరున్నారు తల్లీ? నీవు సుఖపడుతుంటే చూడడం కోసమే నేనింకా బ్రతికున్నాను సీతా!

సీత : ఏమిటినాన్నా—ఈ మాటలు? నాకిప్పుడేమైంది?

గోప : ఏమైందో ఇన్నాళ్లకు తెలుసుకున్నాను సీతా. చంద్రం అంత గొప్ప సంబంధాన్ని వదులుకుంటాడని నేనెప్పుడూ వూహించలేదమ్మా.

సీత : (తెప్పరిల్లి) అదేమిటి నాన్నా—బావ ఆ సంబంధాన్ని కాదన్నాడా?

గోప : మనసొకచోట వున్నాక ఎలా వొప్పుకుంటాడమ్మా. నేనతని మనస్సుకు కష్టంకలిగించి పాపాని కొడిగట్టదలుచుకోలేదు సీతా.

సీత : ఏమిటినాన్నా నువ్వనేది? నాకర్థం కావడంలేదు.

గోప : అర్థంకాలేదా పిచ్చితల్లీ. అర్థమయ్యేట్టు ఎలా చెప్పనమ్మా! (చిరునవ్వుతో సీత గడమ పట్టుకుంటాడు...కొవరన్న వస్తాడు)

కొమ : గోపయ్యగారూ! టపాలతవరికో జాబొచ్చిందండి. చంద్రం గారు పంపేను. (ఉత్తరం ఇస్తాడు)

గోప : అం. మనకెప్పుడూ టపాలో ఉత్తరాలు రావే. అమ్మాయీ నీవుత్తరమేమో చూచుకో తల్లీ. (లోపలికి పోబోతాడు)

సీత : అడ్రసుచూసి నీపేరనేవుంది నాన్నా. (చింపుతుంటుంది)

కొమ : సీతగారి కెట్టుందండీ జెరం?

గోప : కాస్త తగ్గిందిరా. మళ్ళీ రాకుండా వుండాలిమరి.

కోమ : దాసుగారు మందియ్యలేదా ఎట్ట? సూది యెక్కిస్తె జెరం, జాడా జబాబులేకుంట పోదుండి?

గోప : ఆఁ—అవంత గొప్ప మందులట్రా?

కోమ : సిన్నంగంటరూ! మీ అసుంటోరు ఊకునేరినాఁగని - పూరు పూరంత గత్తర పాకకుంట మందులియ్యలేదుండి. ఆరు లేకుంటె—మరా పాడురోగ పేఁవన్న ఆ లెక్కన'ఖ'డేరావ్' అన్నట్టు ఆగుసంటదా? శనామందికి సూదిమందులిచ్చి దాన్నాపిరి. ఇంగ ఊళ్ల పరే రోగాలను సయం జేసిన ముచ్చట్ జెప్పినారు. పలుగాడు, లచ్చలుగాడు, సూర్లను గోరి—సూర్లు.

గోప : నీ మొహంం. చదివేస్తే వున్న మతి పోయినట్టు—రోజూ చదువు తున్నావేమో మాటలు వెనక్కు పోతున్నాయే?

కోమ : సదువుతగని—ఎనకటి అలవాటు పోలేదుండీ పాపై. అయిన గని—నేను ఈ ఈన్న సదువు షురూజేస్తి. ఎట్టనైన కట్టం గాదా? ఇంక—సందరింగారి వున్నాన మాంవోన్ని బల్లేసిన. అడెట్ట దేల్తదో సూడాలెమల్ల.

సీత : నాన్నా! ఈ ఉత్తరం బ్యాంకునుంచి వచ్చింది.

గోప : దేని బాబతమ్మా?

సీత : అదే-సహకార సంఘంబాబతే. ౭౫౦ రూపాయలూ వడ్డీతో వారంరోజుల్లో కట్టకుంటే జప్తు జరుగుతుందని నోటీసు.

కోమ : ఒసోస్. ఇసుంటుత్తరవేఁనాఎట్ట పావన్న కోటాస్తె ఇచ్చొచ్చిన.

గోప ; ఇంకేం. అదీ ఇదే కావచ్చు.

కోమ : వస్తనుండీ. ఉత్తరాలు శనావుండై. ఊళ్ల పంచాలె.

గోప : సరే—మంచిది. (కొమరన్న వెడతాడు) ఏమిటీ నాటకం? ఉండీఉండి ఇంత పెద్దేత్తు ఎత్తాడు. వీడికిదేం రోగం?

సీత : సొమ్ము సంపాదన కిదో మార్గం.

గోప : పైగా—ఇదివరకిచ్చిన వందబోను—మళ్ళీ ఆరుం సట్టాలో, ఏం ఖర్మో.

సీత : ఆ వందకు రశీదు తీసుకోలేదా?

గోప : ఆ తెలివుంటే ఇంకేముందీ. రాసి—తరువాత పంపుతా నన్నాడు. మళ్ళీ పంపాడా? లేదు. వస్తే ఆ పుల్లకు గుచ్చు తాగా. చూడూ—వుందేమో?

(సీత లోపలికెడుతుంది. చప్పున పాపన్న వస్తాడు)

పాప : సీతమ్మగారూ! సీతమ్మగారూ!

గోప : ఏమిట్రా అంత అపసోపాలు?

పాప : సీతమ్మగారు లేరుండీ?

గోప : ఎందుకూ?

పాప : ఉత్తరవొచ్చిందుండీ సదవాలె,

గోప : ఏమిటది ఇటు తే, చూద్దాం.

పాప : ఇది ఇంగిలీసులుందుండీ, మసకుతెలవదులేరి. (సీత వస్తుంది)

సీత : లేదు నాన్నా.

గోప : పంపందే ఎలా వుంటుంది?

పాప : (సీతకు ఉత్తరాన్నందిస్తూ) జర ఈ ఉత్తరం సదివి మతలబు జెప్పురి.

గోప : ఇంకెందుకూ? ఇదీ—అదే అయ్యుంటుంది.

పాప : ఏందుండీ? మీకేవఁన్నొచ్చిందా? కలకటేరుగారి పిల్లను శంద్రివఁయ్యగారి కిస్తవన్నరంటగదు. ఆ పన్నికి గిట్ట రమ్మని రాసినేరివాఁ.

గోప : నీ మొహం. దానికి నీకో ఆహ్వానమూ?

పాప : మీకొచ్చిందేవోఁగదుండి, మీతోపాటు నేను. మరి—మనసుంటోల్లు లేకుంటె పని పాటలు సూపెటోల్లోరు? ఊరి పెద్దాయె. ఎంకటపతిగారికూడ వొచ్చి వుంటది.

సీత : ఇది వారు పంపించిందే.

పాప : అదేందుండీ—బాగ సూసి అంటునారి? టపాలొచ్చిందుండీ. మీ పరోశికంగాసుంటె—ఎంకటపతిగారు నాకు పరే ఉత్తరం రాసుడెందుకు? సెప్పరూ—అంట్ల మతలబేందో పెల్లి పిల్సుడే నంటరా?

గోప : ఆఁ. పెళ్ళిలాగానేవుంది. సహకార సంఘంలో నువ్వెంత అప్పు తీసుకున్నావు చెబుదూ?

పాప : నాకెందుకుండీ అప్పు. ఎంకటపతిగారికె కావాల్నంటె—నా పేర రొంటూండలు రాసుకుంట వన్నరు. సరె—ఇష్టమొచ్చి నన్ని తీసుకోమన్న. నాకేదో అక్కరుంటె పదిచ్చినరిముకోరి అయినగని దానికి దీనికేంటంట? దాని ముచ్చటంత ఆరే సూసుకుంటరు.

సీత : ఏం చూసుకుంటారు? నువ్వు ఆ సంఘంలో నుంచి ౨౦౦ అప్పు తీసుకున్నట్టూ, ఇంకా అది చెల్లించనట్టూ నోటీసొచ్చింది. ఈ ౨౦౦ వారం రోజుల్లో చెల్లించకుంటే ఇల్లు జప్తవుతుంది.

పాప : ఇదెట్టాటి కతుండీ. నిజంగనే నంటరా?

గోప : నీ దగ్గర అబద్ధమాడాల్సిన గతేమిట్రా. నాకో ౪౫౦ కి, నీకో ౨౦౦ లకు జప్తునోటీసు లొచ్చాయి. ఇద్దరి నెత్తినా టోపీలు పెట్టారు నిండుగా.

పాప : ఇదే సత్తైవైతే ఇంగ జూద్రిమల్ల. నేన్యాడ దీసుకున్న నుండీ రెండొందలు?

సీత : సంతకం పెట్టావా లేదా?

పాప : దస్కతు కేవుండీ. శనా పెట్టిన. ౧౦, ౧౫ దస్క జాగీలను దస్కతులు పెట్టవంటె నే పెట్టిన.

సీత : ఏ దస్కతు దేనికి పెట్టావో తెలుసుకోవద్దూ?

పాప : ఇయ్యనోళ్లరు జూడబోతరుండీ—మీరళ్ళ్ని అంటారు? పెట్రా పాపన్నా అన్న కాడనల్ల దస్కతు బెట్టిన. అదిట్ట పెదదిరిగెతె ఊకుంటసంటరా? ఎంకటపత్తై తెనుటు కేవుండీ. ఆని బొక్క నవల్నుండి మల్ల బొక్క. ఈ ఆట మనకాడ కుదర్తాది. ఆ ఉత్తరవిట్టుదేరి. దాని లెక్కెందో సూసుకుంట. మనకాడ ఈ ఎవారాలు కుదుర్తాయి? (వెడుతుంటాడు).

గోప : అరేయి—అనవసరంగా అందాకా పోనివ్వకు.

పాప : అందనకేందుండీ? ఇట్టెటువారవైతె ఇంగబాగనెపుంటది. ఊళ్లె నేనన్నుండాలె; ఆడన్నుండాలె. ఇంపన్నాలవాం ! (వెడతాడు).

సీత : వాడలాంటివాడే నాన్నా.

గోప : వాణ్ణి ఆపకుంటే చంపేమన్నుకూడాను. నలుగురిని వెంట బెట్టుకొని వెడతాను. ఆ తువ్వాలిటు తే. ఇదేదో ప్రమాదానికే వచ్చింది.

(తువ్వాలు వేసుకొని 'ఒరే పాపన్నా ! ఆగాగు' అంటూ వెడుతుండగా తెర)

# అడుగుజాడలు

## ఐదవ రంగం

వెంకటపతి ఇల్లు

[ఇంటి ముందు వసారా భాగం. ౩, ౪ గురు కూర్చోగల బల్ల వుంటుంది. బల్ల నానుకొని ఇంట్లోకెళ్ళే గడప. తలుపు మూసివుంది. గొళ్ళెం లోపల పెట్టివుంది. ఒక ప్రక్కన స్తంభం. దానికి రాత్రి పూట బెడ్ లైటు వుంచబడుతుంది. ఇప్పుడు ఖాళీగా మేకుకు తగిలించ బడివుంది. ఒకచోట చిరుకోయ్యకు పగ్గాలు, తాళ్ళు వున్నాయి.]

(పాపన్న తువాన్గా వస్తాడు. దబదబా తలుపును బాత్తుంటాడు)

పాపన్న : ఎంకటపతీ! ఏయ్ ఎంకటపతీ ! తలుపుతీ! నీ ఆటలు నాకాడ సాగవు. ఇంట్ల ఎన్నాల్లుంటవ్? ఎల్లు బైటికెల్లు. ఎంకట పతీ ! ఇంగ నాకు కోపవొస్తె మన్సినిగాను. సొక్క నవుల్త మల్ల బొక్క. ఊఁ. తియ్యి. తలుపు తీస్తవా, గోడదున్కిరానా? మరాదగ తీస్తవా తియ్యి. లేకుంటె పానాలు దక్కవు. ముంగల్నే సెప్తుండ. ఇంగో ఎంకట పతీ !తీ—తలుపుతీ, వస్తుంప—గోడదున్కి, వచ్చిన్నంటె ఇంగ పూకునేదిలేదు. తీ తలుపు.

(తలుపు తీసి వెంకటపతి వణుకుతూ బయటికొస్తాడు. పాపన్న చప్పున అతని జుట్టందుకుంటాడు)

వెంక : ఏమిట్రా ఈ అన్యాయం? ఏమిటిది?

పాప : ఏందా ఏవొఁ వొనుకుతుండవూ?

వెంక : (మాట తబ్బిబ్బవుతున్నది) ఒణుకుతున్నానా? ఎందుకూ? నాకేం భయం? నేనేం తప్పు జేశానని?

పాప : మరి తలుపులుబెట్టి లోపల బన్న వెందుకు?

వెంక : జ్వరవొస్తున్నదిరా. చెవులు దిమ్ములుపడ్డాయి; వినపడ్డేదు.

పాప : ఇప్పుడెట్టనో ఇనబడతుంటదీ?...ఏందీ కాయితం?

వెంక : ఏమిటది? నాకేం తెలుసు?

పాప : (ఘాటైన దెబ్బతీసి) ఏం దెల్సేదేందయ్యాయి. నాకీ ఎవారవంత ఎరకైంది. నేను సంగానికి ౨౦౦ రూపాయలియ్యాలా?

వెంక : నాకుమాత్రం ఏం జ్ఞాపకం? కాయితాలు చూడాలి.

పాప : కాయితాలూ !(మళ్ళీ దెబ్బ వేసి) నీకు మతికలేదేం? నీకంత మందమతి పొడైనాది. పెట్టవన్న కాడల్ల దస్కతు జేసి సందుకు ఇదా నువ్వుజేసే నాయం.

వెంక : ఏమిట్రా ఇది? పోలీసులకు పట్టిస్తాను.

పాప : ఎట్టా—పోలీసోరికి పట్టిస్తావు. ఊళ్లోలకు నిన్నుబట్టిస్తే అంత తలాఇంత పీక్కతినరు? నీమాట పోలీసోరింటారు? ఏం నాయం జేసినవని? ఏందీ కాయితం? నాకు నువ్వ రొండొంద లిచ్చినవా?

వెంక : ఇస్తే అడగనురా?

పాప : అడక్కుంటె ఈ కాయితం వొచ్చేటట్టు జేసినావు! ఇంత న్యాలవా. మారాజు గోపయ్యగారి నెత్తిన ఠుంకి సెయ్యి బెట్టినావు. ఈ డబ్బంత మింగి ఏకే వోడ్డీలకిచ్చుకుంటావు. కక్కు-తిన్న డబ్బంత కక్కుతవా, కక్కవా? సంపుతవుల్ల ఏవనుకున్నవో!

వెంక : ఏమిట్రా ఇది-నేనెందుకు తిన్నాను? .

పాప : ఎందుకా? ఇందుకే. హామ్మా! అన్నాలంగ డబ్బు దిని మేడలు కడ్దామనుకున్నావు. (కసిదీరా చేతులతో కొట్టి,

కర్రతోటి తలమీద బాత్తాడు. ఇంతలో గోపయ్య, నర
సయ్య లందుకుంటారు. గోపయ్యగారూ, గోపయ్యగారూ
అంటూ వెంకటపతి నడిపోతాడు. గోపయ్య-పాపన్నను
ఆగబడ్తాడు. పాపన్న చెమటలు తుడుచుకుంటుంటాడు).

గోప : ఏం పనిరా ఇది పాపన్నా! అన్నా! నువ్వు వెళ్ళి దాసు గారిని తక్షణం రమ్మనమని కబురంపు.

(నరసయ్యన్న వెళతాడు. పాపన్న గోపయ్యనుంచి తప్పించు కోవాలని చూస్తాడు)

పాప : ఏం పనా? ఊళ్ల ఆడన్నుండాలె; సేనన్నుండాలె. ఒదుల్రి నన్ను. ఆని నెత్తురు దాగనుండిమల్ల. సెప్పినట్టల్లఇన్నందుకు ఇట్ల సేస్తాడు? ఒదుల్లుండి మీరిడుసురి... అంగో - సూడు. కదులుతుండు. ఊనికి జెరంవొచ్చినాది జెరం. బిడ్డడి జెర వొంగలగొక్త ఇడుసురి.

గోప : నీకే చెప్పేది. అన్నా మిన్నా కానకుండా ఏమిట్రా బాదటం? చావడూ?

పాప : సస్తె సచ్చిండు. ఊరి పీడొదుల్తది. ఇప్పుడీడుండి బాను జేసిందేందంట. ఆయింత సంపుత—వొదల్లుండి.

గోప : పడిశాప్—ఊరుకో. ఆ అన్యాయం నీకేనా? నాకుమాత్రం జరగలా?

పాప : మీరంటె సేకగాక పూకున్రు. సేనట్ల పూకుంటనా? ఆని బొక్క నవల్నుండి మల్ల బొక్క. అంగో కదుల్తుండు. ఒదుల్లుండి.

గోప : అంత ఉద్రేకమైతే ఎట్లారా?

(గబగబా చంద్రం, దాసు, కొవర్ల, నరసయ్యలు వస్తారు. దాసు చేతిలో మందులపెట్టె)

దాసు : వెంకటపతిగారిని లోపలికి పట్టండి.

గోప : వీడు ఆగడంలేదు.

చంద్రం : ఆగకుంటే కట్టెయ్యండి. కొమరన్నా! 'నీవిలారా. మీరు రాదలండి. (గోపయ్య, నరసయ్యలు వెంకటపతిని లోపలికి తీసుకుపోతారు. దాసు మందులపెట్టెతో లోపలికిపోతాడు. కొమరన్న, చంద్రంలు—పాపన్నను స్తంభానికేసి కట్టేస్తుంటారు).

పాప : ఇదేమన్నాలం. తప్పుజేసింది ఆడైతె నన్ను కట్టేస్తె రెందుక?

కోమ : తప్పుజేస్తె—నిన్నుసంపమని పోరుపుకుంటిచ్చిల్రా పాపన్నా?

పాప : తప్పుజేస్తె అట్నే సూస్త వూరుకోవాల్నా?

చంద్రం : తప్పుచేసినవాడికల్లా మనమే శిక్షవిధిస్తే-ఈపాటికిమనుష్య జనాభా తగ్గేది.

పాప : మరాడ్ని ట్నే కండ్లకద్దుకోవాల్నంటరా?

కోమ : ఊకోవే పాపన్నా. శిక్ష వేసెటందుకు సర్కారుండదే.

పాప : బడె ఖానూను జెప్తున్నవ్. అన్నాలం జేసింది మనకైతె సర్కారుకేం పని?

చంద్రం : అట్లా మనమే శిక్షలు వేస్తే నువ్వు చేసిన తప్పులకు ఇప్పటికి ఏ వందసార్లో చచ్చేవాడివి.

పాప : నేనేం తప్పుజేసిన?

కోమ : టపాడబ్బాల ఉత్తరాలు దీసినవా? పసులకిచ్చే మందుల్ల ఇసంపుంపన్నవా? ఊల్లల్ల పిల్లగాన్లను బల్లల్లకు పోవద్దన్నవా?

పాప : అయ్యాన్ని ఎంకటపతనవంటున్న.

చంద్రం : ఎలా పడితే ఏం? తప్పేగా. దానికి వెంటనే నీకు శిక్ష విధించవచ్చుగా?

పాప : (బాపురుమంటాడు) సంపుతవంటు—సంపుతేం. వద్దన్నాను.

కోసు : ఇప్పుడు ఎంకటపతిగారిపని అటైతె అదే పనయిద్దిలే. తొందరపడకు.

పాప : (ఏడుస్తాడు) మీరంత గల్సి నన్ను జైలుకు పోల్తరా? తోల్లేం.

చంద్రం : అవసరమైతే తోలకేం జేస్తారు? ఆవేశానికిక్కూడా అంతుండాలి. ఒంట్లో పొగరుందని ఇష్టమొచ్చినట్టు కొట్టడమేనా?

పాప : సప్పలేందే కొట్టిన్నంటరా?

చంద్రం : కావచ్చు. కాని—దాన్ని పరిష్కరించేసుకునే మార్గాల్లేవూ? ఇట్లా కొట్టగానే ఏమైంది? నీ పేర రాసిన ౨౦౦ రద్దయినట్టా? ఇప్పుడు—రెండువిధాలా నష్టం కాదూ? అటు ౨౦౦ కట్టవలసింది ఎలాగూ కట్టాలి. ఆయనగార్ని కొట్టినందుకు జైలుకూ వెళ్ళాలి. కోవఁరన్నన్నట్టు ప్రమాదమైన గాయమైతే—ఉరిశిక్షకుకూడా వెళ్లాలి.

పాప : (ఏడుపు ఎక్కువవుతుంది) కోవఁరన్నా! మీ అత్తను రమ్మన్రా కోవఁరన్నా. బుడ్డోణ్ణి ఎత్తుకోని రమ్మను. నీకాల్లు మొక్కుత. పో కోవఁరన్నా. పిల్లగాన్లను ఎత్తుకోని జల్ది రమ్మను.

చంద్రం : ఈ మాత్రం బుద్ధి మొదటేవుంటే ఎట్లావుండేది. ఒక్కణ్ణి చేసికొట్టాను. నలుగురొచ్చేవరకు తగ్గావు. ఇంత అధైర్యమూ మరి. చేసిందానికి అనుభవించాలి పాపన్నా.

పాప : కోవఁరన్నా! ఎంకటపతిగారి కెట్లుందదో సూడారి. తడాల్న కనతకే తగిలిందో ఏంకతో దెబ్బ.

కొమ : ఉండుమరి. కట్లు కడ్తాను.

పాప : మావోల్లను పిల్సకరావా కొవఁరన్నా—నీకు దండంబెడ్త.

చంద్రం : ఉండుండు. ఎవరొచ్చి సూత్రం ఏంచేస్తారు?

(నరసయ్య వస్తాడు)

నర : చంద్రం! నిన్ను వెంకటపతి రమ్మంటున్నాడు.

చంద్రం : వస్తున్నా. (లోపలికి పోతూ) నీవిక్కడే వుండు కొవఁరన్నా. అతన్ని కట్లు విప్పుకోనివ్వకు. (చంద్రం, నరసయ్యలు వెళతారు.)

పాప : ఎంకటపతిగారు బతికినట్టేనా కొవఁరన్నా?

కొమ : నీకు ఉరయితె తప్పించనుకో.

పాప : జైదు తప్పదా కొవఁరన్నా?

కొమ : ఏవోఁ మల్ల. పెద్దలంత ఏం తశ్వా జేస్తరో?

పాప : ఇంక ఊరికన్న పెద్దలోరుండరు కొవఁరన్నా? జర సంద్రం గారికి సెప్పు కొవఁరన్నా—నీకు దండంబెడ్త.

కొమ : మనం జెపితె ఆరింటారె పాపన్నా. న్యాలం ఎటుంటె అటు జెప్తరు.

పాప : నాదేం తప్పుంది సెప్పారి. రొంపొంపలు తీసుకోందే యాడికెల్లియ్యాలె?

కొమ : అట్టని సావగొడ్తారె?

పాప : ఎట్టన్న సుప్పు సంద్రంగారికి సెప్పిసూడు కొవఁరన్నా. ఎంకటపతి మాటలిని ఎసకటి కెట్టెట్టనో సేసినగని కొవఁరన్నా ఇట్రా!(కొవఁరన్న దగ్గరికొస్తాడు. పాపన్న అతని గడ్డం పట్టుకొని బతిమాలుతూ) నాగునం నీకు తెలవందా

కొవఁరన్నా. ఆరికి జెప్పాలె. లేకుంటె ఊరును నామీనికి ఉపకరో త్తె నేను సస్త కొవఁరన్నా.

కోము : ఊరంత ఆరు జెప్పినట్టు ఇంటడని నీకు అన్నాలం జేస్తరను కున్నవా ఎట్ట? అట్లెప్పుడు జెయ్యారనుకో... అంగో-అంతి లే వస్తున్ను. ఎంకపతిగారికి కట్లు గట్టిన్ను.

(అంతా బయటికొస్తారు)

దాసు : కట్లువిప్పు కొవఁరన్నా.

చంద్రం : ఆఁ. పాపన్నా. ఎలాగో అదృష్టవశాత్తూ వెంకటపతిగారు బతికార్లు. కనుక-నీకు ఉరిశిక్షయితే తప్పింది. వారు - ఎవరెవరి దగ్గర ఎంతెంత డబ్బు అన్యాయంగా తీసు కున్నారో అదంతా వారే కట్టేస్తున్నారు. కనుక-డబ్బు విషయంలో తగాదాలేదు. ఇక-కొట్టినందుకు నీ తప్పౌక టుంది. దానికి శిక్ష ఏం విధించాలో నీవే చెప్పు.

పాప : (గభాల్న ఏడుస్తూ చంద్రంకాళ్లమీదపడి) శంవదయా. ఏసిచ్చ ఇప్పిస్తె అదిప్పియ్యారి. పిల్లలు గలోన్ని.

చంద్రం : నా కాళ్ళ మీదెందుకు పడ్డావు పాపన్నా. తప్పు. కొట్టింది వారిని గనుక-వారి నడుగు.

పాప : (మళ్లీ వెంకటపతి కాళ్ళు పట్టుకుంటాడు) మీపయ. ఇంగ మీ దేవఁన్న జెయ్యారి.

వెంక : పాపన్నా! నా కాళ్లమీదెందుకు పడ్డావు? నిన్ను క్షమించే అర్హత ఇకనాకు లేదు-పాపన్నా. నాకింతకన్నా అవమాన మేముంది? ఈ పరిస్థితులను నేను చేతులారా కొనితెచ్చు కొన్నాను. ఇంకాస్త బలమైనదెబ్బ వేయవలసింది పాపన్నా. ఇంకాస్త బలమైంది వేయవలసింది.

పాప : తప్పయిపోయింది ఎంకటపతిగారూ! మీ దండంబెడ్తా. నా తెప్పు కాయిరి.

వెంక : ఇందులో నీ తప్పేంలేదు పాపన్నా. ఇందాకా నిన్నిరకంగా తయారు చేయడం నాదే తప్పు. ఆ వరపతిసంఘం దస్త్రం తెచ్చి చంద్రం, దాసుగార్ల కప్పగించు. అక్కడికి కొంత పూరట కలుగుతుంది.

(పాపన్న లోపలికి పోబోతాండు)

దాసు : ఒస్తు పాపన్నా! ఆగు. వెంకటపతిగారూ! ఆ దస్త్రం మా దగ్గరుండాలని మే మెప్పుడూ అన్లేదు మీరు వేరు; మేము వేరని ఎన్నడూ భావించలేదు. మనందరం చేయవలసిందల్లా అందరికీ ఉపయోగపడవలసిన సంస్థలను, పనులను స్వంతానికి ఉపయోగించుకోకుండా చూండడమే. కనుక—ఆ దస్త్రం ఎక్కడున్నా ఒక్కటే.

వెంక : దాసుగారూ! మీరు నన్ను బ్రతికించడానికి చేసిన సేవ జన్మజన్మాలకూ మరువలేను.

దాసు : అదేమిటండీ. ఒకమనిషి ఇంకో మనిషికి తోడ్పడడంలో పెద్దసేవ ఏముంది? అది నావిధి అనుకుంటున్నాను.

వెంక : అబ్బ! మీ కడుపులో ఎంత అమృతముందండీ.

చంద్రం : ఇందులో పొగడవలసిందేంలేదు వెంకటపతిగారూ! విశ్రాంతి తీసుకోండి.

పాప : నామాటేం జెప్పిరను ఎంకటపతిగారూ?

వెంక : మనకీచంద్రం, దాసుగార్లువుండగా వేరే కోర్టులు కావాలా? మన తగాదాలిక్కడే పరిష్కార మవుతాయి. వారే శిక్ష విధించినా నాకిష్టమే.

పాప : నా తప్పు వొల్లెబడెయ్యిరి. పెన్లాం పిల్లలకు దూరం జెయ్యకురి.

చంద్రం : చెప్పు సీరసయ్యన్నా. పాపన్నకట ఏశిక్ష విధిస్తావు?

నర : బాగుందే. నేను శిక్షలు విధించే వాడినా? అన్నిటికీ పెద్ద గోపయ్యున్నాడు. వాణ్ణే చెప్పమను.

గోప : అదేమిటన్నా. నీకన్నా తెలిసినవాణ్ణా? అయినా—ఇవి మా కాలాలు కావులెద్దూ. అన్నిటికీ వాళ్ళున్నారనుకున్నాంగా.

నర : గోపయ్యోనా ఈ మాటనేది?...ఇక మీరే చెప్పండి వాడి శిక్షేమి[illegible]?

చంద్రం : శిక్షంటేఫైళ్ళా, జుల్మానాలే కావుగా. చేసింది తప్పని మనస్ఫూర్తిగా గుర్తిస్తే చాలదూ?

పాప : తప్పేనండి. పెద్ద తప్పండీ. ఒళ్ళు తెలవక కొట్టిన. నా పెద్ద తప్పునబడ్డ. (ఫెళా ఫెళా చెంపలు వేసుకుంటాడు).

కోమ : బొక్కసప్పులు దెటుబాయెనే పాపన్నా?

నర : పోరా—ఇదేనా వాణ్ణి పరిహాసం చెయ్యడానికి సమయం?

వెంక . సవిలాడుగా సన్న.

పాప : ఏదో అయిపోయిందండీ. ఓంచరపడ్డ.

దాసు : నీకొకటే శిక్షవుంది పాపన్నా.

పాప : సెప్పురి; పెన్లాం పిల్లలకు దూరంగాకుంట వుండేది సెప్పురి.

దాసు : వేరే ఏంలేదు. ఇకముందు ఏవిషయంలోనూ విషప్రచారం చెయ్యకూడదు; తెలియనివిషయాలకు తప్పుడు వ్యాఖ్యానం చెయ్యకూడదు.

నర : మహోఘమైన శిక్షవిధించావోయ్ దాసూ! వాడికి తగినశిక్ష.

పాప : నరసయ్యన్నంతే అంటడు. నేనసుంటి పని ఎప్పుడుచేసిన్నే?

దాసు : తెలిస్తేచేసేవాడవో, కాదోగాని — గొడ్లకిచ్చే మందుల్లో విషం వుందనడం, దేశంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు ఏ ఒక్కరి సంతృప్తికో ననడం—ఇవ్వన్నీ తప్పులు కావూ?

వెంక : పోనివ్వండి దాసుగారూ! అవ్వన్నీ వాడి బ్రతుకుదెరువు కోసం అన్నాడు. ఇప్పుడెందుకు? కడుపు చించుకుంటే కాళ్లమీద పడ్తుంది. వాడి కసలు ఆ మందుల విషయమేం తెలుసని?

నర : అయినా వాడి కంఠశోషతప్ప—అవకాశం బుద్ధీ, పనీ రెండూ మంచివై కార్యక్రమం సాగుతుంటే ఈ ప్రచారాలేం చేస్తాయి?

కొమ : నరసయ్యన్న మాటన్నడంటె—అటేడు లోకాలు, ఇటేడు లోకాలు అల్లడం తల్లడం అయెటట్టుంటడు.

నర : పోదూ—మధ్య నువ్వో సోలిగాడివి.

చంద్రం : ఇందులో ఎవరూ తక్కువవారుకారు. అందరూ ఒక్కో రంగంలో ఆరితేరినవారు. అందరి అభిప్రాయాలు ఒక్కుమ్మడిగావుంటే గ్రామాల్లోజరగని అభివృద్ధి ఏంవుంటుంది?

వెంక : అదే—నే నిప్పటివరకూ చేయలేకపోయాను.

దాసు : జరిగిందానికి అనుకొని ఏం లాభం? జరగనున్నవాట గురించి ఆలోచింతాం.

నర : అసలివేళ వెంకటపతిగారు దాసుగారిని తాకి పైలబడ్డారు.

కొమ : అంగో సూసిన్రా—అన్న బాణం వదల్నె వదిలిండు.

వెంక : అన్న వూరికే వదలలేదు—ఆ బాణాన్ని. నాకుగుచ్చుకోటానికే వదిలాడు.ఆమాటకొస్తే దాసుగారు లేకుంటేమళ్ళీమిమ్మల్ని చూసేవాణ్ణా అన్నా? మీ అందరికీ లేని తప్పు నాకేమిటి?

పాప : కొవ్వ(ర న్నా ! ఆరారు అట్టనుకుంటె ఇంక మనకేందే?

గోప : వారేమిటి, మీరేమి(ట్రా? అంతా ఒకటే. ఊరంతా మనది; మనమంతా ఊరువాళ్లం.

కోమ : గోపయ్యగారేనా అనేది! గీమాట సీతమ్మగారింటె ఎంత బాగుండు!...నిండనూరేళ్లు.సీతమ్మగారేవొ(నరసరొస్తున్రు!

సీత : (గబాగబావచ్చి సీరియస్‌గా) ఏం చేస్తున్నారు నరసయ్యన్నా ఇక్కడ? మీరు పోసిన కట్టంతా మళ్ళీ గండ్లు పడ్డాయి. భోరున వానకురిసి నీళ్ళన్నీ వెళ్ళిపోతున్నాయి.

(అందరూ కలవరపడ్తారు)

గోప : ఆఁ—కట్టతెగిందా! నడవరేం? (అని అంతా చెంగులు చెక్కుతారు. పార తెమ్మనీ, తట్టలు తెమ్మనీ కేకలు వేసుకొని—అక్కడున్న వేవో తీసుకొని బయటికి వెళ్ళడానికి సిద్ధమవుతారు)

వెంక : పాపన్నా! నన్నుకూడా అక్కడికి తీసుకుపో. (అని లేవడానికి ప్రయత్నిస్తాడు. ఈ హడావుడంతా చూసి—వాళ్ళు బయటికి వెళ్ళేటప్పుడు)

సీత : నరసయ్యన్నా! ఆగండంతా. (అంతా ఆగుతారు. సీత పకపకా నవ్వుతుంది)

గోప : ఏమిటే నవ్వుతావు—అవతల కట్ట తెగి పడుస్తుంటే?

సీత : కట్ట తెగడమేమిటినాన్నా? మబ్బులన్నీ విచ్చుకుపోయి—ఫెళ్ళున ఎండకాస్తుంటే వాన రావడమేమిటి?

(అంతా అవతలికి చూసి నవ్వుకుంటారు)

కోమ : ఔమల్లె. ఇప్పుడు ఆనేందుండీ?

చంద్రం : బాగుంది. మమ్ముల కలవర పెట్టాలని అన్నావన్న మాట.

నర : కాదులేవోయ్ చంద్రం ! ఊరు విషయాలంటే ఎవరి కెంత శ్రద్ధవుందో చూద్దామని ఆటాడించింది లెద్దూ.

గోప : మొత్తంమీద చంపావుపో.

పాప : ఒక్కరవంన్న కొండకెల్లిసూసిన పాపాన బోవైంతి వేంవింరా కొవంరన్నా?

నర : అయితే అందరికీఈవిషయాల్లో శ్రద్ధపడ్డట్టేవుంది. అన్నట్టు-నేనో శుభవార్త మీకు చెప్పడం మరిచిపోయ్యాను.

కోమ : ఏందది చెప్పరూ?

నర : తొందరపడ్తే ఎట్లా? ఏరా గోపయ్యా! తీరా చెప్పాక చిక్కునపెట్టవుగద?

గోప : అదేమిటన్నా! నీ మాట నెప్పుడు కాదన్నాను? అయినా-అదేమైనా ఇవేళ కొత్త ముచ్చటా?

నర : మధ్యలో కొన్నాళ్ళు ఆ ముచ్చట మరిచిపోయ్యాంగా.

గోప : ఆఁ. తెలిసో, తెలియకో ఏవేవోఁ తప్పులుచేస్తాం. అవ్వన్నీ ఇప్పుడు తవ్వుకోవడమెందుకూ?

నర : ఆమాటన్నావు బాగుంది. సరె-వేరే చెప్పేదేముంది? మీ కందరికీ తెలిసిందే. చంద్రం, సీతల వివాహం నిశ్చయమైంది.

శంక : చాలా సంతోషం గోపయ్యగారూ! ఇప్పుడు నేనే ఆ ప్రస్తావన తెద్దామనుకున్నాను. (గోపయ్యను కౌగలించు కుంటాడు)

పాప : కలకమేరుగా లేదో అరి...

దాసు : అవును. దానికి వారు ఇష్టపడలేదు.

కోమ : మనసంత ఒక్కాడుంటె దాని కెట్ల వొప్పుతరే పాపన్నా—నువ్వేన్నే అంటవూ?

నర : పోరా—మధ్య నువ్వో సోలిగాడివి.

కోమ : ఎంత సంబరమైన మాటనుకున్ను. అట్లయితె—ఇంగ

"సీతమ్మ పెళ్లికూతురాయెనూ
మా శంద్రన్న పెళ్లికొడుకాయెనూ
మా కందరికి సంబరము ఆయెనూ
ఊరందరికి సంబరము ఆయెనూ".

(చివరి రెండు చరణాలనుంచి పాపన్నకూడా అందుకొని మళ్ళీ ఇద్దరూ ఆ నాలుగు చరణాలను పాడేస్తారు. సీత సిగ్గుగా తల వంచుకుంటుంది. నరసన్న—చంద్రం, సీతలను చెరో ప్రక్కకు నిలబెట్టుకుంటాడు. ఆ పాటవుతుండగా నెమ్మదిగా తెర)

—:o: సమాప్తం :o:—



◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆


ఆంధ్ర బుక్ హౌస్ ప్రచురణలు :

## మన్వంతరం

(నవల)

రచన : తారాశంకర్ బెనర్జీ

అనుకృతి : మద్దిపట్ల సూరి

వెల : నాలుగు రూపాయలు

✳

## అడుగు జాడలు

[ప్రణాళిక పోటీల్లో ప్రథమ బహుమతినందిన నాటకం]

రచన : కె. యల్. నరసింహారావు

వెల : రూపాయి

✳

త్వరలో :

## 'ఐక్యరాజ్య సమితి'

రచన : జి. వి. ఆర్. కృష్ణారావు

✳

ప్రతులకు :

## ఆంధ్ర బుక్ హౌస్,

సుల్తాన్ బజార్, : ✱ : హైదరాబాద్-1.


◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆



ముడు' గా — నరసింహారావు 'తెలుగు [illegible]' ద్వారా
'తెలంగాణా తీయతెన్నులు' [illegible]

[illegible] గా — ఇంకా ఆదర్శ లోకాలు, ఒకరోజు, గెలుపు[illegible],
అడుగు జాడలు, కొత్త [illegible]
గుండాలు, కాలప్రవా[illegible] లు మొద
లైన నాటకాలు, నాటికలు, మరి కొన్ని [illegible]లు
వ్రాశాను.

నటుడు గా — 'గ్రామ వెలుగు' నాట్యమండలి, 'జ[illegible] కళా
మండలి' నాట[illegible] [illegible]గొన్నాడు.

సహా[illegible] [illegible] గా — 'ప్రగతి', '[illegible]వా
పనిచేశా[illegible]

రేడియో ఆర్టిస్టు గా — హైదరాబాద్ [illegible] [illegible]రైటర్,
పార్టిసిపేటర్ పని చే[illegible]